# తెలుగింటి తత్త్వవేత్తలు

ఆచార్య ఆర్. వెంకటరెడ్డి

నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభల ప్రచురణ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రాష్ట్ర సాంస్కృతికశాఖ, సాంస్కృతిక మండలి

తెలుగు అకాడమి, హైదరాబాదు

Blank Page

తెలుగు అకాడమి ప్రచురణ
లఘు గ్రంథం (మోనోగ్రాఫ్)

# తెలుగింటి తత్వవేత్తలు

రచయిత
**ఆచార్య ఆర్. వెంకటరెడ్డి**
ప్రొఫెసర్ (రిటైర్డ్)
ఉస్మానియా విశ్వవిద్యాలయం
హైదరాబాదు

**4వ ప్రపంచ తెలుగు మహాసభలు**
**27,28,29 డిశంబరు, 2012**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రాష్ట్ర సాంస్కృతిక శాఖ, సాంస్కృతిక మండలి

తెలుగు అకాడమి, హైదరాబాదు

***teluginTi tatvaveettalu***

***a monograph published on the occasion of 4th World Telugu Conference***

***Author***

Prof. R. Venkat Reddy

First Edition : 2012

Pages : Pp. xviii + 118 + iv

©
Telugu Akademi, Hyderabad

Copies : 5000
Price : Rs. 30/-

Published by TELUGU AKADEMI, Hyderabad- 500 029 (Andhra Pradesh) under the Centrally Sponsored Scheme of Production of Books and Literature in Regional Languages at the University level of the Goverment of India in the Ministry of Human Resource Development, New Delhi.

*All rights whatsoever in this book are strictly reserved and no portion of it may be reproduced by any process for any purpose without the written permission of the copyright owners.*

***Published, Printed & Distributed by***

**Telugu Akademi**
**Hyderabad**

***Laser Typeset at***

Telugu Akademi, Hyderabad

***Printed in India***

Printed at M/s. Sri Lipi Graphics, Hyderabad

యన్. కిరణ్ కుమార్ రెడ్డి

హైదరాబాదు

# ముఖ్యమంత్రి
## ఆంధ్రప్రదేశ్

---

## సందేశం

ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారిని ఒక్క వేదికపైకి తీసుకువచ్చేందుకు, తెలుగు ప్రభలను దశదిశలా వ్యాపింపజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం డిశంబరు 27 నుంచి 29 వరకు ఏడుకొండలవాడి ఆవాసమైన తిరుపతి పుణ్యక్షేత్రంలో అత్యున్నత స్థాయిలో తెలుగు మహాసభలను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోనూ, దేశంలోనూ, ఇతర దేశాల్లోనూ ఉన్న తెలుగువారందరూ పరస్పరం భావ వినిమయం చేసుకోవడానికీ, తెలుగువారు తమ గత చరిత్రను సంస్మరించుకొంటూ, ఉత్కృష్టమైన భవిష్యత్తును నిర్మించుకోవడానికీ ఈ మహాసభలు ఎంతోగానో దోహదం చేస్తాయని మేము విశ్వసిస్తున్నాం.

తొలి ప్రపంచ తెలుగు మహాసభలు జరిగి 37 సంవత్సరాలు గడిచాయి. అయితే ఇంతవరకూ ఏ రాష్ట్ర ప్రభుత్వమూ ప్రపంచ సభలను నిర్వహించడానికి చొరవ చూపలేదు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ ప్రజాజీవితాల్ని ఎలా మెరుగుపరచాలీ తెలుగు వారి వైభవాన్ని ఎలా పరిరక్షించాలి అనే దృష్టితో పనులు చేపడుతోంది. తెలుగువారి నిర్వహణ సామర్థ్యాన్ని ఇటీవల జరిగిన జీవవైవిధ్యసదస్సులో కూడ ప్రభుత్వం నిరూపించింది. ఈ నేపథ్యంలో ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించడానికి సమాయత్తమైంది.

ఇటీవలి కాలంలో ప్రపంచవాప్తంగా ఎన్నో రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పరిణామాలు సంభవించాయి. వీటి నేపథ్యంలో బహుభాషా దేశమైన మన భారతదేశంలో తెలుగు భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, కళలు మొదలైన

విషయాల్లో జరిగిన కృషి గురించి, జరగవలసిన కృషి గురించి మనం చర్చించవలసింది ఎంతో ఉంది. ప్రపంచీకరణ నేపథ్యంలో మన తెలుగు భాష ఉనికిని కోల్పోకుండా పరిరక్షించేందుకు, తెలుగు ఔన్నత్యాన్ని పలుదిశలా చాటేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. నిత్యం ప్రజల హితం కోరి, ప్రజల అభీష్టాలను నెరవేర్చేందుకు, తెలుగు జాతి దేశవిదేశాల్లో తలెత్తుకు తిరిగేలా చేసేందుకు అవిరళ కృషి చేస్తున్న మా ప్రభుత్వం, తెలుగు తేజం కాంతులు వెదజల్లేలా ఈ మహోజ్వలమైన సభల నిర్వహణకు సమాయత్తమైంది. ఈ సభలలో సదస్సులు, తెలుగువారి కళా ప్రదర్శనలు, చేతివృత్తుల ప్రదర్శనలు, లలితకళా వైభవాన్ని చాటే కార్యక్రమాలు, రాష్ట్రేతర, విదేశాంధ్రుల సమావేశాలు మొదలైన ఎన్నో అంశాలతో పాటు, పుస్తక ప్రచురణ కూడ పెద్ద ఎత్తున చేపడుతున్నాం. అందులో భాగంగానే ఈ లఘుగ్రంథాల ప్రచురణ జరుగుతున్నది.

ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సమావేశాల సందర్భంగా ప్రచురించే లఘుగ్రంథాలు పాఠకుల ఆదరణ పొందగలవని ఆశిస్తున్నాము.

కిరణ్ రెడ్డి

(యన్. కిరణ్ కుమార్ రెడ్డి)

సి. దామోదర రాజనరసింహ

# ఉపముఖ్యమంత్రి

## ఆంధ్రప్రదేశ్

# అభినందన

**ఏ దేశమేగినా, ఎందుకాలిడినా**
**పొగడరా నీతల్లి భూమి భారతిని**
**నిలపరా నీజాతి నిండు గౌరవము**

అన్న మహాకవి రాయప్రోలు వాక్కులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారు నిత్యం స్మరించుకోతగినవి. దేశంలోని అన్ని రాష్ట్రాలలోనూ, ప్రపంచంలోని అన్ని దేశాలలోనూ తెలుగు ప్రజలు తమ ప్రతిభా పాటవాలను నిరూపించుకుంటూ ప్రశంసలు పొందుతున్న ఈ సమయంలో నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలు ప్రపంచ ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతిలో మన రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నది. ఇది తెలుగు భాషాభిమానులకూ, కళా సాంస్కృతిక రంగాలలో కృషి చేస్తున్నవారికీ ఒక పండగ.

ప్రపంచీకరణ నేపథ్యంలో మాతృభాషలను, మాతృసంస్కృతిని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత. ఈ సందర్భంలో తెలుగు భాష, జాతి వికాసం కోసం నిరంతరంగా కృషిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు భాషా సంస్థ అయిన తెలుగు అకాడమికి 150 లఘుగ్రంథాలను(మోనోగ్రాఫ్‌లను) రాయించి పుస్తకాలుగా తెచ్చే అవకాశం కల్పించాం. తెలుగు భాష, సంస్కృతి, చరిత్ర, సంప్రదాయాలు, తెలుగుభాషోద్యమాలు, సాహిత్యకారులు, సంఘసంస్కర్తలు, కథ, నవల, వ్యాసం, కవిత్వం లాంటి వివిధ సాహిత్య ప్రక్రియలు, ఛందస్సు, ప్రకృతివైద్యం, ప్రాచీన ఆధునిక సాహిత్య సాంస్కృతిక విషయా లన్నింటిపై, సాహిత్యచరిత్రలపై పుస్తకాలు రాయించి ముద్రిస్తున్న తెలుగు అకాడమిని అభినందిస్తున్నాను. కొద్ది సమయంలో పుస్తకాలు రాయించి ముద్రించడం అనేది ఓయజ్ఞంగా భావించి చేస్తేనే తప్ప ఈ పని పూర్తి కాదు, ఆ పనిని తెలుగు అకాడమి విజయవంతంగా నిర్వహిస్తున్నది.

ఇప్పుడు నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు మహాసభలు, ఈ సందర్భంగా ప్రచురిస్తున్న పుస్తకాలు మన భాషను, జాతిని, సంస్కృతిని, చరిత్రను సమున్నతంగా నిలబెట్టే యజ్ఞంలో, తెలుగు భాషా పరిరక్షణలో ఎంతో ఉపయోగపడతాయని ఆశిస్తున్నాను. తెలుగు భాష పరిరక్షణకోసం, ఔన్నత్యం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా జరుగుతున్న ఈ ప్రపంచ తెలుగు మహాసభలను ఆహ్వానిస్తూ, ఇన్ని పుస్తకాలు ముద్రిస్తున్న తెలుగు అకాడమి సంచాలకులకు, రచయితలకు మరియు అకాడమి సిబ్బందికి అభినందనలు తెలుపుతూ ప్రపంచంలో ఉన్న 18 కోట్ల మంది తెలుగు ప్రజల అభ్యున్నతి కోరుతూ.. మరోసారి అందరికీ నాహృదయ పూర్వక శుభాకాంక్షలు తెలుపుతున్నాను.

"తల్లి నుడికంటె పరమామృతంబుకలదె"

(సి. దామోదర రాజనరసింహ)

**V. VASANT KUMAR,** B.Sc.(Ag.); M.B.A
Minister for Tourism & Culture,
Archgology & Museums,
Archives & Youth Services & Sports, N.C.C.
Government of Andhra Pradesh

Room No. 501, 5th Floor,
J-Block, A.P. Secretariat
Hyderabad - 500 022
Phone : 040-23454168,
23450541
Fax :040-23450899

# ప్రస్తావన

తెలుగువారు తెలుగు నేలపై 37 ఏళ్ళ విరామం తరవాత చేసుకుంటున్న పండుగ ప్రపంచ తెలుగు మహాసభలు, మన సంస్కృతిని నలుదిశలా వ్యాపింపజేస్తున్న తెలుగు వారందరూ ఒక్కచోట చేరి, తెలుగు దనాన్ని పంచుకునేందుకు, తెలుగు పరిమళాలు వెదజల్లేందుకు ఉద్దేశించిన సన్నివేశం ప్రపంచ తెలుగు మహాసభలు, తెలుగు వారి సంస్కృతి బహుముఖీయమైంది. అందులో భాష, సాహిత్యం, చరిత్ర, లలితకళలు, జానపద, గిరిజన విజ్ఞానం వంటి ఎన్నో అంశాలున్నాయి. వీటన్నిటి గురించి విశ్లేషించుకొని, వాటిని పరిరక్షించడం, పోషించడం, పరివ్యాప్తి చేయడం ప్రభుత్వం తన విద్యుక్త ధర్మంగా భావిస్తున్నది.

ఈ బృహత్తరమైన బాధ్యతని నెరవేర్చే సంకల్పంలో భాగంగానే 'ప్రపంచ తెలుగు మహాసభల' నిర్వహణకు ప్రభుత్వం నడుము కట్టింది. అతి తక్కువ వ్యవధిలో అత్యంత సమున్నత స్థాయిలో తలపెట్టిన ఈ మహాసభలకు దేశ విదేశాల నుంచి తెలుగువారు స్వాగతం పలుకుతున్నారు. అత్యధిక సంఖ్యలో ఈ సభల్లో పాల్గొంటున్నారు.

తెలుగు వారందరూ ఒక్కచోట సమకూడి, తమ గురించి చర్చించుకుని, భవిష్యత్తుకు బాటలు వేసుకునే క్రమంలో మన గురించి మనం మరోసారి తెలుసుకునేందుకు, వివిధ రంగాల్లో మనం సాధించిన దాన్ని పునశ్చరణ చేసేందుకు ఈ సభల సందర్భంగా సదస్సులు, లఘుగ్రంథాల ప్రచురణ, ప్రత్యేక సంచికల పునశ్చరణ, వివిధ అంశాల్లో ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతున్నది.

తెలుగువారిది ఘనమైన చరిత్ర, అత్యున్నత సంస్కృతి, అయితే కాలంతో పాటు అభివృద్ధి పథంలో నడుస్తున్న తెలుగువారు ఎప్పటికప్పుడు తమ సంస్కృతిలోకి కొత్త నీరును ఆహ్వానించడం సహజం. ఈ "పాతకొత్తల మేలు కలయికే"ఒక జాతిని నిత్యచైతన్యంతో నింపుతుంది. ఈ విధంగా కొత్త దనాన్ని ఆహ్వానిస్తూనే, మన గతవైభవాన్ని విస్మరించకుండా కాపాడుకోవలసిన బాధ్యత మన మీద ఉంది. ఇవన్నీ ఈ ప్రపంచ తెలుగు మహాసభల్లో చర్చకు రానున్నాయి. అందరం కలిసి, తెలుగుదనాన్ని పరిరక్షించుకునే ప్రయత్నం చేయవలసిన తరుణం ఆసన్నమైంది.

వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకుని తెలుగువారి భాష, సాహిత్యం, సంస్కృతి పౌరజీవనం తదితర అంశాలపై లఘుగ్రంథాలను నిష్ణాతుల చేత రచింపజేసి ప్రచురించే గురుతర బాధ్యతను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, తెలుగు అకాడమి, రాష్ట్ర సాంస్కృతిక శాఖ నిర్వర్తిస్తున్నాయి. తెలుగు ప్రజలు కలకాలం ఉపయోగించుకునే విధంగా ఈ పుస్తక ప్రచురణ జరుగుతోంది. వీటిని పాఠకులు, తెలుగు భాషాభిమానులు, పండితులు ఆదరిస్తారని విశ్వసిస్తున్నాను.

వట్టి వసంతకుమార్

# భూమిక

1968లో ప్రభుత్వం అప్పటి విద్యాశాఖమంత్రి మాన్యశ్రీ పి.వి. నరసింహారావు గారు తొలి అధ్యక్షులుగా స్థాపించిన తెలుగు అకాడమి తెలుగు భాషా వికాసం కోసం చేస్తున్న కృషి అపరిమితం. పాఠ్యపుస్తకాలు, పోటీ పరీక్షల పుస్తకాలు, మోనోగ్రాఫ్‌లు, నిఘంటువులు, మాండలిక పదకోశాలతో పాటు భాష, సాహిత్యం, సంస్కృతికి సంబంధించిన అనేక పుస్తకాలు ప్రచురిస్తూ తెలుగుభాషకోసం అకాడమి చేస్తున్న సేవలు అద్వితీయం. తెలుగు భాష, జాతి, సంస్కృతి ప్రేమికుడయిన మాన్యశ్రీ సి. దామోదర రాజనరసింహ గారు అధ్యక్షులుగా తెలుగు అకాడమి తన పరిధిని మరింత విస్తరించుకొని తెలుగు భాషలో శాశ్వతంగా మిగిలిపోగల అనేక పుస్తకాలను తీసుకువస్తున్నది. మహాకవి గుర్రం జాషువా పరిశోధన కేంద్రం నెలకొల్పి తద్వారా ప్రతి ఏటా సాహిత్యరంగంలో విశిష్టసేవ చేసిన ముగ్గురిని ఎంపిక చేసి ఒక్కొక్కరికి రెండు లక్షల రూపాయల చొప్పున నగదు పురస్కారాలు ఇవ్వడం సాహిత్యవేత్తలకు, తెలుగు భాషకు చేస్తున్న సేవకు నిదర్శనం. తెలుగు వారి చరిత్రలోనే ఇది ప్రథమం. అకాడమి ప్రచురించే పుస్తకాలతో పాటు ఇటీవలి కాలంలో గురజాడ సాహిత్యసర్వస్వం, జాషువా పరిశోధన కేంద్రం తరపున పుస్తకాలు ప్రచురించింది. తన 45 సంవత్సరాల చరిత్రలో దాదాపు 3500 శీర్షికలతో వివిధ గ్రంథాలను ప్రచురించి భారతదేశంలోని అకాడమిలన్నింటిలో తెలుగు అకాడమి అగ్రస్థానంలో నిలబడటం తెలుగు వారి కృషికి గర్వకారణం. రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు, సభలు, చర్చాగోష్ఠులు నిర్వహించడంతో పాటు ఇటీవల జాషువా జయంతి సందర్భంగా "శతకవితావసంతం" నిర్వహించి రాష్ట్రవ్యాప్తంగా కవితాచైతన్యానికి, కవులకు ప్రోత్సాహాన్నిచ్చింది తెలుగు అకాడమి.

2012 డిశంబర్ 27,28,29 తేదీల్లో తిరుపతిలో జరగనున్న నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ప్రభుత్వం అకాడమి పై ఉన్న నమ్మకంతో 150లఘు గ్రంథాలను (మోనోగ్రాఫ్‌లను)రాయించి ప్రచురించే బాధ్యతను అప్పగించింది. తెలుగు భాష, సాహిత్యం, చరిత్ర, సామాజిక శాస్త్రాలు, విజ్ఞాన శాస్త్రాలు, జాతి, సంస్కృతి ఒక్కటేమిటి తెలుగుకు సంబంధించిన వివిధ అంశాలను తీసుకొని పుస్తకాలు రాయించడం జరిగింది. తెలుగు భాషా, సాహిత్యాలలో లబ్ధ ప్రతిష్ఠులైనవారితో పాటు ఆయారంగాల్లో నిపుణులైన వాళ్ళతో పుస్తకాలు తయారు

చేయించి ప్రచురిస్తున్నాం. తెలుగు భాషను, సాహిత్య సంస్కృతులను, సమస్త విషయాలను సమున్నతంగా నిలబెట్టగలమన్న నమ్మకంతోనే ఈ కృషి చేస్తున్నాం. తెలుగు సాహిత్యంలో అనర్ఘరత్నాలనదగిన, జాతి సంపదనదగిన పుస్తకాలను ప్రచురించే ఈ సువర్ణ అవకాశం మాకు కల్పించడమేగాక ఆర్థిక వనరులను అందించి ప్రోత్సహించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారికి, సాంస్కృతిక శాఖ, సాంస్కృతికమండలివారికి కృతజ్ఞతలు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి **మాన్యశ్రీ యన్. కిరణ్ కుమార్ రెడ్డి** గారికి; ఉపముఖ్యమంత్రి, ఉన్నత విద్యాశాఖా మంత్రి తెలుగు అకాడమి అధ్యక్షులు **మాన్యశ్రీ దామోదర రాజనరసింహ గారికి;** సాంస్కృతిక శాఖామాత్యులు **మాన్యశ్రీ వట్టి వసంతకుమార్ గారికి** కృతజ్ఞతాభివందనాలు.

4వ ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణకుగాను ప్రభుత్వం నియమించిన ఉన్నతస్థాయి సంఘం సభ్యులు :

**శ్రీ ఆర్. వి. రమణమూర్తి,** అధ్యక్షులు, సాంస్కృతిక మండలి

**శ్రీ మండలి బుద్ధప్రసాద్,** రాష్ట్ర అధికారభాషా సంఘం అధ్యక్షులు

**డా. జె. బాపురెడ్డి,** ఐ.ఎ.ఎస్.,(రి)

**శ్రీ కె.వి. రమణాచారి,** ఐ.ఎ.ఎస్.,(రి) సాంస్కృతిక శాఖ, సలహాదారులు

**శ్రీ వి. భాస్కర్,** ఐ.ఎ.ఎస్. ముఖ్య కార్యదర్శి, ఆర్థిక శాఖ, ఆం.ప్ర.

**శ్రీ ఎల్. వి. సుబ్రహ్మణ్యం,** ఐ.ఎ.ఎస్. కార్యనిర్వహణాధికారి, తిరుమల తిరుపతి దేవస్థానం

**శ్రీమతి చిత్రా రామచంద్రన్,** ఐ.ఎ.ఎస్., ముఖ్య కార్యదర్శి, రెవెన్యూ శాఖ (దేవదాయ)

**ఆచార్య ఎల్లూరి శివారెడ్డి,** ఉపాధ్యక్షులు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

**శ్రీ జి. బలరామయ్య,** ఐ.ఎ.ఎస్., ప్రభుత్వ కార్యదర్శి, సాంస్కృతిక శాఖ

**శ్రీ జి. ఎన్. రావు,** ఐ.ఎ.ఎస్.(రి) ప్రత్యేకాధికారి, శిల్పారామం

**ఆచార్య కె. యాదగిరి,** సంచాలకులు, తెలుగు అకాడమి

**డా. రాళ్లబండి కవితా ప్రసాద్,** సంచాలకులు, సాంస్కృతిక శాఖ

ప్రపంచ తెలుగు మహాసభల రూపకల్పనతో పాటు లఘుగ్రంథాల తయారీలో తమ సహాయ సహకారాలు అందించినందుకు ఈ కమిటీ వారికి ధన్యవాదాలు తెలుపుతున్నాం.

4వ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ప్రచురిస్తున్న ఈ మోనోగ్రాఫ్‌లను అత్యంత స్వల్ప వ్యవధిలో తయారుచేయించడం జరిగింది. ఈ గ్రంథాల్లో ఏవైనా దోషాలు, పొరపాట్లు దొర్లినట్లు పాఠకులు గమనిస్తే సహృదయంతో వాటిని మా దృష్టికి తీసుకొని వస్తే మలి ముద్రణలో సవరించగలమని తెలియజేస్తున్నాం.

**ధర్మమనుదు, తత్త్వమనుదు, యోగమనుదు**
**ప్రాణిసాధింపగల సకలపరమార్థములకు**
**తల్లిభాషప్రధాన సూత్రంబయగుట**
**భాషకంటె నవ్యులకు తపస్సులేదు**

**ఆచార్య కె. యాదగిరి**
సంచాలకులు

Blank Page

# తెలుగు అకాడమి సమన్వయ సంఘం

ఆచార్య కె. యాదగిరి

సంచాలకులు

డా॥ ఎం. మాణిక్యలక్ష్మి

ఉపసంచాలకులు

డా॥ ఎన్. యోగిబాబు

డా॥ టి. అరవింద

శ్రీ టి. రాజేందర్ కుమార్

శ్రీ ఎం. వెంకటేశం

శ్రీమతి సి. శ్రీవిద్య

శ్రీ ఎస్. భూపాల్‌రెడ్డి

శ్రీమతి కె. గీతాంజలి

డా॥ ఎం. శైలజ

డా॥ ఎస్.ఎ.టి. రాజ్యలక్ష్మి

శ్రీమతి వి. అరుంధతి

శ్రీ ఎస్. వేదవ్యాస్

---

* *ఈ గ్రంథంలో ప్రచురితమైన విషయాలకు, వివరాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలు/రచయిత్రులే బాధ్యులు.*

Blank Page

# ప్రవేశిక

సమాజంతో మనకున్న అవినాభావ సంబంధాన్ని తెలియపరుస్తుంది సామాజిక శాస్త్రం. అందుకే బుద్ధుడు "సంఘం శరణం గచ్ఛామి" అన్నాడు. అలాంటి సమాజంలో జీవులందరిని నిర్దేశించడానికి నీతి సూత్రాలెంతైనా అవసరం. ప్రతి వ్యక్తి ధర్మవినీతుడైనట్లయితే సమాజం మణిదీప్తులతో వెన్నెల హారంగా శోభిల్లుతుంది.

ఆ నీతిసూక్తులను, తత్వాన్ని వెదజల్లిన మహాత్ములలో కొందరు మన ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఉన్నారు. దేశంలో మన ప్రదేశం తాత్వాకులను కన్న మహాతల్లి. ప్రాచీనంలో ఆచార్య నాగార్జున, నింబార్క, వల్లభ, వేమన, సమకాలీన దార్శనికుల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్, జిడ్డు కృష్ణమూర్తి వంటి పవిత్రాత్ములు ప్రసిద్ధిగాంచారు.

కవి రాజత్రయమని పిలువబడే పోతరాజు, త్యాగరాజు, కంచర్ల గోపరాజులు తమ భక్తితో పాటు ముక్తిమార్గంలో తాత్విక చింతన చేసిన వారే. అటు భాగవతం నుంచి, ఇటు వేమన శతకం నుంచి ఎన్నో కొన్ని పద్యాలు నోటికిరాని తెలుగు వాడుండడంటే అతిశయోక్తి కాదు.

ప్రాచీనం నుంచి ఆధునికం దాకా తెలుగు వారు తత్త్వశాస్త్ర విస్తరణకు తోడ్పడ్డారు. అయితే అందరి గురించి ఈ పుస్తకంలో రాయడానికి వీలులేకపోవడం వల్ల ఆరుగురు ప్రముఖ తెలుగు తత్వవేత్తలను గురించి మాత్రమే పరిచయం చేయడం జరిగింది. ఈ ఆరుగురి గురించి మాత్రం క్లుప్తంగా పరిచయం చేయడమైంది.

ఆచార్య నాగార్జునుడు బౌద్ధంలో మహాయాన శాఖకు ఆధ్యుడైనట్లు చరిత్ర చెబుతుంది. శూన్యం నుంచి ఏ వస్తువూ ఉత్పన్నం కాదని బుద్ధుని

ప్రతీత్య సముత్పాదన సిద్ధాంత ఉవాచ. నాగార్జునుని శూన్య వాదం నుండే ఆదిశంకరుడి మాయావాదం వచ్చినట్లు పరిశోధకుల అభిప్రాయం.

నింబార్కుని తత్వాన్ని భేదా బేధవాదమంటారు ఈయన దర్శనంలో శ్రీకృష్ణుడే పరమతత్వం. ప్రపంచానికి నిమిత్తకారణం, ప్రధాన కారణం అన్నీ భగవంతుడేనని అంటారు నింబార్కుడు.

వల్లభుని తత్వాన్ని పుష్టిమార్గమని, శుద్ధాద్వైతమని అంటారు. ఈయన దేశమంతటా పర్యటించి చివరకు గుజరాత్‌లో స్థిరపడ్డారు. భాగవత, పురాణం మీద బ్రహ్మసూత్రాల మీద ఈయన వ్యాఖ్యానించాడు.

వేమనను అచల పరిపూర్ణ రాజయోగ సిద్ధాంత కర్తగా పేర్కొనవచ్చు. సంచార సన్యాస జీవితంలో అనేక భావాలు వేమనను "నిత్యవ్యాఖ్యాత"గా మార్చాయి. వేమన భావాలు జీవితం గడుస్తున్న కొద్దీ మారుతూ పోయాయి. వేమనను కొందరు యోగిని చేశారు. మరికొందరు మావాడంటే మావాడని (సి.ఆర్.రెడ్డి) తగువులాడారు. బ్రౌన్ పండితుడు వేమన జీవితాన్ని మూడు దశల చింతనగా విభజించాడు. మొదటి దశ: మొరటు కాలం (రస్టిక్) రెండోదశ: మార్మిక చింతన (మిస్టిక్) , మూడవ దశ: సన్యాసి దశ (ఆసెటిక్).

సర్వేపల్లి రాధాకృష్ణన్ తత్వశాస్త్రాన్ని ఆధునికంగా వ్యాఖ్యానించడంలో, తత్వశాస్త్రాన్ని ఆలోచింపచేయడంలో చూపిన గౌరవ, చేసిన కృషి స్వతంత్ర భారతసమాజానికి ఎంతో తోడ్పడింది. సాంఘీక ప్రయోజనం, విలువలతో కూడిన నీతిని ఆయన ప్రబోధించాడు. మొత్తం మానవ జాతిని వివేకవంతం చేయడమే నేటి విజ్ఞత అంటారు రాధాకృష్ణన్.

జిడ్డు కృష్ణమూర్తి ఏ మతానికి, కులానికి, ప్రాంతానికి, సంస్థకు లోబడలేదు. 'నిన్ను నీవు తెలుసుకో' అనేది ప్రధాన చింతనా స్వభావం. మార్గరహిత చింతన వారిది. చాలా భౌతికంగా ప్రారంభమయ్యే వీరి చింతన, సాగినకొద్దీ అభౌతికంగా ఘనీభవించి నిష్క్రియగా ఉండిపోతుంది. చాదస్తం – కట్టుబాట్లు లేని వీరి తత్వాన్ని విద్యావంతులు బాగా ఇష్టపడతారు. నిరంతర ఆలోచన వీరి జిజ్ఞాస.

ఈ పుస్తకంలో జగద్విఖ్యాతి గాంచిన ఆరుగురు తెలుగు తాత్త్వికుల గురించి రాయడం జరిగింది. వీరి గురించి ఎక్కువగా రాయనంత మాత్రాన తక్కువ అంచనా వేయగూడదు. వీరందరూ విశాలదృక్పథం కలవారు గనుకనే, ప్రాంతీయ తత్త్వం వారిని ఆకర్షించలేకపోయాయి. అందుకే వారి రచనా రంగాన్ని ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే పరిమితం చేయకుండా యావద్భారతదేశానికి, యావత్ మానవాళికి ఉపయోగంగా ఉండే సందేశాలను తాత్త్విక ధోరణిలో రాయడం జరిగింది. కొందరు తత్త్వవేత్తల ఆలోచనా సరళిని దృష్టిలో పెట్టుకొని కాలక్రమ పద్ధతిని పాటించడం కుదరలేదు

తెలుగు తత్త్వవేత్తలు చరిత్ర పుటలలో మరుగున పడిపోయిన కాలాన్ని మినహాయిస్తే తెలుగు దార్శనికుల తాత్త్విక కృషి ఇప్పటికి దాదాపుగా 2,500 సంవత్సరాల నుంచి జరుగుతున్నట్లుగా మనం చెప్పుకోవచ్చు. వీరి కృషి ఫలితం కేవలం తెలుగు నాడుకే పరిమితం కాకుండా యావత్ భారతదేశానికి, ఖండాంతరాలకు వ్యాపించిందనటంలో అతిశయోక్తి లేదు.

ఈ పుస్తకంలో తాత్త్విక పదాలను సాధ్యమైనంతవరకు సరళీకృతం చేయడమైంది. విషయాసక్తి కలిగిన పాఠకులకు ఈ పుస్తకం కొంత సంతృప్తిని ఇస్తుందనుకుంటాం. ఈ పుస్తకంలో ఏవైనా లోటుపాట్లు ఉంటే వాటిని సహృదయ పాఠకులు మా దృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించి మలిముద్రణలో సవరించగలమని మనవి.

**ఆచార్య ఆర్. వెంకటరెడ్డి**

# విషయ సూచిక


**భాగం - I ప్రముఖ తత్వవేత్తలు** **1-105**

1. ఆచార్య నాగార్జున (మాధ్యమికం) **1**
2. నింబార్కాచార్య (ద్వైతా ద్వైతం) **9**
3. వల్లభాచార్య (శుద్ధాద్వైతం) **23**
4. యోగి వేమన (అచల పరిపూర్ణం) **48**
5. సర్వేపల్లి రాధాకృష్ణన్ (నవ్య వేదాంతం) **61**
6. జిడ్డు కృష్ణమూర్తి (చైతన్య వాదం) **79**

**భాగం - II మరికొందరు తత్వవేత్తలు** **106-118**

# భాగం - I ప్రముఖ తెలుగు తత్వవేత్తలు

# 1

# ఆచార్య నాగార్జున (మాధ్యమికం)

## జీవిత సంగ్రహం

భారతదేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో పుట్టి, యావత్ ప్రపంచం చేత కొనియాడబడుతున్న తాత్త్వికుల్లో బుద్ధుని తర్వాత నాగార్జునుని, శంకారాచార్యుణ్ణి పేర్కొనవచ్చు. వారి ప్రతిభ, పాండిత్యం, తాత్త్విక ఆలోచన, వారి దర్శనాలు వారిని అంతగొప్పవారిగా చేశాయి. ఆచార్య నాగార్జునుని జీవిత సంగ్రహాన్ని ముందుగా తెలుసుకొందాం. ఆ తరువాత ఆయన బోధించిన దర్శనాన్ని గురించి తెలుసుకుందాం. ఆచార్య నాగార్జునుడు శాతవాహన చక్రవర్తియైన గౌతమీపుత్ర శాతకర్ణికి, కుషానుల రాజైన కనిష్కునికి సమకాలీనుడని తెలుస్తుంది. దీన్ని బట్టి నాగార్జునుడు క్రీ.శ. రెండవ శతాబ్దానికి చెందినవాడని తెలుస్తుంది.

కుమార జీవుడు, హ్యూయన్‌సాంగ్ అనే వాళ్ళు నాగార్జునుని జీవిత చరిత్రను గురించి రాశారు. శ్రీ పర్వతప్రాంతంలో ఒక బ్రాహ్మణ దంపతులకు నాగార్జునుడు పుట్టాడని అంటారు. మరొక కథనం ప్రకారం నాగార్జునుడు కృష్ణాతీరం అమరావతిలో జన్మించినట్లు అక్కడి తవ్వకాల్లో బయటపడ్డ విశేషాలు తెలియజేస్తున్నాయి.

అల్పాయుష్కుడైనందువల్ల తల్లిదండ్రుల ఆదరణకు నోచుకోలేదు. కాని "అపరిమితాయుర్ దారిణి" మంత్రాన్ని ఒక సిద్ధుని వద్ద అభ్యసించి, దాదాపు డెబ్భై సంవత్సరాలు జీవించాడు. బౌద్ధమతాన్ని స్వీకరించి

ప్రజ్ఞాపారమిత గ్రంథాలనేకం రాశాడు. "విమలకీర్తి నిర్దేశసూత్రాలు" సద్ధర్మ పుండరీక సూత్రం" 'దశభూమిక సూత్రం' - మొదలైన మహాయానసూత్ర గ్రంథాలు నాగార్జునుణ్ణి ప్రభావితం చేశాయి. బౌద్ధసంఘంలోను, బౌద్ధ ఆరామాల్లోను, బౌద్ధ శాసనంలోను కొంత మార్పు తేవాల్సిన అవసరమున్నట్లు నాగార్జునుడు గ్రహించాడు.

అందుకే మహాయాన బౌద్ధంలో మాధ్యమిక దర్శనాన్ని ప్రవేశపెట్టి దానికి ఒక పటిష్టమయిన రూపకల్పన చేశాడు. ఈ రూపకల్పన అంతా కొన్ని స్వతంత్రమయిన రచనల ద్వారానూ, కొన్ని సిద్ధాంతాలను విమర్శిస్తూనూ ఆయన సాధించాడు.

## గ్రంథాలు

ఈయన రాసిన గ్రంథాలు అనేకం. వాటిలో అతి ముఖ్యమయిన వాటిని ఈ కింద పేర్కొనడం జరిగింది - "ఉపదేశం", ఏమాధ్యమిక శాస్త్రం', 'రత్నావళి', ఏప్రతీత్య సముత్పాద హృదయ శాస్త్రం', 'మహాయాన భవభేద శాస్త్రం', 'సూత సముచ్చయం' నాగార్జుని గ్రంథాలన్ని సంస్కృత భాషలో లభ్యం కావడం లేదు. వీటి చైనీస్, టిబెటన్ ప్రతులు కొన్ని మిగిలినవి మూల సంస్కృత భాషలోను లభ్యమవుతున్నాయి. వీటిలో భాష్యాలు, భక్తిగ్రంథాలు, సిద్ధాంత గ్రంథాలు సంఘానికి, రాజులకు నీతిని బోధించే దార్మిక గ్రంథాలు ఉన్నాయి.

'బుద్ధచరిత' రచయిత అయిన అశ్వఘోషుడు మాధ్యమిక శాఖకు మార్గ దర్శకుడుగా పరిగణింపబడ్డాడు. నాగార్జునుడు తన ప్రసిద్ధ గ్రంథమైన 'మాధ్యమిక శాస్త్రం'లో మాధ్యమికశాఖ తత్త్వశాస్త్రాన్ని తన మాండలిక భాషానైపుణ్యంతోనూ, పాండిత్యముతోను చక్కగా చెప్పాడు.

ఈ విశ్వంలో యదార్థం లేదని అంతా శూన్యమని భారతదేశంలోని బౌద్ధేతర తాత్త్వికులు ఈ శూన్యవాద సిద్ధాంతాన్ని చక్కగా అర్థం చేసుకున్నారు. మాధవాచార్యులు 'సర్వదర్శన సంగ్రహ'మనే తన గ్రంథంలో ఈ సిద్ధాంతానికి పూతగా తన వాదనను తెలియజేశాడు. జ్ఞాత, జ్ఞేయం, జ్ఞానం పరస్పర

అధారితాలు. ఒకదాని యదార్థం మిగతావాటిపై ఆధారపడింది. ఒకటి తప్పిదమయితే మిగతా రెండు తప్పిదమవుతాయి. (ఒక వ్యక్తి పితృత్వం తప్పైతే అతని పిల్లల ఉనికి కూడా తప్పవుతుంది). ఒక తాడులో పామును చూసినపుడు, ఆ కనిపించిన పాము భ్రమయని అందరు ఒప్పుకుంటారు. వస్తువును తెలుసుకునేది తప్పైనపుడు దానికి సంబంధించిన జ్ఞానం కూడా తప్పవుతుంది. కలలో చూసిన వస్తువులు ఎలా అసత్యమో అలాగే లోపలగాని, బయటగాని చూసేవన్నీ కూడా అసత్యమేనని తేల్చుకుంటాం. యదార్థమైనదేదీ మనసుకు గాని, మరేదానికి గాని అందదు. ఈ విశ్వమంతా శూన్యం. శూన్యమే యదార్థం.

ఇటువంటి వాదనల ద్వారా మాధ్యమిక దృక్పథంలో ప్రతిదీ అవాస్తవమే. ఇటువంటి వాదాన్ని ఐరోపాలో ఉచ్ఛేదవాదమని భారతదేశంలో సర్వవైనాశికవాదమని అంటారు. ఈ అభిప్రాయం వల్లనే మాధ్యమికులు 'శూన్య'మనే పదాన్ని వాడారు. ఈ శూన్యవాదాన్ని చక్కగా అధ్యయనం చేసినట్లైతే మాధ్యమిక భావన ఉచ్ఛేదవాదం కాదని తెలుసుకుంటాం. ఈ మాధ్యమిక వాదం సద్వస్తువును కాదనదు. కాని మనకు కనిపించే ఈ ప్రపంచాన్ని మాత్రమే శూన్యమంటుంది. ఈ ప్రపంచానికావల ఎవరి మనసుకు అందని వాస్తవికత ఉంది. దృగ్విషయ లక్షణాలు లేనందున శూన్యమని అన్నారు. ఇది చరమయథార్థం యొక్క వ్యతిరేక తీరు. లేనిదానిని వర్ణించి చెప్పడం. లంకావతార సూత్రంలో యదార్థవస్తుతత్వాన్ని మనబుద్ధి అర్థం చేసుకోలేదని చెప్పబడింది. అందువల్ల దాన్ని గురించి చెప్పలేదు. ఏది యదార్థమో అది స్వతంత్రమైంది. దాని ఉనికి కోసం ఏ దానిపైనా ఆధారపడదు. మనకు తెలిసిందంతా ఒకదానిపై ఆధారపడ్డదే. కాబట్టి ఇది యదార్థంకాదు. అయితే ఇది అవాస్తవికమని కూడా చెప్పలేక పోయింది. అవాస్తవమైంది గాలిలో మేడ కట్టేలాంటిది. అస్తిత్వంలోకి రానటువంటిది. ఇది వాస్తవమైనది, అవాస్తవమైంది. ఇది వాస్తవం కాదు, అవాస్తవంకాదు అని చెప్పటం పిచ్చోడుమాట్లాడినట్లుంది. అనిశ్చితమైన , వర్ణనాతీతమైన యదార్థవస్తుతత్వాలకు ఇచ్చిన పేరు శూన్యత.

వస్తువులు ఉద్భవిస్తాయి. వాటి యదార్థతత్వాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తే మన బుద్ధి వికసిస్తుంది. అది వాస్తమనిగాని, అవాస్తమనిగాని, లేక వాస్తవమని, అవాస్తమని లేక వాస్తవం కాదు, అవాస్తవం కాదు అనలేం.

వర్ణింపనలవికాని వస్తుతత్త్వం ఇతర వస్తువులపై ఆధారపడిందనే వాస్తవంపై వాదనల ద్వారా తెలుస్తోంది. అందువల్ల ఆధార ఆవిర్భావాన్ని మనం 'శూన్యత'యని పిలుస్తున్నామని నాగార్జునుడు చెప్పాడు. వస్తువుల ఆవిర్భావాన్ని గురించి అవి మరొక వాటిపై ఆధారపడలేదని చెప్పే ధర్మంలేదు. అందువల్ల శూన్యం కాని ధర్మంలేదు. శూన్యమంటే వస్తువుల నిబంధ ధర్మం వాటి నిరంతర మార్పు, అనిశ్చితం, వర్ణనాతీతం.

ఈ భావననే మధ్యమమార్గమన్నారు. ఎందుకంటే ఈ మార్గం వస్తువుల కేవలసత్తను, అసత్తను నిరాకరించి విపరీత దృక్పథాలను పరిహరిస్తుంది. వాటి నిబంధ అస్తిత్వాన్ని నొక్కి చెప్పటం జరిగింది. ఈ కారణం వల్లనే బుద్ధుడు ఆధార ఆవిర్భావ సిద్దాంతాన్ని మధ్యమ మార్గమని పిలిచాడు. శూన్యవాదంలో ఆధారిత ఆవిర్భావ సిద్ధాంతముంది కాబట్టి దీనిని మధ్యమార్గమని నాగార్జునుడు చెప్పాడు.

వస్తు ప్రతీత్యం, వస్తు స్వభావం వాస్తవమా, అవాస్తవమాయని నిశ్చయించ లేదు. దీన్ని ఒకరకమైన సాపేక్షగా పరిగణించారు. ప్రతి వస్తుధర్మాన్ని మరొకటి నిబంధిస్తుంది. అందువల్ల దాని అస్తిత్వం అ నిబంధనకు సాపేక్షిగా ఉంటుంది. శూన్యవాదాన్ని సాపేక్షసిద్ధాంతమని కూడా అన్నారు. దీనివల్ల ఏ వస్తువుకు కచ్చితమైన, కేవలమైన/పరిపూర్ణమైన, స్వతంత్ర స్వభావముండదు. అందువల్ల ఈ ప్రపంచంలో దేన్ని వాస్తవమని చెప్పలేం.

ఈ తత్త్వశాస్త్రానికి మాధ్యమికులు అనుభవాతీత తత్త్వశాస్త్రాన్ని జోడించారు. ఆధార ఆవిర్భావం, అశాశ్వతాల గురించి బుద్ధుని బోధనలు ఈ ఘటనా ప్రపంచానికే వర్తిస్తాయి. మన నిత్యజీవితంలో అనుభవానికి వచ్చే వాటి గురించి వర్తిస్తాయి. నిర్వాణం సాధించిన తర్వాత

ఇంద్రియానుభవాలు, కనిపించే ఘటనా ప్రపంచం అంతరిస్తాయి. అయితే తత్ఫలితంగా కలిగే అనుభవమేమి? దీనికి ఈ ప్రాపంచిక వాస్తవ ధర్మాలను వర్తింపజేయలేం. ఈ ప్రాపంచానికావల అనుభవాతీత వాస్తవికత ఉందని మాధ్యమికులు అన్నారు. ఇది మార్పుకు, నిబంధనకు, ఇతర వస్తుధర్మాలకు అతీతంగా ఉంటుంది. రెండు యదార్థాల సత్యాలపై బుద్ధుని ధర్మబోధనలు ఆధారపడ్డాయని నాగార్జునుడు పేర్కొన్నాడు. ఒకటి సంవృతి సత్యం. ఇది సామాన్యులకు చెప్పటానికైతే మరొకటి పరమార్థ సత్యం. ఈ రెండు రకాల సత్యాల భేదం తెలియకపోతే బుద్ధబోధనలు అర్థంకావు.

ఔన్నత్యం సాధించటానికి సత్యక్రమం ఒక సోపానం మాత్రమే. నిర్వానుభవం సామాన్య అనుభవాని కంటె అతీతమైంది. దీన్ని వివరించలేం. మన సామాన్య అనుభవపదాలతో వైరుధ్యంగా సూచించాలి. నిర్వానాన్ని ప్రతికూల/వ్యతిరేక పదాలతో నాగార్జునుడు వివరించాడు. "సామాన్యంగా ఏది తెలియదో అది క్రొత్తదనాన్ని సంతరించుకోదు, నాశనం కాదు, శాశ్వతం కాదు, అణగిపోదు. ఉత్పత్తికాదు. ఆద్దానిని నిర్వాణమన్నారు" నిర్వాణం ఎరిగిన వారు తథాగతను ఎరిగిన వారే. అతని స్వభావాన్ని కూడా వివరించలేం. అందువల్ల నిర్వాణం సాధించిన తర్వాత తథాగత ఏమవుతుందని బుద్ధుణ్ణి అడిగారు. ఆ ప్రశ్నకు సమాధానం చెప్పటానికి విముఖత చూపించాడు. అనుభవరహిత విషయాల గురించి అడిగిన అతిభౌతిక ప్రశ్నలకు బుద్ధుడు మౌనం వహించటాన్ని ఈవిధంగా అర్థం చేసుకోవచ్చు. అతడు అనుభవాతీత వస్తువును నమ్మినందువల్ల సామాన్య అనుభవంతో ఆ అనుభవాతీత సత్యాలను చెప్పలేమని మౌనం వహించి ఉండవచ్చు. ఈ అనుభవాతీత సత్యాన్ని గురించి మాధ్యమికులు చేసే వాదనకు ఆలంబనగా, హేతువుకు అందని కొన్ని సత్యాలను తెలుసుకున్నానని బుద్ధుడు చేసిన ప్రవచనాలను ఉదహరించవచ్చు.

ద్విసత్యభావన, ఘటనా ప్రపంచనిరాకరణ, అనుభవాతీతం కాదనటం, నిర్వాణ భావన వల్ల బ్రహ్మైక్యాన్ని పొందవచ్చని ఇచట తెలుసుకోవాలి. ఇది ఉపనిషత్తులలోని అద్వైత వేదాంతానికి, ఆ తరువాత గౌడపాదుడు.

శంకారచార్యులు విశదీకరించిన దానికి దగ్గరగా ఉందని మనకు అర్థమవుతుంది.

చాలామంది పండితులు, బౌద్ధుల శూన్యాన్ని సామాన్యార్థంలో గ్రహించి, మాధ్యమికుల దృష్టిని నిషేధాత్మకమని వివరించారు. కాని మాధ్యమికుల శూన్యం అవ్యక్తమైన పారమార్థికసత్యాన్ని ప్రతిపాదిస్తుంది. మాధ్యమిక వాదానికి రెండు లక్ష్యాలున్నట్లు అర్థమవుతుంది. ఈ ప్రపంచాన్ని సత్యంగా గ్రహించి, దాని ఆధారంగా వాదవివాదాలు చేసి, సత్యాన్ని గ్రహించామని భ్రమపడి ఏవిధంగా భవచక్రంలో పడిపోతున్నారో వివరించటం ప్రథమ లక్ష్యం. అవిద్య వల్ల ఆనుభవికప్రపంచాన్ని యథార్థమని భావించేవారి దృష్టిని వీటికతీతమైన పారమార్థిక సత్యంవైపు మళ్ళించి, జనన మరణ వలయం నుంచి తప్పించటం రెండో లక్ష్యం. వారి దృష్టిలో నిర్వాణంతప్ప మిగిలిన వన్నీ భ్రమలే అయితే ఆ జ్ఞానం కలిగే వరకూ ఇవి సత్యాలుగానే గోచరిస్తాయి. ఆ విధంగా శూన్యవాదాలు రెండు విధాలయిన సత్యాల నంగీకరిస్తారు - సంవృత సత్యము, పారమార్థికసత్యం.

భౌతిక ప్రపంచమూ, అనుభవాలూ - అన్నీ మాయవల్ల ఏర్పడిన భ్రమలే. వీటిలో సత్పదార్థం లేదు. ఈ ప్రపంచంలోని పదార్థాలన్నీ అనుక్షణమూ మారుతూనే ఉంటాయి. వాటితోపాటు అనుభవాలూ మారుతాయి. ఆయా మార్పుల కనుగుణంగా, వాటి వాటి ఉపాధులప్రభావాలవల్ల ఆయా పదార్థాల స్వభావాలు కూడా మారుతాయి. ప్రతీత్యసముత్పాదం కూడా ఇదే సత్యాన్ని వ్యక్తం చేస్తుంది. ఏదీ శాశ్వతం కాదని అది వివరిస్తుంది. ఒక దాని మీద ఆధారపడి ఇంకొకటి ఏవిధంగా సిద్ధిస్తుందో తెలుపుతుంది. అందువల్ల మారని పదార్థమేదీ లేదు. తదనుగుణంగా శాశ్వతమైన స్వభావాలు పదార్థాలకుండే అవకాశమే లేదని మాధ్యమికులు ప్రతిపాదిస్తారు. దానినే నిస్స్వభావత్వ మన్నారు. దీనికి అతీతమైన సత్యము ఈ ప్రపచంలో ఏదీ లేదు. ఆ విధంగా ఒక పదార్థానికి ఒక లక్షణముందని చెప్పలేం. అట్లాగే ఒక పదార్థానికి ఒక లక్షణం లేదని కూడా చెప్పలేం. పదార్థాలన్నీ భ్రమలే కాబట్టి, వాటి లక్షణాలు

మన అనుభవాలు అన్నీ భ్రమలే. అన్ని పదార్థాలలోనూ ఐదుస్కంధాలు మాత్రమే ఉన్నాయి. నిర్వాణం కూడా వర్ణణాతీతమే. దానిని విధ్యాత్మకంగానో నిషేధాత్మకంగానో వివరించటానికి వీలులేదు. ప్రాపంచిక ప్రవృత్తినుంచి నిర్గమించటమే నిర్వాణం. ఆఖరికి నిర్వాణాన్ని సాధించవలె ననుకోవటం కూడా అవిద్యయే. ఈ విధంగా అనుభవానికి ఆధారమైనదంతా భ్రమా కలితమేనని మాధ్యమికులు వివరిస్తారు. ఇదంతా సంవృతసత్యమే. ఈ దృష్టికి ఇవన్నీ సత్యాలుగా గోచరించినా పారమార్థిక దృష్టికి ఇవి అసత్యాలుగా గోచరిస్తాయి.

లౌకిక ప్రపంచాన్నీ లౌకికానుభవాలనూ మాధ్యమికులు కాదనలేరు. అయితే అవి పారమార్థికాలు కావని వివరించారు. సంవృతసత్యదృష్టికి పారమార్థిక సత్యం, అనిర్వచనీయమవుతుంది. అంటే ఈ అనుభవాలకూ వర్ణనలకూ అది అందదు. కాబట్టి అది ఈ దృష్టికి శూన్యం. ఆ విధంగా ప్రాపంచిక యథార్థాలన్నీ సాపేక్షాలు. నిరపేక్షసత్యం, అనిర్వచనీయం. ద్వంద్వతర్కవిధానం ద్వారా సమన్వయ పూర్వకంగా సాధించిన ఈ సత్యం విధ్యాత్మక, నిషేధాత్మక వర్ణనలకు అందదు.

ఈ శూన్యాన్ని నిర్వానాన్ని, బౌద్ధులు ఒకేతాటి కిందికి తీసుకొని వస్తారని గుర్తుంచుకోవాలి. నిర్వాణం నిషేధాత్మకం కాదు. సమ్యక్ సంబోధి ద్వారా ప్రాపంచిక పరిమితులను అధిగమించటమే నిర్వాణం. అదీ ఒక అవస్తే. ఆ అవస్థ అనిర్వచనీయం. అదే విధంగా శూన్యమనే పదం ఈ ద్వంద్వాతీతమైన పారమార్థిక సత్యాన్ని ప్రతిపాదిస్తుంది కాని, సర్వరాహిత్య సిద్ధాంతాన్ని ప్రతిపాదించదు. దీన్ని నిషేధాత్మకమనుకొని, అభావంగా గ్రహించి తరవాతివారు విమర్శించారు. నిజానికి శూన్యం దృగ్విషయ ప్రపంచాతీతమైన యథార్థాన్ని ప్రతిపాదిస్తుంది.

పారమార్థిక సత్యాన్ని మాటలతో వివరించటం సాధ్యం కాదు. దీనిని చలనంతో పోల్చవచ్చు. చలనాన్ని ఇతమిద్ధంగా వర్ణించటానికి సాధ్యం కాదు. ఒక వస్తువు ఒక సమయంలో ఒక చోట కనిపించి, ఇంకొక సమయంలో

ఇంకొకచోట కనిపించటం వల్ల ఆ వస్తువు చలించిందని గ్రహిస్తాం. అయితే అది ఏ క్షణంలో చూసినా ఆదిఏదో ఒక స్థలంలో ఉంటుంది. అంటే చలనరహితమని అర్థమవుతుంది. అందువల్ల విశ్లేషణాత్మక పరిశీలనకు చలనం లేనట్లే తోస్తుంది. కాని అనుభవంలో ఆ వస్తువు స్థలాంతరంలో ఉండటం గమనించినప్పుడు చలనాన్ని అంగీకరించక తప్పదు. అది ఎట్లా సంభవించిందో వివరించటం సాధ్యం కాదు. అదే విధంగా ప్రపంచసత్తాను వర్ణించటానికి అలవికాదు. ప్రపంచంలోని ప్రతి అంశమూ సాపేక్షమే కాబట్టి అది పారమార్థికసత్యం కాబోదు, ఆ పారిమార్థికసత్యం ఈ పరిమితి పరిధిలో ఉండదు. అందువల్ల లౌకికాను భవ దృష్టికి అది శూన్యంగానే తోస్తుంది. ఆ సత్యాన్ని అర్థం చేసుకోవటానికి సంవృత సత్యాన్ని అధిగమించవలసి ఉంటుంది. ఈ విధంగా మాధ్యమికులు బుద్ధుని ఆలోచనతో అంతర్గతంగా ఉన్న తార్కిక దృష్టిని అభివృద్ధి పరచారు.

ఆనాడు అభివృద్ధి చెందుతున్న ఇతర శాఖల ప్రభావం కూడా దాని మీద ఉండవచ్చు. వారు ఇతర శాఖలను కూడా ప్రభావితం చేసి ఉండవచ్చు. అంతేకాక భావి భారతీయ దర్శనాలకది ఎంతగానో దోహదం చేసింది.

# 2

# నింబార్కాచార్య (ద్వైతా ద్వైతం)

అద్వైత, విశిష్టాద్వైత, ద్వైత దర్శనాలే కాకుండా వేదాంతంలో ఇతర దర్శనాలు కూడా కొన్ని చోటుచేసుకున్నాయి. వీటిలో రెండింటిని ప్రస్తావించుకుందాం. ముందుగా నింబార్కుని తత్వం గురించి తెలుసుకుందాం.

## జీవిత సంగ్రహం

నింబార్కకు నింబాదిత్య, నియమానంద అనే నామదేయాలున్నాయి. ఇతడు బల్లారిజిల్లాలోని నింబ లేదా నింబపుర అనే గ్రామంలో నివసించాడని చెపుతారు. ఇతడు తెలుగు బ్రాహ్మణుడు. దశ శ్లోకిపై హరివ్యాసదేవులు చేసిన వ్యాఖ్యానం ద్వారా నింబార్కుని తండ్రి జగన్నాథుడని, తల్లి సరస్వతి అని తెలుస్తోంది. ఇతని తత్త్వశాస్త్రంలోని అంతర విశ్లేషణను గమనించినట్లైతే ఇతడు రామానుజాచార్యుల వారి వ్యవస్థకు రుణపడి ఉన్నాడేమోనని తెలుస్తుంది. ఇతని భాష్యంలో ఉపయోగించిన శైలి రామానుజా చార్యుల వారు తన భాష్యంలో వాడినశైలి మనకు పెక్కు చోట్ల కనిపిస్తుంది. దీన్ని బట్టి రామానుజాచార్యుల తర్వాత నింబార్కుడు జీవించాడని చెప్పడానికి ఇది మంచి ఉదాహరణ.

## నింబార్కుని గ్రంథాలు

1. వేదాంత పారిజాత సౌరభం, 2. దశశ్లోకి, 3. కృష్ణ స్తవరాజ, 4. గురు పరంపర, 5. మధ్వముఖ మర్దన, 6. వేదాంత తత్త్వబోధ, 7. వేదాంత సిద్ధాంత ప్రదీప, 8. స్వధర్మ ధ్వబోధ, 9. శ్రీ కృష్ణ స్తవ. మొదటి

మూడు గ్రంథాలు తప్ప మిగతావన్ని లిఖిత రూపంలో ఉన్నాయి. కాని ఇవి లభ్యంకావటం లేదు.

## నింబార్క తత్త్వశాస్త్రంపై ఒక అభిప్రాయం

వేద విధులను చర్చించే వాఙ్మయాన్ని అధ్యయనం చేసిన తర్వాతనే బ్రహ్మతత్త్వ విచారణ జరుగుతుందని నింబార్కుడు పేర్కొన్నాడు. అప్పుడే వివిధ ప్రయోజనకర ఫలితాలుంటాయన్నాడు. ఆ ఫలితాలన్ని ప్రాపంచికానందంతో భ్రష్టు పడతాయని శాశ్వతానందాన్ని అందించవు అని తెలుసుకున్న తర్వాత అన్వేషకుడు వివిధ మత గ్రంథాలను చదివి బ్రహ్మసాక్షాత్కారం వల్లనే మార్పునొందని, శాశ్వతమైన, సుస్థిరానందాన్ని పొందగలనని తెలుసుకుంటాడు. భగవంతుని దయవల్ల దీన్ని సాధించాలని ఆత్రుతపడతాడు. బ్రహ్మతత్వాన్ని తెలుసుకునేందుకు భక్తి ప్రపత్తులతో గురువును ఆశ్రయిస్తాడు. ఆ బ్రహ్మతత్త్వం శ్రీకృష్ణుడే. అతడే సర్వజ్ఞాని, సర్వశక్తి సంపన్నుడు, అంతిమకారణం, సర్వవ్యాపి. ఆ పరబ్రహ్మతత్వాన్ని అర్థం చేసుకోవటానికి నిరంతర కృషి చేయాలి. భక్తి ప్రపత్తులతో ఆ పరబ్రహ్మతత్త్వంతో సాధకుడు అన్వేషకుడు మమేకం కావాలి. పరబ్రహ్మతత్వాన్ని తెలుసుకునేందుకు నిరంతర కృషి చేయాలని అది భక్తుని విధి యని బ్రహ్మసూత్రాల లోని ప్రథమ సూత్రం చెపుతుంది. పరబ్రహ్మ తత్వాన్ని ప్రత్యక్షంగా సాక్షాత్కరించుకున్న గురువు యొక్క బోధను శిష్యుడు వింటాడు .గురుబోధనలు అనుభవంతో కూడుకొన్నవి. గురుబోధనల అర్థాన్ని పరమార్థాన్ని శిష్యుడు అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తాడు. దీనినే శ్రవణ మంటారు. శంకర సాహిత్యంలోని శ్రవణానికి వున్న అర్థానికి భిన్నమైన అర్థమిది. శంకర సాహిత్యంలో ఉపనిషత్తు గ్రంథాల అర్థమే ఇవ్వడం జరిగింది.

శ్రవణం తర్వాత గల సోపానం మననం గురువు చెప్పిన బోధనలపై నమ్మకం పెంపొందించుకొనటానికి ఆ బోధనలను మానసికంగా తలుస్తూ వాటికి ఒక రూపమివ్వటం. మూడవ సోపానాన్ని నిధిధ్యాసలంటారు. గురువు చెప్పిన వాటిని అనుభంలోనికి తేవటానికి నిరంతరం ధ్యానం చేయటం. బ్రహ్మసాక్షాత్కారానికి సత్ఫలితమిచ్చే చివరి దశ ఇది. వేదాధ్యయనాన్నే

'ధర్మ'మని అంటారు. వేదాధ్యయనం అర్థం కాకున్న శాశ్వతానందాన్నిచ్చే పరబ్రహ్మ తత్త్వాన్ని తెలుసుకోవాలనే జిజ్ఞాస పెరుగుతుంది. ఆ పరబ్రహ్మతత్త్వాన్ని ప్రత్యక్షంగా అనుభవంలోకి తెచ్చుకున్న గురువును శిష్యుడు ఒక సాధనంగా ఉపయోగించుకొని సత్ఫలితాన్ని పొందుతాడు. శ్రవణ, మనన, నిధి ధ్యాసల సోపానాలవల్లనే శిష్యునకు పరబ్రహ్మతత్త్వాన్ని తెలుసుకునేందుకు సాధ్యమవుతుంది.

## సిద్ధాంతం

నింబార్క తత్త్వశాస్త్రాన్ని భేద - భేద (భేదా-భేద) వాద మంటారు. దీన్నే భగవంతుని ఏకోభిన్న సిద్ధాంతమని కూడా అంటారు. పర బ్రహ్మమే 'జీవజగత్తులుగా' పదార్థంగాను, ఆత్మలుగానూ మారుతుంది. ప్రాణశక్తి కర్మేంద్రియ, జ్ఞానేంద్రియ నిధుల్లో వ్యక్తం అయినా, తన స్వతంత్రను, సమగ్రతను, భిన్నత్వాన్ని ఎలా నిలుపుకుంటుందో, అలాగే పరబ్రహ్మ అనేక ఆత్మలలో వ్యక్తమవుతున్నా తన ఉనికిని కోల్పోదు. సాలెపురుగు తన నుంచి వెలువడే పదార్థంతో సాలెగూడును నిర్మించుకున్నా, దానికి అతీతంగా ఉంటుంది. అలాగే పరబ్రహ్మ కూడా ఎన్ని రూపాలు ధరించినా పూర్ణంగా, నిర్మలంగానే ఉంటాడు. ఈ జగత్తు ఉనికికి, కదలికలకు పరబ్రహ్మమే ఆధారం. పరబ్రహ్మమే కార్యం కారణం.

మన పవిత్ర గ్రంథాలలో ద్వైత్వ గ్రంథాలున్నాయి. అద్వైత గ్రంథాలున్నాయని విన్నాం. ఈ రెండు గ్రంథాలు కూడా పరబ్రహ్మం భిన్నంగా ఉంటాడని చెపుతాయి. జగత్తుతో తాదాత్మ్యం చెంది ఉంటాడనే ఒక అంగీకారానికి వచ్చాయి. అందుకే విశ్వం విష్ణుమయం అన్నారు. విశ్వంతో తాదాత్మ్యం చెందిఉన్నా విశ్వానికి అతీతంగా ఉంటాడు. పరబ్రహ్మం ఏకంసత్ అని బహుదా వధంతి అని పరిగణించారు పెద్దలు. ఈ విధంగా ఉండటం పరబ్రహ్మ ఆధ్యాత్మిక తత్త్వము నందేకాని మరొక విధంగా కాదు. దీని కారణంగానే భేద - భేద సిద్ధాంతాన్ని స్వాభావిక భేద భేద వాదమని పిలిచారు. పరబ్రహ్మను ఉపాదానకారణమని చెప్పే గ్రంథాలను పరిగణించలేదు.

వేదాంతంలో ఏకత్వభావన కూడా నిలబడదు. చరమయధార్థమైన అబేధ గుణరహిత చైతన్యం దృగ్గోచరం. కంటికి అగుపించేది కాదు. మనసుకు అందేది కాదు. ఈ చైతన్యం ఇంద్రియాతీతం. అనుమానానికి తావులేనిది. ఎటువంటి చిహ్నాలు లేనటువంటిది. గ్రంథసాక్ష్యానికి లభ్యంకానిది మాటల్లో చెప్పలేనిది. ఇంద్రియగోచరమైన వాటిని పోల్చి చెప్పవచ్చు. కాని ఇంద్రియాతీతమైన పరబ్రహ్మతత్వాన్ని ఏ భావనతో పోల్చి చెప్పలేం. పరబ్రహ్మ సుతార్కిక నిరూపణలకు లొంగనిది. లొంగితే అది బద్ధమవుతుంది.

పరబ్రహ్మం స్వయం ప్రకాశితము కాబట్టి నిరూపణలకు అందదు. పరబ్రహ్మతత్వాన్ని వివరించే గ్రంథాలను చదవక పోవడం నిరర్థకాలే. గుణరహితమైన పరబ్రహ్మానికి ఎటువంటి కల్మశం అంటదు. బంధానికి లోబడక స్వతంత్రంగా ఉంటుంది. మోక్షసాధనకు మత గ్రంథాలు చెప్పే పద్ధతులు ఎంతో ఉపయోగపడతాయి. బంధ విముక్తి కావాలని గ్రంథాలంటున్నాయి. బంధం యదార్థమైనప్పుడు విముక్తి కూడా యదార్థం కావాలి. దాంట్లో సామాన్య గుణాలు కాని ప్రత్యేక గుణాలు కాని కన్పించినట్లైతే భ్రమపడే వీలుంది. ప్రత్యేకగుణాలు లేకున్నా సాధారణ గుణాలు కనిపిస్తే చాలు మనం భ్రమపడుతూంటాం. తాడును చూచి పామని భ్రమపడినట్లు ఒక వస్తువులా సాధారణ లక్షణాలు కన్పించినా భ్రమపడుతుంటాం. పరబ్రహ్మము గుణరహితం కాబట్టి భ్రమపడే వీలుండదు. అజ్ఞానానికి ఆశ్రయం, విషయము ఉంటుంది కాబట్టి వివరించటం కష్టం. భ్రమను కూడా వివరించలేం. పరబ్రహ్మం స్వచ్ఛమైన జ్ఞానం కాబట్టి దానికి అజ్ఞాన ఆశ్రయం, విషయాలుండవు. జీవుడు కూడా అజ్ఞానోత్పత్తి కాబట్టి దాని ఆశ్రయమని పరిగణించలేం. పరబ్రహ్మస్వచ్ఛమైన స్వయం ప్రకాశమైతే, అజ్ఞానం చీకటితో కూడుకొన్నది. రెండవదానికి ఆశ్రయంగా మొదటిది ఉండలేదు. అనగా అజ్ఞానాశ్రయానికి పరబ్రహ్మం ఉండదు. చీకటికి ఆశ్రయంగా వెలుతురును పరిగణించలేం.

అజ్ఞానం వల్ల భ్రమకలుగుతుందని చెప్పలేం. అజ్ఞానంలో చైతన్యం ఉండదు కాబట్టి అది ఒక కర్తగా (agent) భావించలేం, అజ్ఞానాన్ని పరబ్రహ్మకు

ఆపాదించలేం. ఎందుకంటే పరబ్రహ్మ నిర్మలమైంది. అచంచలమైంది. పరబ్రహ్మం పాపిగా, జంతువుగా, కోరదగని రూపాలు పొందుతారని చెప్పే విషయాన్ని వివరించలేం. పరబ్రహ్మం చైతన్యవంతమై, స్వతంత్రంగా ఉంటే పునర్జన్మ ద్వారా వివిధ జంతుజన్మలనెత్తి బాధలు పడనవసరం లేదు. పరబ్రహ్మకు అనుభవజ్ఞానమేలేకున్న, అజ్ఞానిగానే పరిగణించవచ్చు. పరబ్రహ్మస్వయం ప్రకాశితమనటం వైఫల్యమవుతుంది. అజ్ఞానానికి అస్థిత్వముందంటే పరబ్రహ్మతత్త్వాన్ని మరుగుపరచలేదు. పరబ్రహ్మం స్వయం ప్రకాశమైతే ఎలా మరుగున ఉండగలదు? దాన్ని గురించిన భ్రమ ఎలా ఉండగలదు? శంఖంచిప్ప స్వయంప్రకాశంతో మెరుస్తుంటే అది వెండితురుపు అనే భావన వస్తుంది గాని మరొక భావనరాదు. పరబ్రహ్మతత్త్వం అజ్ఞానంతో కప్పబడుతున్న అది పూర్తిగా కప్పబడిందా లేదా పాక్షికంగా/భాగంగా కప్పబడిందా అన్న ప్రశ్న ఉదయిస్తుంది.

పరబ్రహ్మను పూర్తిగా కప్పేయడం అసాధ్యం. ఎందుకంటే ఈ జగత్తంతా అంధకారం, కటికచీకటి. పరబ్రహ్మను పాక్షికంగా కప్పేయడమూ అసాధ్యమే. ఎందుకంటే పరబ్రహ్మం నిక్కమైన తత్త్వం. దానికి గుణాలు లేవు. భాగాలు లేవు. ఏకేశ్వరవాదులు దీన్ని గుణరహితమని, అఖండమని అంగీకరించారు. "పరబ్రహ్మం యొక్క 'ఆనంద'భాగం మాత్రమే అజ్ఞానంతో కప్పబడిందనుకుంటే 'అస్తిత్వ'భాగమే కప్పబడకుండా ఉందా! అటువంటప్పుడు బ్రహ్మం ఖండాలుగా విభజితమయిందని తెలుస్తుంది. అటువంటి అనుమానారోపణలతో పరబ్రహ్మం అసత్యమని నిరూపించవచ్చు. కూజా మాదిరి ఖండాలు/భాగాలను కలిగి వుంది కాబట్టి బ్రహ్మ అసత్యం. (బ్రహ్మ మిథ్య సంసత్వత్ ఘటాద్వివత్).

అజ్ఞానానికి అభ్యంతారాలను లేవనెత్తుతూ పైన సూచించిన అభ్యంతరాలకు సమాధానమివ్వవచ్చు. అజ్ఞానం పూర్తిగా అసత్యజ్ఞానం. సూర్యకాంతిలో ఉన్నా కటికచీకటిని గుడ్లగూబ ఎలా చూస్తుందో అలాగే "నేను అజ్ఞానిని" అనే అతీంద్రియ బావన అందరిలోనూ ఉంటుంది.

పరబ్రహ్మ సహకారంతో అజ్ఞానమనే ప్రపంచ నియమం దృశ్య ప్రపంచాన్ని ఉత్పన్నం చేస్తుందని నింబార్క ఒప్పుకొనలేదు. అజ్ఞానమనేది వ్యక్తుల సహజగుణం. వీరంతా పరబ్రహ్మానికి భిన్నమైనవారు. పూర్తి పరబ్రహ్మ అధీనంలో ఉన్నవారు. పరిమిత శక్తులతో కూడినవారు. అణుతత్త్వం గలిగినవారు మొదటి నుంచి కర్మసంకెళ్ళతో ముడిపెట్టుకొన్నవారు కాబట్టి జ్ఞానాంధులయ్యారు.

ఆత్మ శుద్ధచైతన్యం. యదార్థంగా తెలుసుకునేది ఇదే. తెలుసుకోవలసింది ఇదే. నీరు నీటితో కలవకుండా ఎలా ప్రత్యేకంగా ఉంటుందో జ్ఞానం జ్ఞానంలాగే వర్తిస్తుంది గాని మరొక రకంగా వర్తించదు. దీన్ని నింబార్కులు అసంగతమని ఆక్షేపణ గావించారు. ఉదాహరణకు పురుషోత్తముడు తన "వేదాంతరత్న మంజూష"లో సూర్యున్ని గురించి చెపుతూ సూర్యుడే వెలుగు, సూర్యుని నుండే వెలుగు వెలువడుతుందని చెప్పాడు. నీటిచుక్కను మరొక నీటిచుక్కతో కలిపితే నీటిచుక్కల బేధం పరిమాణదిశగా, గుణపరంగా ఒకలాగే ఉన్నా, అనుకున్నట్లుగా ఉండకపోవచ్చు. ఆ నీటిచుక్కల మధ్య ఉన్న బేధం చెప్పటానికి నిరూపణ ఏమీలేదు. రెండు చుక్కలు ఒకటిగా కలిసిపోయినవి. మొదటి నీటి చుక్కకంటె రెండవనీటి చుక్క ఒకింత బేధమున్నా, దానికి ప్రత్యేక ఉనికి ఉందని పరిగణించాల్సి వస్తుంది. తెలుసుకునే తత్త్వం ఆత్మకే ఉంటుందని తప్పక ఆరోపించవలసి ఉంటుంది. వృత్తిలోని శుద్ధచైతన్య ప్రతిబింబం/ప్రత్యగాత్మ తెలుసుకుంటుందని శంకరులు ప్రతిపాదించిన మరొక స్కీము నిరుపయోగమవుతుంది. నీటిలో ప్రతిబింబించిన సూర్యుడు ప్రతిబింబం దానంత అదే ప్రకాశబింబంగా పరిగణింపబడదు. ప్రతిబింబం గోచరమయ్యే రెండు వస్తువుల మధ్య ఉంటుంది. శుద్ధచైతన్యంగాని, అంతకరణవృత్తి గాని గోచరమయ్యే వస్తువులుగా పరిగణించలేం. అందువల్ల ప్రతిబింబం గోచరించదు.

అహంకార అంతర్బుద్ధి (ప్రత్యక్షంగా/నేరుగా) మనసుకు సంబంధించింది. దీన్ని గురించిన భ్రమ అంటూ ఏమీలేదు. అహంకార అంతర్బుద్ధి మనసుతత్త్వాన్ని నిరంతరం తెలియజేస్తూ ఉంటుంది. గాఢంగా నిద్రించిన తరువాత "నేను బాగా నిద్రపోయాను, నేనేమిటో నాకు తెలియనంతగా

నిద్రపోయాను" అని అంటుంటారు. దీని అర్థం అహంకార అంతర్బుద్ధి లేదనికాదు. ఆత్మకు తెలియదని కాదు. "నేనేమిటో నాకు తెలియదు" అన్న అనుభవం శరీరస్పృహకు సంబంధించింది. మనోవిక్షిప్తికి సంబంధించింది. ఆత్మచేతనం స్వయంప్రకాశాన్ని నిలుపుదల చేసిందని సూచించదు. గాఢనిద్రలో ఆత్మలేదనటం శరీరం లేదని చెప్పినట్లవుతుంది. అహంకారం శరీర అంతఃకరణతో సంబంధం కలిగి ఉంటుంది కాబట్టి శరీరత లేదని చెప్పినట్లవుతుంది. ఇటువంటి అభావ అనుభవాలు "ఈ గదిలో చాలాసేపు లేను" "ఆ సమయంలో నేనులేను" అన్న మాటల్లో ద్యోతకమవుతుంది. అభావాలు అహంకార కూటమికి సంబంధించినవా సంబంధించనివా అని కూడా తెలుసుకోవాలి. ఆత్మ అహంకార అంతర్బుద్ధిలో వ్యక్తమయ్యేదే కాక దానికున్న జ్ఞానంతో నిర్దిష్టంగా ఉంటుంది. ఆత్మజ్ఞానం గాఢనిద్రలోను ఉంటుంది, విముక్తి దశలోను ఉంటుంది. భగవంతుడు కూడా తన పరిపూర్ణస్వతంత్రతతో అతీంద్రియ అహంకార అంతర్బుద్ధిలో తనకు తాను చేతనంగా ఉంటాడు. అతడు దయామయుడు, గొప్పబోధకుడు, మన ఎరుకకు అధిష్ఠాన దేవత. వ్యక్తిగత ఆత్మలలాగ భగవంతుడు కూడా ఈ విశ్వసృష్టికి ఒక ఏజంటు. పరబ్రహ్మం ఏజంటుకాకపోతే ఈ విశ్వానికి సృష్టికర్తగా ఉండలేడు. మాయతో సంబంధమున్నప్పటికి సృష్టికర్తగా ఉండలేడు. పరబ్రహ్మ వలెగాక వ్యక్తుల కార్యకలాపాలు కర్మేంద్రియాల అనుభూతులను పొందుతుంది. అయితే వ్యక్తుల ఉనికి, ఏజన్సీ భగవదేచ్ఛపై ఆధారపడి ఉంటుంది. భగవంతుడు పక్షపాతియని, క్రూరుడని అనుకునే దానికి కారణమేలేదు. ఎందుకంటె భగవంతుడు ఒక గ్రాండ్‌మాస్టర్. వ్యక్తుల ప్రవర్తనలను బట్టి సుఖదుఃఖాలను అందిస్తుంటాడు. భగవంతుడు వ్యక్తుల కర్మానుసారం సుఖదుఃఖాలను అందిస్తున్నా కర్మసిద్ధాంతానికి కట్టుబడి ఉండడు. కాని అతని దయతో వారిని బంధవిముక్తులను గావించగలడు. కర్మసిద్ధాంతం యాంత్రికమైంది. భగవంతుడు పర్యవేక్షకునిగా ప్రతి ఒకరి కేసును నిర్ణయిస్తూ ఉంటాడు. అలా కర్మసిద్ధాంతానికి లోబడక కర్మసిద్ధాంతాలను అమలుపరుస్తూ ఉంటాడు.

మానవాత్మలు/జీవాత్మలు భగవత్తత్వంలోని ఒక అంశమే. అందువల్ల ఆ జీవిత్మలు వాటి ఉనికికి, కార్యకలాపాలకు, పారభూతికి భగవంతునిపై ఆధారపడి ఉంటాయి. (తదాయత-స్వరూప, స్థితి పూర్వికః) భగవంతుడే అంతిమ సత్యం కాబట్టి జీవ నిర్జీవరాసులన్ని వాటి ఉనికిని సారభూతాన్ని భగవత్తత్వం నుంచి పొంది అతనితో పాలుపంచుకుంటాయి. అందువల్ల వాటి ఉనికి, కార్యకలాపాలకు పూర్తిగా దైవంపై ఆధారపడి ఉంటాయి.

జీవరాశులు అనంతం. పరమాణు పరిమాణంలో ఉన్నవి. పరమాణు పరిమాణంలో ఉన్నా తమ శరీరంలోని వివిధ భాగాలలోని వివిధ స్పందనలను తమకున్న జ్ఞానంతో తెలుసుకుంటాయి. పరమాణు రూపంలో ఉన్నా, పూర్తిగా భగవత్తత్వంతో కూడుకున్నవి. శరీరావిర్భావానికి కారణభూతమైన అనాది కర్మసిద్ధాంతంతో సంబంధం కలిగినటువంటివి. విమోచన కోసం భగవత్కృప పైనా, శాస్త్రాధ్యాయనం వల్లను, గురుబోధల వల్లా తమ అనుమానాలను నివృత్తి గావించుకొని గాఢధ్యానం చేసి చివరకు భగవంతునిలో లీనమవుతాయి. భగవంతుడు తన దయాకరుణలను జీవరాశులపై విస్తరిస్తుంటాడు. ఆ జీవరాశుల చర్యలను, భక్తిప్రపత్తులను గమనించి అర్హులైన వారికే తన కటాక్షాన్ని కురిపిస్తుంటాడు. భగవంతుడు త్రిగుణాతీతుడు. శుద్ధ సత్త్వం, శుద్ధ చైతన్యం కలిగినటువంటి వాడు కాబట్టి ఏ మార్పులకు ప్రభావితం కానివాడు. శుద్ధసత్యం, ఆనందం చైతన్యను కలబోసినటు వంటివాడు. సత్యం, శివం, సుందరం అన్నారు పెద్దలు. అతని అంశాలైన జీవరాసుల ద్వారా అమితానందాన్ని పొందుతూ వుంటాడు. జీవరాశుల అనుభవాలను తన అనుభవాలుగా భావిస్తుంటాడు. కాబట్టి వారి ఉనికిని నియంత్రిస్తు ఉంటాడు. అందువల్ల జీవరాశులన్ని అతనిలో భాగమైనప్పటికి వాటికి భిన్నంగా ఉంటాడు. భాస్కరతత్త్వశాస్త్రంలో బేధాలన్ని ఉపాధుల వల్ల కలిగినవేనని చెపుతూ ఏకత్వానికే ప్రాధాన్యతనిచ్చాడు భాస్కరుడు. కాని నింబార్కుని వ్యవస్థలో ప్రాధాన్యత ఐక్యానికే గాక బేధానికి కూడా ఇచ్చాడు. అతని సిద్ధాంతాన్ని బేధ బేధనేకద్వైత, ద్వైతసిద్ధాంతమని చెప్పుకున్నాడు. పూర్ణం లేకుండా భాగం/

సాక్షికం ఎలా వుండదో భగవంతుడు లేకుండా జీవరాశులు లేవు. అలాగే భగవంతునికి భిన్నంగా జీవరాశులనే అంశాన్నే మరచిపోతారు. వారి చర్యలకు, అనుభవాలకు తామే స్వతంత్రులని భావిస్తారు. ప్రేమజనితమైన అభావన వల్ల భగవంతుని ద్వారా నియంత్రించబడుతుంటామని వ్యక్తి తలుస్తుంటాడు. భగవంతుని అంశమేనని తాను తెలిసికొని తన అభిరుచులపై, చర్యలపై ఆసక్తి చూపడు. వాటివల్ల ప్రభావితుడుకాడు. అతని అంతిమ ఆదర్శం భగవంతునితో సంబంధం పెట్టుకోవటమేనని తెలుసుకుంటాడు. అతడు చేసే చర్యలకు, కోరే కోర్కెలకు, ఉద్దేశ్యాలకు అభావంగా ఉంటూ తాను భగవదంశమేనని తలుస్తుంటాడు. అటువంటివాడు ప్రాపంచికబంధాలలో చిక్కుకొనడు. భగవద్ధ్యానంలో శాశ్వతానందాన్ని పొందుతుంటాడు. మోక్షస్థితిలో భక్తుడు అహంబ్రహ్మాస్మి అని అనుకుంటుంటాడు. భగవంతునికి శక్తిలో ఒక భాగంగా వుంటాడు. ఈ మోక్షస్థితిలో ముక్తినొందినవారికి, భగవంతునికి బేధముంది. ఈ మోక్షస్థితిలో వారున్నా వారు అమితానందంలో మూర్తీభవులై ఉంటారు.

భగవత్తత్వాన్ని తెలుసుకొని, భగవంతునితో సంబంధం పెట్టుకున్నట్లైతే సంచిత, ఆగామి, ప్రారబ్ధ కర్మలు మూడు అంతరించిపోతాయి. ఈ వ్యవస్థలో అవిద్య అంటే ఒకరి సహజ స్వభావం యొక్క అజ్ఞానం భగవంతునితో అతనికున్న సంబంధం, తన కర్మకుగల కారణం, తన శరీరం, ఇంద్రియాలు సూక్ష్మశరీరంతో అతనికున్న సంబంధం ఫలవంతదశలో ఉన్న ప్రారబ్దకర్మ దాని ఫలాలు అనుభవించేంత వరకు శరీర రహితవిముక్తి లభించేంత వరకు ఈ జన్మలోనూ, అవసరమైతే ఇతర జన్మలలోనూ కొనసాగుతుంది. భగవంతునిపై చెక్కుచెదరని నిరంతరధ్యానం అలవడేంతవరకు సన్యాసత్వం లభించదు. అలా సన్యాసత్వం స్వీకరించిన సన్యాసి తను చేసే కర్మలు కళంకితం అంటకుండా స్వతంత్రుడుగా ఉంటాడు. ఆ తరువాత చేసే మంచి చెడుకర్మల కళంకితం కూడా అతనికి అంటదు.

## విదునక్త ధర్మాలు

కులసంబంధవిధులు, జీవితంలో చేయవలసిన విద్యుక్త ధర్మాలు మన వివేకం పెంచటానికి దోహదపడతాయి. అందువల్ల వాటిని తప్పక

ఆచరించాలి. ఎప్పుడు వివేకం ఉదయిస్తుందో/జ్ఞానోదయమవుతుందో అప్పుడు జ్ఞానజ్యోతి వెలగటం ఆరంభమవుతుంది. ఆ జ్ఞానజ్యోతిని అలా వెలిగిస్తూనే ఉంచాలి. అప్పుడే చేసిన కర్మలన్ని ఫలవంతమవుతాయి. ఆ కర్మల ఫలితాలను సన్యాసి ఒక జన్మలో పొందవచ్చు లేదా మరిన్ని జన్మలలో పొందవచ్చు. బ్రహ్మసాక్షాత్కారం భగవంతునిపై చెక్కుచెదరని ధ్యానం వల్లనే సాధ్యమవుతుంది. భగవంతునితో పాలుపంచుకోవటమంటే భగవంతునితో నిరంతరం భక్తిపరమైన సంబంధం స్థిరపరచుకోవటమే. సన్యాసి ఒక జీవితంలోగాని, మరిన్ని జీవితాలలోగాని ప్రారబ్ధకర్మల ఫలితాలను అనుభవించిన తర్వాత భగవంతునిలో తిరిగి చేరిపోతుంది/లీనమవుతుంది. అతడు కర్మలను అనుభవించిన తర్వాత సుషుమ్నానాడి ద్వారా స్థూల శరీరాన్ని వదలి ప్రాకృతమండలం ఆవలికి పయనించి విరజానదిని చేరుకొంటాడు. ఈ విరజానది ప్రాకృతమండలానికి విష్ణులోకానికి మధ్య ఉంటుంది. ఇక్కడ అతడు తన సూక్ష్మశరీరాన్ని వదలి పారలౌకికమైన భగవద్ధామం చేరుకొంటాడు. విముక్తిపొందినవారు భగవంతునిలోనే ఉండిపోతారు. భగవంతుని శక్తులుగా ఉండిపోతారు. వారంతా భగవత్‌కార్యాల కోసం నియమితులవుతారు. అలా ముక్తిపొందినవారు భూలోకంలో జీవించటానికి భగవంతుడు ఎప్పుడూ పంపడు. వారంతా దేవునితో మమేకమైనా ప్రాపంచిక వ్యవహారాలపై నియంత్రణ ఉండదు. వాటినన్నిటిని భగవంతుడే చూసుకుంటూ ఉంటాడు.

మన కలల అనుభవాలను భగవదేచ్ఛతో పొందుతున్నప్పటికి, మన అనుభావాల దశలన్నిటిలో అతడు ఉండి నియంత్రిస్తున్నప్పటికి మన అనుభవాల కళంకాలు అతడికి అంటుకోవు. మన అనుభవాల ఉద్దేశాలు సుఖదుఃఖాలకు అతీతం. మనం చేసిన మంచి, చెడు కర్మలననుసరించి ఫలితాలను, శిక్షలను భగవంతుడు కల్పిస్తుంటాడు. కర్మానుభవాల ఉద్దేశ్యాలు ఉదాసీన వస్తుగతాలు. సుఖదుఃఖాలు లేనివి. భగవత్ సంబంధం, ప్రాపంచిక సంబంధం ఎలాంటిదంటే పాము, అది చుట్టుకొని పడి ఉన్న సంబంధంలాంటిది. అంటే కుండలినీ శక్తి పాము ఆకారంలో ఉంటుంది కాబట్టి దానికి పామును

సంకేతంగా వాడారు. చుట్టుకొని వున్న పాముకు, పడగెత్తిన పాముకు బేధంలేదు. రెండూ ఒకటే. అలాగే జీవరాసులతో భగవత్‌సంబంధము లాంతరు వెలుగులాంటిది. సూర్యుడు, సూర్యకాంతి లాంటిది. భగవంతుడు మార్పునొందక తన చిత్‌శక్తి, అచిత్‌శక్తుల ద్వారా మార్పు చెందుతూ వుంటాడు. పరబ్రహ్మకు దూరంగా జీవరాసులకు ఉనికిలేదు. అలాగే భౌతికప్రపంచము భగవంతుడు లేకుండా వుండలేదు. ఈ అర్ధంలోనే భౌతికప్రపంచము భగవంతునిలో ఒక భాగమన్నారు. ప్రపంచం కూడా భగవన్మయమన్నారు. భౌతికప్రపంచతత్త్వము భగవత్తత్వానికి భిన్నంగా ఉంటుంది.

కుల ధర్మాలను, జీవిత విద్యుక్త ధర్మాలను సత్సంకల్పాలను ఉద్ధరించటానికి చేయవలసి వుంటుంది. ఒకసారి జ్ఞానోదయమైందంటే విద్యుక్త ధర్మాలను చేయవలసిన అవసరముండదు. జ్ఞానవంతుడు తాను చేసే కర్మలకు ప్రభావితుడుకాడు. చేసే కర్మలు జ్ఞానోదయానికి దోహదపడతాయి. కావున ఇవి తప్పింపరానివి. కులధర్మాలను, జీవిత విద్యుక్తధర్మాలను నిర్వర్తించకుండా జ్ఞానోదయం పొందినవారు చాలా మంది వున్నారు.

## నింబార్క-రామానుజుల మధ్య భేదాలు

నింబార్కునికి, రామానుజునికి ఉన్న ముఖ్యభేదాలు ఇవి:

**మొదటిది:** భేదవంలో, భేదం ద్వారా తాదాత్మ్యము, భేదగుణం వల్ల తాదాత్మ్యతను రాజానుజుడు నమ్ముతాడు. నింబార్కుడు తాదాత్మ్యాన్ని, భేదాన్ని నమ్ముతాడు. ప్రత్యేకంగా భేదానికి ఉనికిలేదు. దీనికి తాదాత్మ్యానికి చెందిన గుణముంటుందని రామానుజుడు నమ్మాడు. రామానుజుల వారికి తాదాత్మ్యం ముఖ్యం. కాని నింబార్కునికి తాదాత్మ్యం, భేదం రెండూ సమానమే.

**రెండవది**: పదార్థాం జీవజగత్తులు/ఆత్మలు భగవంతుని గుణాలనే భావనను నింబార్కుడు తిరస్కరించాడు. గుణాల కర్తవ్యం ఒక వస్తువును మరొక వస్తువునుంచి వేరుపరచటం లేదా ఆ వస్తువును చక్కగా తెలియజేయడం. ఉదాహరణకు దశరథుని కుమారుడు 'రామ'అని చెపితే, అతడు బలరాముడు,

పరశురాముడుకాదు అన్న భేదాన్ని తెలియచెపుతుంది. 'రామ' తండ్రికూడా తెలుసుకాబట్టి ఆ 'రామ' ఎవరో మనకు తెలుస్తుంది. భగవంతుని గుణాలుగా పదార్థం, జీవజగత్తులను ఆత్మలనులు చెప్పలేం. భగవంతుని బయట ఏమీ లేదు కాబట్టి అతని నుంచి దేన్నీ వేరుచేయలేం.

భగవత్తత్వాన్ని అవి కలిగి ఉండవు కాబట్టి అవి భగవంతున్ని గురించి తెలియజేయలేవు.

**మూడవది:** నింబార్కుడు శరీరానికి, ఆత్మకు గల భేదాన్ని తిరస్కరించాడు. పదార్థం జీవజగత్తులు/ఆత్మలు భగవంతుని శరీరమనే భావనను తిరస్కరించాడు. పదార్థం-జీవజగత్తులు/ఆత్మలు భగవంతుని శరీరమైతే, భగవంతుడు ఈ ప్రపంచ ఈతిబాధలకు గురికావలసిందే. భగవంతునిలో ఒక భాగం. మార్పుకు అపరిపూర్ణతకు మరొక భాగం. శాశ్వతకు, పరిపూర్ణతకు రిజర్వుకావు. అందువల్ల నింబార్కుడు పదార్థాన్ని, జీవజగత్తులను, ఆత్మలను భగవంతుని భాగాలు, శక్తులని పిలిచాడు.

## నింబార్కుల తత్వం సంక్షిప్తంగా

వేదాంత సూత్రాలపై నింబార్కుల వారు వ్యాఖ్యానం రాశారు. ఆ వ్యాఖ్యాన శీర్షిక 'వేదాంత పారిజాతసౌరభం'. ఈ వ్యాఖ్యానంలో జీవరాసులు, జగత్తు పరబ్రహ్మానికి భిన్నంగానూ, అభిన్నంగానూ ఉన్నాయని తెలియజేశాడు. తన 'దశశోధికి' గ్రంథంలోను తర గ్రంథాలలోను ఈ సిద్ధాంతాన్నే విశదపరచాడు. 'వేదాంతసూత్రం'పై 'వేదాంతకౌస్తుభ' మనే పేరుతో వ్యాఖ్యానం రాసిన శ్రీనివాసుడు నింబార్కుని శిష్యుడు. ఈ వ్యాఖ్యానం ద్వైతాద్వైత సిద్ధాంతాన్ని సులభరీతిలో విశదీకరించింది. కేశవ కాశ్మీరిన్ భగవద్గీతపై రాసిన తన 'తత్త్వప్రకాశిక' అనే వ్యాఖ్యాన గ్రంథంలో నింబార్కుని తాత్విక స్థానాన్ని సమర్థించాడు.

పరబ్రహ్మ మాత్రమే స్వతంత్ర సద్వస్తువని బోధించే వేదాంతులతో నింబార్కుడు ఏకీభవించాడు. ఇది సగుణమే కాని నిర్గుణం కాదు. చెడుగుణాలు ఇందుచోటు చేసుకోవని చెప్పడమే నిర్గుణానికి అర్థం. బ్రహ్మాన్ నిత్యుడు. సర్వవ్యాపి, సర్వశక్తి సంపన్నుడు. సర్వజ్ఞాని. ఇతడే ఉపాదానకారణం. నిమిత్తకారణం. నింబార్కునికి బ్రహ్మమంటే రాధతో కూడుకున్న గోపాలకృష్ణుడే.

ప్రాకృతిక ప్రపంచం మూడు వర్గాలతో నిర్మితమైంది. అవి: (1) ప్రకృతి ఉత్పాదనకాని అప్రాకృతం. ఇందులో సూర్యచంద్ర నక్షత్రాదులుంటాయి. 2) ప్రాకృతం అంటే ప్రకృతి నుంచి ఆవిర్భవించింది. 3) కాలం అంటే ప్రకృతితో పాటు విశ్వఅస్థిత్వానికి మూలనియమం.

జీవాత్మ వివేకం కలిగి ఉంటుంది. చైతన్యం కలిగి ఉంటుంది. చైతన్యవంతమైంది కూడా. తెలుసుకునేది, చేసేది, అనుభవించేది అదే. అణుపరిమాణంలో ఉండేది. శరీర పరిమాణాన్ని బట్టి దాని జ్ఞానతత్త్వం వ్యాకోచిస్తుంది, సంకోచిస్తుంది. అనంతాత్మలుంటాయి. ఆత్మలు ముఖ్యంగా రెండు రకాలు. ఒక రకమైనవి బంధనాల్లో ఉంటాయి. మరొక రకమైనవి బంధవిముక్తి పొందినవి.

బ్రహ్మాన్, చిత్, అచిత్ - ఈ మూడు శాశ్వతమైన వాస్తవాలు/ యదార్థాలు. బ్రహ్మాన్ నియంత్రించువాడు. చిత్ అనుభవించువాడు. అచిత్ భోగ్యవస్తువు. చివరి రెండు ఆధారిత యదార్థాలు. బ్రహ్మాన్ ఒకరే స్వతంత్రుడు. బ్రహ్మాన్‌కు ఆత్మలకు, జగత్తుకు గల సంబంధం సహజంగా వుండేటటువంటి స్వాభావిక భేద భేదం. ఆత్మలు, పదార్థము/జీవజగత్తులు జగత్తు బ్రహ్మాన్‌కు భిన్నంగా ఉండేవి. వాటికి ఆధారితమైన, స్పష్టమైన ఉనికి ఉంటుంది. వాటికి స్వతంత్ర సత్తభావముండదు. కార్యకారణ సంబంధం మాదిరి పూర్ణ పాక్షికల సంబంధం మాదిరి భేదంలో తాదాత్మ్య సంబంధం ఉంటుంది. కుండ మట్టి నుంచి భిన్నం మరియు అభిన్నంగా ఉంటాయి. అలాగే ఆత్మలు/జీవులు జగత్తు బ్రహ్మాన్ నుంచి భిన్నంగా, అభిన్నంగా ఉంటాయి.

విముక్తి దశలో కూడా ఆత్మ తన వ్యక్తిత్వాన్ని కోల్పోదు. భగవంతునితో తనకున్న సామ్యాన్ని తెలుసుకుంటుంది. కర్మ, జ్ఞాన, ఉపసాన, ప్రపత్తి/ శరణాగతి, గురుభక్తి వల్ల ఆత్మ అంతిమలక్ష్యాన్ని చేరుకుంటుంది. దైవప్రేమ ముక్తికి సాధనం. భగవంతుని గొప్పతనాన్ని గుర్తించటమే కాదు. మాధుర్య ప్రధానభక్తి వల్ల ముక్తి ఆధారపడి ఉంటుంది. శరీరంలో ఉన్నప్పుడు ముక్తిని పొందదు. **జీవితాంతంలో** ఆత్మ జీవి విముక్తి పొందుతుంది.

# 3

# వల్లభాచార్య (శుద్ధాద్వైతం)

## జీవిత సంగ్రహం

వల్లభాచార్యులు ఒక తెలుగుబ్రాహ్మణుడు. అతడు క్రీ॥శ॥ 1479లో జన్మించాడు. విష్ణుస్వామి భావాలను వృద్ధిచేశాడని సంప్రదాయం చెబుతోంది. అతని భావనను శుద్ధద్వైతమని లేక మాయాతీత అద్వంద్వవాదం అని తెలియజేస్తున్నారు. అనుభాష్యమనే వ్యాఖ్యానాన్ని బ్రహ్మసూత్రాలపై రచించాడు. భగవద్గీతపై 'సుబోధిని' అనే వ్యాఖ్యానాన్ని రచించాడు. అతని కుమారుడు విఠలనాథుడు విద్యాన్ మండనాన్ని రచించాడు. పురుషోత్తముడు తన 'భాష్యప్రకాశం'లో 'అనుభాష్యం'పై వ్యాఖ్యానం చేశాడు. దానిపై గోపేశ్వరుడు తన 'రశ్మి'లో వ్యాఖ్యానం చేశాడు. అలాగే తన సువర్ణ సూత్రంలో 'విద్యన్మండన'పైన, 'సుబోధిని'పైన వ్యాఖ్యానం చేశాడు. గిరిధరుని 'శుద్ధద్వైత మార్తాండము' బాలకృష్ణభట్టు యొక్క 'ప్రమేయరత్నార్ణవము' ఈ శాఖకు చెందిన ప్రసిద్ధ గ్రంథాలు. దీన్నే రుద్రసంప్రదాయమని, పుష్టిమార్గమని కూడా అంటారు. పుష్టి అంటే భక్తిద్వారా కలిగే భగవంతుని దయ. అది ముక్తికి కారణం.

పరబ్రహ్మం శ్రీకృష్ణునితో తాదాత్మ్యం చెందిన స్వతంత్రవాస్తవికత. పర బ్రహ్మతత్త్వం సత్, చిత్, ఆనందం. జీవరాసులు, జీవజగత్తులు(ఆత్మలు) పదార్థం అతని వ్యక్తీకరణలు. అవి అతనిలోని భాగాలు. సద్గుణాలనిలయం. గోచరించే వైరుధ్యగుణాలు కూడా ఉంటాయి. అణువులో అణువు, ఘనంలో ఘనం. అందుకే అణోరణీయాం మహతో మనీయాం అన్నారు. ఆ పరబ్రహ్మం

తన ఇచ్ఛతోనే పదార్థంగా, జీవరాసులుగా వ్యక్తీకరణ చెందుతూ ఉంటాడు. అతని సచ్చిదానంద స్వరూపం భిన్న అనుపాతాలలో ఉంటుంది. మాయ లేదా అవిద్య ద్వారా తన శక్తితో బహురూపాలుగా వ్యక్తమవుతుంటాడు. అయితే ఈ వ్యక్తీకరణ దోషం కాదు, భ్రమకాదు. ఇది సహజవ్యక్తీకరణ. వల్లభాచార్యుల భావనను వివర్తమనరు, పరిణామమనరు. ఈ రెండింటి మధ్య ఉంటుంది. దీన్ని అవికృత పరిణామవాదమని అంటారు. ఈ విశ్వం వివర్తం కాదు. ఎందుకంటె ఇది వాస్తవిక వ్యక్తీకరణం. అవాస్తవిక గోచరంకాదు. ఇది పరిణామం కాదు. ఎందుకంటె ఈ వ్యక్తీకరణలో ఎటువంటి మార్పు ఉండదు. ఇది భగవంతుని నుంచి సహజంగా ఏర్పడినది. ఎటువంటి మార్పుపొందనిది. దీన్ని అవికృత పరిణామమంటారు.

వల్లభాచార్యులు సమవాయ సంబంధాన్ని తిరస్కరించారు. దీన్ని తదాత్మ్యమని వివరించారు. ద్రవ్యం, దాని గుణాలు, కారణం దాని కార్యాలు సమరూపకాలు. ద్రవ్యం దాని గుణాలు సహజంగా కనిపిస్తాయి. అలాగే కారణం, దాని కార్యాలు గోచరిస్తాయి. ఉపాదాన కారణం స్థానే వల్లభాచార్యులు 'సమవాయీకారణ' అనే మాటను వాడారు. అందువల్ల ఉపాదానకారణం అంటే సమవాయీకిరణం.

ఉపాదానకారణం దాని కార్యానికి సమరూపకమని చెపుతుంది. బ్రహ్మకు సంబంధించి ఏ మార్పుకు లొంగనిది. పై అర్థం ప్రకారం ఈ విశ్వానికి బ్రహ్మ ఉపాదానకారణం లేదా సమవాయీకారణం. అతడు నిమిత్తకారణం కూడా. బ్రహ్మమే విశ్వంగా ఏ మార్పుపొందకుండా వ్యక్తీకరణ చేశాడు. బ్రహ్మన్ సర్వత్రా వ్యాపించి ఉంది. సృష్టి అంతా ఏ మార్పు చెందకుండా వివిధ రూపాలలో భగవంతుడు వ్యక్తీకరణం కావటం. అలా వ్యక్తీకరించిన దానిలో తన త్రిమూర్త్యంశమైన సత్ చిత్ ఆనందాన్ని బహిర్గతపరుస్తాడు. ఆ సచ్చిదానంద స్వరూపం వివిధ అనుపాతాల్లో ఉంటుంది. ప్రళయమనగా ఆ వ్యక్తీకరణను వైదొలగింపజేసుకోవడం. లాంతరు నుంచి కిరణాలు ఎలా ప్రసరిస్తాయో, ఆభరణం నుంచి కాంతి ఎలా బహిర్గతమవు[illegible]ందో, నిప్పు

నుంచి రవ్వలు ఎలా చిట్లుతాయో, బ్రహ్మన్ నుంచి ఈ విశ్వం వెలువడుతుంది. పత్తి దారాలుగా ఎలా మారుతుందో భగవంతుడు ఈ విశ్వంగా అలా మారుతాడు. భగవత్తత్వం నుంచి ప్రాణం, ఇంద్రియాలు, శరీరాలు ఆత్మలకు బంధనాలుగా వెలువడుతాయి. అవి సత్ పదార్థంగా వెలువడుతాయి. భగవత్తత్వం నుంచి జ్ఞానరూపంలో అణువులు ఏర్పడి బంధనాలవుతాయి. భగవత్తత్వము నుంచి ఆనందరూపంలో ఆత్మాధిదేవతలైన అంతర్యామిలు ఏర్పడుతాయి. అవి అసంఖ్యాకంగా ఉంటాయి. భగవంతుడు ఒక గొప్ప అంతర్యామి. ఈ విశ్వఅంతర్గతనేత. ఈ ప్రాపంచిక జగత్తులో భగవంతుని సత్ పదార్థం వ్యక్తీకరణం చెందుతుంది. అతని జ్ఞాన, ఆనందరీతులు మరుగున ఉంటాయి. జీవరాసులలో సత్తు, జ్ఞానరీతులు వ్యక్తీకరణమవుతాయి. ఆనందరీతి మరుగున ఉంటుంది. అంతర్యామిలలో అన్ని రీతులు అంటే సత్తు, జ్ఞాన, ఆనంద రీతులు వ్యక్తమవుతాయి. ఈ మూడురూపాలు జగత్, జీవ, అంతర్యామి భగవంతునితో సమరూపకాలుగా ఉంటాయి. జగత్ భగవంతునికి విజాతీయంగా ఉంటుంది. జీవులు భగవంతునికి సజాతీయంగా ఉంటాయి. అంతర్యామిలు భగవంతునిలోనే ఉంటాయి. అతని నుంచి భిన్నంకాని మూడురూపాలుంటాయి. భగవంతునికి సజాతీయం, విజాతీయం అన్న భేదంలేదు.

వల్లభాచార్యులు సంసారానికి, జగత్తుకు మధ్యగల భేదం చెప్పారు. జగత్తు భగవంతుని వ్యక్తీకరణం.

ఇది అయిదు రకాలు: (1) ఆత్మ యొక్క సహజమైన అజ్ఞానం, (2) శరీరంతో తాదాత్మ్యం చేసుకోవడం, (3) ఇంద్రియలతో తాదాత్మ్యం చెందడం, (4) ప్రాణవాయువులతో తాదాత్మ్యం చెండదం, (5) అంతర్గత అంగం. జ్ఞానోదయం కలిగిన వెంటనే అజ్ఞానం అంతరిస్తుంది. దానితో సంసారమూ అంతరిస్తుంది. కాని జగత్తు ఉండనే ఉంటుంది. ఇది భగవంతుని వ్యక్తీకరణం కాబట్టి కొనసాగుతూనే ఉంటుంది. ఆత్మ భగవంతునికి భిన్నంగా ఉండినప్పటికి అతనికి సమరూపకంగా అతని శరీరంలా రూపొందుతుందని

రామానుజుల వారు వక్కాణించారు. ఆత్మ భగవంతునికి ఆధారిత భాగంగా ఉండినప్పటికి అతనికి భిన్నంగా వుందని మధ్వాచార్యులు నమ్మారు. ఆత్మ పరిమితం, ఆధారితమైనప్పటికి భగవంతునికి భిన్నంగా ఉందని, భగవత్‌శక్తిగా అతనితో సమరూపకమని నింబార్కులన్నారు. ఆత్మ భగవంతునితో సమరూపకమని, పరిమిత పరిస్థితుల్లో భగవంతునికి భిన్నంగా ఉందని భాస్కరాచార్యుల అభిప్రాయం. ఆత్మ భగవంతునిలో ఒక భాగమైనా భగవంతునితో సమరూపకమని కొన్ని దివ్యరీతులు పరిమితంగా వ్యక్తీకరించటం వల్లనూ, కొన్ని మరుగున ఉండటం వల్లనూ భిన్నంగా గోచరిస్తున్నాయని వల్లభాచార్యులన్నారు.

భగవంతుని గొప్పదనాన్ని తెలుసుకొని అతనితో దృఢమైన స్నేహభావం పెంచుకొనటమే ముక్తిసాధనమని భక్తికి నిర్వచనమిచ్చారు. భక్తి ప్రేమతో కూడిన సేవాభావం. దీని అర్థం భగవంతునిపై అనురాగం, మిగతావాటిపై విరాగంగా ఉండటం. ఇది పూజకాదు జ్ఞానం కాదు. ప్రేమభావం, భక్తియొక్క ఆధిపత్యస్థాయీ భావం,.భగవంతునితో ఏకం కావటం దీని పరాకాష్ఠకాదు. ఇది భగవంతుని దయవల్ల హృదయనైర్మలంతో పొందేటటువంటిది. వేదమార్గాన్ని మర్యాదమార్గమంటారు. ఆ మార్గంలో కర్మ, జ్ఞాన, ఉపాసనల ద్వారా భక్తిని పొందవచ్చు. వ్యక్తిగతకృషి/ప్రయత్నాల వల్ల పాపాలను నిర్మూలింపజేసుకోవచ్చు. అయితే పుష్టిమార్గంలో భగవంతుని దయ ద్వారా భక్తిని అలవరచుకోవచ్చు. పాపాలను నివారించకోవచ్చు. భక్తుని భక్తితో తృప్తిపొందిన భగవంతుడు భక్తున్ని తనలో కలుపుకొంటాడు. లేదా భక్తుని భక్తితో తృప్తి పొందిన భగవంతుడు భక్తున్ని దగ్గర ఉంచుకొని మధురసేవలను పొందుతాడు.

## బ్రహ్మ

వల్లభాచార్యుల ప్రకారం బ్రహ్మన్ ఒకటే మౌలికసత్యం. బ్రహ్మన్ ప్రాథమిక గుణం "ఏకమేవా అద్వితీయం" అంటే బ్రహ్మన్ ఒకటేగాని రెండవది లేదు. ఈ అర్థం శంకరాచార్యుల అద్వైతంల్లో ,లేదు, బ్రహ్మాసత్యం,, జీవజగత్తులు

మాయామిథ్యలు అని శంకారచార్యులభావన. వల్లభాచార్యుల ప్రకారం బ్రహ్మ ఒకటే, రెండవది లేదు. జీవజగత్తులు బ్రహ్మలోని అంశాలే. అవి బ్రహ్మ సమరూపకాలు. జీవజగత్తులు మాయామిథ్యలు కావు. అవి బ్రహ్మంశాలన్నది వాస్తవం. పూర్ణం సత్యమైతే విశ్వంలోని జీవరాసులు, పదార్థం అవాస్తవం, అసత్యం ఎలా కాగలవు? కాబట్టి జీవజగత్తులు బ్రహ్మాంశాలుగా బ్రహ్మ ఎంత సత్యమో, అవికూడా అంతే సత్యం. బ్రహ్మన్‌కు ద్వితీయంగా లేవు. పూర్ణానికి పాక్షికం ఎలా అద్వితీయమనగలదు? చెట్టుకు ఆకు ఎట్లాగో, సముద్రానికి అల ఎట్లాగో బ్రహ్మకు జీవజగత్తులు అలాగే అని అర్థం.

## నిర్విశేషమే బ్రహ్మ

వల్లభాచార్యుల ప్రకారం బ్రహ్మ నిర్విశేషమేగాని సవిశేషంకాదు. అతనికి స్వగత భేదాలు లేవు. అతని అంతర్గత అంశాలు భాగాలు, గుణాలు, శక్తులు అతని సమరూపకాలే.

స్వగతభేద, నిర్విశేషత్వ భావన గురించి మూడు భిన్నదృక్పథాలున్నాయి. (1) బ్రహ్మకు స్వగత భేదంలేదు. బ్రహ్మ స్వగత భేదాలుగా జీవజగత్తులు లేవు. మాయమిథ్యలు అసత్యం. కాబట్టి బ్రహ్మ స్వగత భేదంలేనందున ఇది నిర్విశేషం. ఇది అద్వైతువాదుల దృక్పథం. శంకరులు ఇతరుల సిద్ధాంతం కూడా ఇదే. (2) బ్రహ్మసవిశేష జీవజగత్తులు అతని స్వగత భేదాలుగా ఉన్నాయి. రామానుజ నింబార్కుల మాదిరి ఇది విశిష్టాద్వైత దృక్పథం. (3) బ్రహ్మన్ నిర్విశేషం. బ్రహ్మనికి స్వగత భేదాలు లేవు. జీవజగత్తులు అతనిలోని అంశాలు. అతనికి సమరూపకాలు. ఇది మధ్వాచార్యులు, వల్లభాచార్యుల వారి భేదవాదుల, శుద్ధద్వైతవాదుల దృక్పథం.

"బ్రహ్మన్ సర్వాంతర్యామి. త్రికాలబాధ్యుడు, చైతన్యవంతుడు ఆనందస్వరూపుడు, మార్పులేనివాడు, సర్వశక్తి సంపన్నుడు. సర్వస్వతంత్రుడు, సర్వజ్ఞాని. ప్రాపంచిక గుణరహితుడు. సజాతీయ, విజాతీయ, స్వగతభేదం లేనివాడు. సత్య సద్గుణవంతుడు. అన్నిటికి ఆధారభూతుడు, ఆనందస్వరూపుడు, ప్రాపంచిక వస్తువులకు భిన్నంగా ఉండేవాడు."

## బ్రహ్మసగుణవంతుడు, నిర్గుణవంతుడు

అనేక సద్గుణ, శుభ, దివ్యగుణాలు కలిగినవాడు కాబట్టి బ్రహ్మన్ సగుణవంతుడు. గుణాలకు అతీతుడు ప్రాపంచిక గుణాలు లేనివాడు కనుక నిర్గుణవంతుడు.

ఈ సందర్భంగా ఇతర వేదాంత వ్యవస్థలలో లేని నూతన అభిప్రాయాన్ని వల్లభాచార్యులు అందించాడు, వెలిబుచ్చాడు. పైన పేర్కొన్నట్లు మరొక అర్థంలో బ్రహ్మను నిర్గుణుడని అంటారని పేర్కొన్నాడు. బ్రహ్మకు శరీరం, అవయవాలు, రూపాలు, దుస్తులు, అలంకరణలు, నివాస స్థలాలు, కార్యకలాపాలు, భాగాలు, గుణాలు, శక్తులు సమరూపకాలు కాబట్టి బ్రహ్మకు స్వగతభేదంలేదు. పాము, చుట్టుకొని పడుకున్న పాము, సూర్యకిరణం, సూర్యుడు ఎలానో, బ్రహ్మలోని అంశాలు, బ్రహ్మ ఒకటే. సామాన్యంగా వీటన్నిటిని స్వగతభేదాలుగా గైకొనాలి లేదా అంతర్గతమైన బ్రహ్మభేదాలుగా గైకొనాలి. అందువల్ల అతని నుంచి అవి భిన్నమైనవి, అభిన్నమైనవి. స్వరూపంలో అభిన్నమైనవి, గుణాలలోనూ, శక్తులలోనూ భిన్నమైనవి. కాని వల్లభాచార్యుల ప్రకారం అవి పూర్తిగా బ్రహ్మ సమరూపకాలు. అతని స్వగతభేదాలలోనూ, అంతర్భేదాలలోనూ కలిసి ఉండవు. ఈ అర్థంలో బ్రహ్మన్ నిర్గుణుడు. ఏ గుణాలు లేనివాడు. బ్రహ్మ శుద్ధద్వైతాన్ని అర్థం చేసుకున్నవారు బ్రహ్మనిర్గుణుడని ఏ గుణాలు లేనివాడని తెలుసుకొంటారు. బ్రహ్మ యొక్క బాహ్య వ్యక్తీకరణలను తెలుసుకున్న వారు బ్రహ్మను సగుణుడని తెలిసికొంటారు.

ఇచట మనం శంకరాచార్యుల నిర్గుణత్వవాదానికి, వల్లభాచార్యుల నిర్గుణత్వవాదానికి ఉన్న భేదాన్ని గుర్తించాలి. శంకారచార్యుల ప్రకారం బ్రహ్మనికి స్వస్వరూపముంది. గుణాలు, శక్తులు, అంశాలులేవు. ఈ అర్థంలో బ్రహ్మనిర్గుణుడు వల్లభాచార్యుల ప్రకారము బ్రహ్మనికి స్వస్వరూపముంది. గుణాలు, శక్తులు, అంశాలు ఉన్నాయి. అవన్ని బ్రహ్మన్ సమరూపకాలే. ఈ అర్థంలో బ్రహ్మన్ నిర్గుణుడు.

అచింత్య వాదులతో ఏకీభవిస్తూ వల్లభాచార్యులు కూడా 'అనంత అచింత్యగుణ శక్తులను' పదే పదే నొక్కిచెప్పాడు. బ్రహ్మ ఎన్నో అద్భుతమైన గుణాలను, శక్తులను కలిగినటువంటివాడు. వాటిని మనం ఊహించనుకూడా ఊహించలేం. అలాగే బ్రహ్మ వైరుధ్యగుణాలను, శక్తులను కూడా కలిగి ఉన్నాడు. అతనికి అసాధ్యమన్నది లేదు. వాస్తవానికి అటువంటి వైరుద్యగుణాలు, శక్తులు అతని వైభవాన్ని, శక్తిమంతాన్ని తెలియజేస్తాయి. అందువల్ల బ్రహ్మసూత్రాలపై అతడు రాసిన 'అనుభాష్యం' అన్న వ్యాఖ్యాన గ్రంథంలో బ్రహ్మకు ఊహించనటువంటి గుణాలు, శక్తులు ఉన్నాయని, అతడు ఏమైనా, ఏదైనా చేయగలడని రాశాడు. రసవత్తరంగా చెప్పాడు. అతనిలో అటువంటి వైరుధ్యగుణాలు, శక్తులున్నప్పటికి అనుగుణాన్ని అతనిలో ఉత్పత్తి చేయలేవు.

అందువల్ల వల్లభాచార్యులు పదే పదే 'విరుద్ధ సర్వధర్మాశ్రయత్వంతు బ్రహ్మణో భూషణాయ' అని నొక్కిచెప్పాడు.

బ్రహ్మ వైరుధ్యగుణాలు, శక్తులు అతని ప్రాభవానికి, శక్తికి, గొప్పతనానికి, ఖ్యాతికి నిరూపనయన్నది వాస్తవం. సామాన్య వ్యక్తికి అటువంటి వైరుధ్యగుణాలు, శక్తులు ఉండవు. అలావుంటే అతడు వెంటనే చిన్నాభిన్నమయి నాశనమవుతాడు. ఎవరిలోనూ అటువంటి వ్యతిరేక లక్షణాలు ఉండవు. బ్రహ్మ చేయ గలిగింది చేయగలడు. అతని అద్భుతశక్తులతో అంతర్గత అనుగుణాలను, అపసవ్యాలను, వైరుధ్యాలను పరిష్కరించగలడు. ఎక్కడా లేనటువంటి ప్రత్యేక వైభవం బ్రహ్మలో ఉంటుంది. ఇక్కడ కూడా బ్రహ్మను సృష్టి, స్థితి, లయకారుడన్నారు. ఈ జగత్తుకు, జీవరాసులకు అతడే ఉపాదానకారణం, నిమిత్తకారణమన్నారు.

## బ్రహ్మ సక్రియుడు

శంకరాచార్యులు, ఇతర అద్వైతవాదులన్నట్లు బ్రహ్మన్ సక్రియుడే కాని నిష్క్రియుడు కాదు. అతని రెండు ముఖ్యవిధులు, సృష్టించటం, ముక్తినివ్వటం. అతడు సృష్టికర్త అయినప్పటికి పరిపూర్ణంగా నిర్వికారుడు,

మార్పునొందనివాడు. అతడు జగత్తుకు, జీవరాసులకు ఉపాదానకారణ మయినప్పటికి, ప్రాపంచిక గుణాలకు లొంగేటటువంటి వాడు కాడు. సామాన్యసృష్టిలో కుమ్మర మట్టిలాంటి బాహ్యావస్తువును, ఇతర సాధనాలను తీసుకొని తన అంతర్భావములో ఉన్న కుండను తయారుచేస్తాడు. ఉపాదానకారణం ఒక ప్రత్యేకమైన మట్టికుండగా మారిపోతుంది. కార్యం ఉత్పన్నమవుతుంది. బ్రహ్మ విషయంలో ఇదంతా భిన్నంగా ఉంటుంది. ఇక్కడ బ్రహ్మే ఉపాదానకారణం అయి జగత్తు, జీవరాసులుగా మారిపోతుంది. అయినా అతడు మార్పునొందక స్థిరంగా ఉంటాడు. అతడు కూడా బాహ్యావస్తువులను, అంతర్గతవస్తువులను సహాయంగా గైకొనడు. ఈ ప్రత్యేక వల్లభాచార్యుల సిద్ధాంతాన్ని 'అవికృత పరిణామవాద' మని పిలిచారు.

బ్రహ్మకర్తృత్వం అతని సహజలక్షణం. మాయతో సంబంధంలేదని అద్వైత వాదులన్నారు.

బ్రహ్మభోక్తృత్వము కూడా అలాంటిదే. అతని కర్తృత్వం మాదిరి అతని భోక్తృత్వం అలౌకికమైనటువంటిది. అసాధారణమైనటువంటిది. బ్రహ్మగావించే కార్యాల ఫలాలు అతనికి వర్తించవు. అతని అనుభవాలు, ఆనందాలు అతని లీలావినోదమే.

ఇతర ఏకదేవారాధక వేదాంతుల వలె వల్లభాచార్యులు కూడా సచ్చిదానందములో అతని స్వరూపం, గుణాలుంటాయని పేర్కొన్నాడు. ఈ విధంగా బ్రహ్మన్ నిత్య అస్తిత్వం గలవాడు. నిత్య చైతన్యవంతుడు. నిత్యానందుడు. ఏకదేవారాధక వేదాంతులతో ఏకీభవిస్తూ బ్రహ్మన్ జ్ఞాతయని, కర్తయని, భోక్తయని వల్లభాచార్యులు నుడివారు. అతీంద్రియ జ్ఞానంతో చూస్తే బ్రహ్మన్‌కు మూడురూపాలున్నాయి.

**మొదటిది:** ఆదిదైవికరూపం. ఈ రూపంలో పురుషోత్తముడైన శ్రీకృష్ణుడు ఈ గోళకానికి ప్రభువు. అతనికి సచ్చిదానంద స్వరూపమైన అభౌతిక దివ్యశరీరముంది. అతనికి అభౌతికమైన గుణాలెన్నో ఉన్నాయి. శక్తులు కూడా ఉన్నాయి. పైన పేర్కొన్నట్లు అతని స్వభావం, గుణాలు, శక్తులు,

శరీరం, దుస్తులు, ఆభరణాలు, పేర్లు, నివాసస్థలాలు, భాగాలు అంశాలు ఒక దానికొకటి సమరూపకాలున్నాయి. వీటన్నింటికి బ్రహ్మాన్ ఆధారభూతమైనప్పటికీ, వైకుంఠంలో వసిస్తున్నా అతనిలో ఏ మాత్రం ద్వంద్వం లేదు. అతడు పరిపూర్ణంగా, శాశ్వతంగా శుద్ధాద్వైత స్వరూపుడు. శ్రీకృష్ణుడ్నే పరబ్రహ్మగా భావించి పరబ్రహ్మను సాధించుకున్న గొప్ప భక్తులెందరో ఉన్నారు. ఈ విధంగా బ్రహ్మమైన శ్రీ కృష్ణుడు భక్తులతో దివ్య క్రీడలలో తనకు తానుగా పాల్గొంటూ అమితానందం పొందుతూ ఆ అమితానందాన్నే భక్తులకు ప్రసాదిస్తున్నాడు.

శ్రీకృష్ణుని దివ్యధామం, విష్ణువు దివ్యధామం భిన్నమైనవి. శ్రీకృష్ణుని దివ్యధామం బృందావనం, విష్ణువు దివ్యధామంవైకుంఠం. యమునానది ఒడ్డున అందమైన తోటలు, పొదలతో అలరారు బృందావనంలో నివసించే వారు శ్రీకృష్ణుని భక్తులు. వీరంతా గోపికలుగా రాసక్రీడలో పాల్గొని దివ్యానందాన్ని పొందేవారు. ఇది అత్యున్నతమైన ముక్తి. పొదలు, చెట్లు, పూలు పక్షులతో అలరారు బృందావనం, యమునానది శ్రీకృష్ణుని దివ్యధామమని వల్లభాచార్యులు అన్నారు. శ్రీకృష్ణునితో క్రీడించు గోపబాలురు, గోపికలు, ఆవులమందలు ముక్తినొందిన ఉన్నతమైన జీవాత్మలు.

పరబ్రహ్మ రెండవ రూపం అక్షరరూపం. ఈ రూపములో పరబ్రహ్మం అతని గుణాలలోనూ, శక్తులలోనూ దాగి ఉంటాడు. అతని శక్తులు ఊహకందనివి. ఈ రూపంలో ఆనందం అతని సత్‌చిత్ రూపాలలో దాగి ఉంటుంది.

అక్షర బ్రహ్మనికి రెండు రూపాలుంటాయి. 1. జ్ఞానులకు జిజ్ఞాసువులకు అతడు గుణాల, భేదాలు లేని నిర్గుణ నిర్విశేష జ్ఞానస్వరూపుడుగా వ్యక్తమవుతాడు. 2. భక్తులకు అతడు సగుణ రూపమైన శ్రీకృష్ణునిగా ఆడుతూ ఆనందిస్తూ వ్యాప్తికెక్కడంలో ఉంటాడు.

పరబ్రహ్మమూడవ రూపం అంతర్యామి లేదా పరమాత్మరూపం. ఈ రూపంలో శ్రీకృష్ణుడు జీవరాసుల, జగత్తు, అవతారాల సృష్టి కర్తగా భాసిల్లుతూ ఉంటాడు.

బ్రహ్మాన్‌కు భౌతిక పరమైన సత్వరజస్సు, తమస్సు గుణాలుండవు. అతనికి అభేతికమైన సత్వ రజస్సు తమస్సులు ఉంటాయి.

బ్రహ్మాన్ సర్వాంతర్యామిగా, అందరిలో అంతర్గత అధికారిగా తనంత తాను వ్యక్తీకరించుకుంటాడు. అతని సత్వగుణం వల్ల విగ్రహారూపం పొంది విష్ణువుగా భాసిల్లుతాడు. అలాగే రజోగుణం వల్ల బ్రహ్మ విగ్రహరూపంపొంది భాసిల్లుతాడు. తమోగుణం వల్ల శివరూపం పొంది భాసిల్లుతాడు. ఈ విధంగా విష్ణు, బ్రహ్మ, శివ రూపాలు ప్రభువైన కృష్ణుని గుణావతారాలు.

## చిత్ (చిత్తం)

ఇచట వల్లభాచార్యులు క్రొత్త విషయమేమీ చెప్పలేదు. ఏకోదేవా రాధకుల వేదాంతులవలె చిత్‌లేక జీవుడే జ్ఞాతయై కర్తృత్వ భాక్తృత్వంగా కర్మఫలాలను అనుభవించువాడని వల్లభాచార్యులు అన్నారు. అణురూపంలో చిన్నదై, బహురూపాలలో అసంఖ్యాకమై బ్రహ్మాంశంగా వెలుగొందుతున్నాడని ఆచార్యులు నుడివారు.

"పెక్కు నిప్పురవ్వలు నిప్పునుంచి ఎలా వెలువడతాయో, సత్తునుండి భౌతిక వస్తువులు, చిత్ నుంచి జీవరాసులు, ఆనందం నుంచి అంతర్యామి రూపం వెలువడుతాయి."

ఈ విధంగా జీవుడు పరబ్రహ్మవలె సత్, చిత్‌లేగాని అతని వలె ఆనందం కాదు. పరబ్రహ్మం యొక్క ఆనందం ఎప్పుడు మరుగవుతుందో, అప్పుడు జీవుడు ఉద్భవిస్తాడు. జీవాత్మలు మూడు రకాలు. శుద్ధాత్మలు, సంసారిణులు, ముక్తులు. 1. శుద్ధజీవులు అవిద్య, అజ్ఞానంతో సంబంధం లేకుండా పరబ్రహ్మ వైభవాన్ని కలిగి నిత్యముక్తులుగా ఉంటారు. 2. సంసార జీవులు అవిద్యకు గురై స్థూలసూక్ష్మ శరీరాలను కలిగి జనన మరణ చక్రభ్రమణంలో తిరుగుతుంటారు. సంసార జీవులంతా బద్ధజీవులు. వీరిలో కూడా రెండు రకాలైన వారుంటారు. వారు సద్వాసనా విశిష్టులు. అసద్వా సనానిష్టులు. మొదటి వారు సద్గుణములు కలిగి ఉంటారు. వారికి ముక్తియే పరమావధిగా ఉంటుంది. రెండవ వారు కల్మశగుణాలు కలిగి బంధమే

పరమావధిగా కలిగి ఉంటారు. 3. ముక్త జీవులు అజ్ఞాన, అవిద్య, వాసన కామం నుంచి తమ సాధనచే విడివడి ముక్తులై ఉంటారు. ముక్త జీవులు ఖచ్చితమైన సాధనలు చేసి, సకామకర్మలను వదలి అవిద్య అజ్ఞాన, వాసనాకామనల నుంచి విడివడి, జననమరణ చక్రాల నుంచి విముక్తులై చివరకు మోక్షం సాధిస్తారు.

ఈ విధంగా వల్లభాచార్యులు చేసిన జీవాత్మల వర్గీకరణ ఏక దేవారాధక వేదాంతులు చేసిన జీవాత్మల వర్గీకరణకు సరిపోతుంది.

జీవుడు పరబ్రహ్మం యొక్క కార్యరూపం కాబట్టి పరబ్రహ్మానికి సమరూపకంగా ఉంటాడు.

**అచిత్**

అచిత్ రెండు రకాలు. ఒకటి ప్రకృతి, రెండవది కాలం. జగత్తు ఆవిర్భావానికి ప్రకృతి మూలకారణం. జీవుని వలె జగత్తు సత్యంశాశ్వతం, కార్యం, బ్రహ్మస్వరూపం, బ్రహ్మలో ఒక భాగము. బ్రహ్మ సమరూపకం. జగత్తు పరబ్రహ్మవలె సత్తు కాని చిత్ కాదు, ఆనందంకాదు. బ్రహ్మచిత్, ఆనందాలు మరుగయితే జగత్తు ఆవిర్భవిస్తుంది.

**విశ్వసృష్టి: విశ్వమాయ మిథ్యయన్న సిద్ధాంతాలను కాదనడం**

వల్లభాచార్యుల ప్రకారము సృష్టిక్రమము ఇలా ఉంది.

సృష్టికి ముందు బ్రహ్మన్ ధృతక్కరణంగానూ, ఏకత్వవాదంగానూ ఉండేవాడు. ఈ కారణంగా పరిపూర్ణానందం ఉన్నా, ఆ ఆనందం వ్యక్తీకరణ కాలేదు. వాస్తవానికి పరబ్రహ్మ ఆనంద వ్యక్తీకరణమే అతని క్రీడ. క్రీడకు కనీసం ఇద్దరు వ్యక్తులు ఎలా అవసరమో, అలాగే పరబ్రహ్మ క్రీడకు జీవజగత్తులను ఆటగాళ్ళుగా సృష్టించాడు.

అటువంటి క్రీడ పరబ్రహ్మ కోరిక వల్లనో, అపరిపూర్ణం వల్లనో వచ్చింది కాదు. అతని ఆనందం వ్యక్తీకరించినందువల్ల వచ్చింది. జీవునికి సరైన సాధనాల ద్వారా ముక్తిని ఆర్జించుటకు ఒక అవకాశాన్ని కల్పించినట్లు

అవుతుంది. బ్రహ్మాన్ తన శక్తులద్వారా ఆనంద గుణాన్ని అందజేయడం వల్ల జీవులు ఉద్భవిస్తాయి. అలాగే చిద్గుణం. ఆనందగుణం మరుగున పరచినప్పుడు జగత్తు ఉద్భవిస్తుంది.

ఈ విధంగా బ్రహ్మాన్ సద్గుణ వ్యక్తీకరణం వల్ల జగత్తు ఏర్పడింది. సత్‌చిత్ గుణాల వల్ల జీవులు ఏర్పడ్డాయి. సత్ చిత్ ఆనందాల వల్ల అంతర్యామి ఉద్భవించింది. నిప్పురవ్వలు నిప్పు నుండి వెలువడినట్లు బ్రహ్మానుండి జగత్తు, జీవులు, అంతర్యామి ఏర్పడ్డాయి.

## రెండు రకాల మార్పులు

ఇతర ఏక దేవారాధన వేదాంతులతో ఏకీభవిస్తూ బ్రహ్మాన్ జీవజగత్తులుగా మారతాడని వల్లభాచార్యులు చెప్పాడు. బ్రహ్మాన్ అలా జీవజగత్తులుగా మారినా తాను మాత్రం మారడు. మరోరూపం పొందడు. అని అన్నాడు. ఈ సిద్ధాంతాన్ని మార్పురహిత సిద్ధాంతమన్నారు. వల్లభాచార్యుల ప్రకారం రెండు రకాలైన పరిణామాలుంటాయి. మొదటి దాంట్లో కారణం కార్యరూపం ధరించినా కారణంలో మాత్రం మార్పు ఉండదు. అందువల్ల కారణం కార్యరూపం ధరించినా తిరిగి కారణరూపం ధరించవచ్చు. ఉదాహరణకు బంగారు ముద్దను చెవి పోగుగా మార్చినప్పటికి బంగారు ముద్ద సహజత్వములో ఏ మార్పు ఉండదు. దాని స్వర్ణత్వాన్ని అది నిలుపుకుంటుంది. దాని సహజత్వముమారినటువంటి చెవి పోగులో కూడా ఉంటుంది. దీంట్లో ఏ రకమైన వైరుధ్య గుణముండదు. చెవిపోగును కరగించిబంగారు ముద్ద చేసుకోవచ్చు. ఈ విధంగా కారణం కూడా తన సహజత్వాన్ని కోల్పోదు. దీన్ని అనికృత పరిణామమంటారు.

రెండవ దానివిషయంలో కారణం కార్యరూపం ధరించిందంటే దాని సహజత్వం కూడా మారుతుంది. ఆ కార్యంలో నూత్నమైన వైరుధ్యగుణాలు చోటు చేసుకుంటాయి. ఉదాహరణకు పాలును పెరుగుగా మార్చవచ్చు. కాని పెరుగును పాలగా మార్చలేం. అంటే పాలసహజత్వాన్ని పెరుగు అయిన తర్వాత కోల్పోతుంది. ఇలా కారణం కార్యరూపం ధరిస్తే తిరిగి కారణరూపాన్ని పొందదు. దీనిని కృతపరిణామమంటారు.

పైన పేర్కొన్నట్లు బ్రహ్మన్ జీవ జగత్తులుగా మారిన దాన్ని అవికృత పరిణామమంటారు. బ్రహ్మన్ జీవజగత్తులుగా మారినా బ్రహ్మన్ సహజత్వంలో ఏమార్పూ ఉండదు. అతనిలో వైరుధ్యగుణాలేమి కనిపించవు. బ్రహ్మన్ యొక్క ఊహాతీతశక్తులతో తన సచ్చిదానంద గుణాలు మరుగునపడ్డా అతని సహజత్వంలో మార్పు వచ్చినట్లు కాదు. సృష్టికి పూర్వం, సృష్టి తర్వాత కూడా సచ్చిదానంద స్వరూపంలో మార్పు ఉండదు.

ఈ సందర్భంలో వల్లభా చార్యులు లోహం, కామధేనువు, కల్పాద్రుమ చింతామణి అనే నాలుగు సరైన ఉదాహరణలను ఉదాహరించాడు. బంగారు వలె లోహాన్ని గురించి ఇది వరకే పేర్కొన్నారు. గోవు దూడ అయినటువంటి కామధేనువు, కోరికలు తీర్చే కల్పవృక్షం, కోరికలు తీర్చే చింతామణి కార్యరూపం ధరించినా వాటి మూల తత్త్వంలో మాత్రం ఏ మార్పూ ఉండదు.

## మాయ

ఈ విధంగా జీవజగత్తులు మార్పునొందని బ్రహ్మన్ యొక్క కార్యరూప మయితే అవి కూడా బ్రహ్మన్ మాదిరే సత్యమైనవి, శాశ్వతమై ఉండాలి.

ఈ కారణంపై వల్లభాచార్యులు శంకరుల మాయావాదాన్ని ఖండించాడు. శంకరుల అద్వైత వాదం కూడా ద్వైతవాదమేనన్నారు. అద్వైత వాదం ప్రకారం మాయ అజ్ఞాన, అవిద్యస్వరూపం. అందువల్ల బ్రహ్మన్‌కు పూర్తిగా భిన్నమైంది. బ్రహ్మన్ జ్ఞాన స్వరూపుడు, మాయ అవిద్యాస్వరూపిణి. మాయ బ్రహ్మన్ యొక్క ద్వితీయ తత్త్వం. వల్లభాచార్యుల ప్రకారం మాయ అవిద్యా స్వరూపిణి కాదు. అది ఒక అచింత్య శక్తి మాత్రమే. అది ఊహకందని బ్రహ్మ అద్భుతశక్తి.

ఈ మాయాశక్తి ద్వారానే బ్రహ్మన్ జీవ జగత్తులను సృష్టిస్తాడు. ఇది క్రియాశక్తి. మాయ పరబ్రహ్మ యొక్క క్రియాశక్తి, ఈ క్రియాశక్తికి ముందస్తు జ్ఞానముంటే మాయాశక్తి అదిద్వాశక్తికానేరదు.

జీవాత్మలో ఉండే సహజమైన అజ్ఞానం అసత్యజ్ఞానాన్ని కల్పిస్తుందనటం వాస్తవం. అయితే అసత్య వస్తువులను కల్పించదు. అద్వైత వాదం ప్రకారం మాయ అసత్యవస్తువులను సృష్టించదనటం అసాధ్యమయినపని. మాయ అసత్యజ్ఞానాన్ని అందిస్తుందేగాని ఆసత్యవస్తువులను కాదు. . అందువల్ల మాయకు రెండు రకాలైన శక్తులుంటాయి. ఒకటి వ్యామోహిక శక్తి. రెండవది ఆచ్ఛాదిక శక్తి. వ్యామోహిక శక్తి ద్వారా మాయు జీవుల బుద్ధిని మతిభ్రమింపజేస్తుంది. ఆచ్ఛాధిక శక్తిద్వారా వస్తువు నిజతత్వాన్ని జీవునికి మరుగుపడునట్లు చేస్తుంది. ఈ కారణంగానే జీవునకు వస్తువును గురించి అసత్యజ్ఞానం వస్తుంది. వస్తువు తానంత అదే. అసత్యం కాదు. ఎందుకంటే దీని జ్ఞానం అసత్యం. ఈ విధంగా మాయాజీవునిలో అసత్యజ్ఞానాన్ని కల్పిస్తుందేగాని అసత్యవస్తువులను కాదు.

ఈ విషయం స్పష్టమవటానికి వల్లభాచార్యులు పదే పదే చెప్పే వాడు. "ఒక వస్తువు మరొక వస్తువుగా కన్పిస్తే అది జీవుని యొక్క వ్యామోహిక శక్తి. అలా మాయ జీవుని పలు విధాలుగా భ్రమింపజేస్తూ ఉంటుంది. జీవుని అంతఃకరణాన్ని, బుద్ధిని భ్రమింపజేస్తూ ఉంటుంది. తత్ఫలితంగా భ్రమించిన బుద్ధి తాడును పాముగా చూస్తుంది. పైన పేర్కొన్నట్లు అటువంటి అసత్యఅవగాహన అసత్య వస్తువులను సృష్టించలేదు. అలా మాయ అసత్యజ్ఞానాన్న రెండువిధాలుగా కల్పిస్తూ ఉంటుంది. వస్తువు స్వరూపాన్ని తెలియజేయనివ్వదు. లేనటువంటి కొత్త వస్తువును తెలియజేస్తుంది.

## జగత్తు, సంసారం

ఈశ్వరగతమాయకు, జీవగత అవిద్యకు, జగత్తుకు, సంసారానికి మధ్య గల భేదాన్ని తెలియజేయటం లేదని అద్వైత వాదంలోని ముఖ్యలోపాన్ని వల్లభాచార్యులు తెలియజేశాడు. బ్రహ్మన్‌లో సహజంగా ఉండే ఈశ్వరగత మాయ వూహకందని అద్భుతమైన అచింత్యశక్తి. ఇది బ్రహ్మమాదిరి వాస్తవమైన నిత్యమైన జగత్తును ఉద్భవింపజేస్తుంది.

బ్రహ్మాన్ తన క్రీడానందం కోసమే తన మాయాశక్తి ద్వారా జగత్తును నిర్మిస్తుంది. జగత్తు వాస్తవం. బ్రహ్మాన్ క్రీడాచర్య అసత్యమెందుకవుతుంది. జగత్తు సత్యమైనదేగాదు, నిత్యమైనది కూడా. సత్కార్యసిద్ధాంతం ప్రకారం కార్యమైన జగత్తు కారణమైన బ్రహ్మాలో ఉంది. సృష్టికి ముందూ ఉంది. సృష్టించేటప్పుడూ ఉంది. వినాశనం జరిగిన తర్వాత కూడా ఉంటుంది. నిజం చెప్పాలంటే సత్కార్యవాదం ప్రకారం సృష్టి అన్నది లేనటువంటిదాన్ని నూతనంగా సృష్టించటం కాదు. ప్రారంభం నుంచి కారణరూపంలో ఉండి కార్యరూపంగా వ్యక్తీకరింపబడింది. అదే విధంగా వినాశనమంటే కారణమైన బ్రహ్మాలో నిత్యం ఉండే అవ్యక్తీకరణ క్రియయే కాబట్టి జీవజగత్తులు బ్రహ్మాన్ మాదిరి సత్యమైనవి. బ్రహ్మాలోని అంశాలే కాబట్టి బ్రహ్మాకు సమరూపకాలుగా ఉంటాయి. జీవజగత్తులు అతనిలో ఎల్లప్పుడూ ఉండేవే.

సంసారం జీవగతా అవిద్యఫలితమే. అజ్ఞానంచే జీవుడు స్వార్థబుద్ధితో ఫలాలను ఆశిస్తూ సకామకర్మలు చేస్తాడు. అందువల్ల లెక్కలేనన్ని జన్మలు, పునర్జన్మలు తీసుకుంటాడు. దీన్ని సంసార చక్రమన్నారు. దీనినే జన్మ పునర్జన్మల చక్రమని కూడా అంటారు. పరబ్రహ్మాలోని మాయా శక్తి వల్ల సృజింపబడిన అందమైన జగత్తులో సంసారాన్ని సంకుచితమైన అహంకార మమకారాలతో ప్రాపంచిక జీవులు సృజించుకుంటూ ఉంటారు.

ప్రపంచ ఆవిర్భావానికి ముఖ్యకారణము ప్రకృతి కాదు. పదార్థం కాదు. పరమాణువులు కాదు. వివర్తం కాదు. అదృష్టం కాదు, బద్ధజీవుల గతకర్మల నియమం కాదు. అసత్తుకాదు. అస్థిత్వం కాదు. ప్రకృతికి ముఖ్య కారణము బ్రహ్మాయే ఈ కారణం వల్ల జగత్తు ఈశ్వరుని యొక్క రూపమే.

పైన చెప్పినట్లు జగత్తు, సంసారం ఒకటేకాదు. జగత్తు భగవంతుని ద్వారా సృజింపబడింది. సంసారం జీవాత్మ సృజించుకుంది. ఈ కారణం వల్ల జగత్తు బ్రహ్మారూపం. అందువల్ల అవాస్తవం కాదు, అసత్యమూ కాదు. అలాగే సంసారం కూడా.

అవాస్తవమైన, అసత్యమైన సంసారం జీవుల అవిద్య, అజ్ఞానం వల్ల, ఉత్పన్నమైనది. ఆ విద్య ఈ విధంగా చెప్పబడింది.

భగవంతుడు తన లీలావినోదం కోసం జీవజగత్తులను సృజించాడు. ఈ కారణం వల్ల అతడు ఒక ఏజంటుగా, ఒక మిత్రునిగా ఒక సాధనంగా ఈ వినోద క్రీడను ఆడుచున్నాడు. జీవుడు కర్తృత్వ, భోక్తత్వ. ఏజంటుకాదు. భగవంతుడు ఒక్కడే అలా చేయగలడు సంకుచిత స్వార్థపరమైన అహంకార, మమకారాల ప్రభావంచే జీవుడు తనే కర్తృత్వ భోకృత్వాలని తలుస్తున్నాడు. దీనినే అవిద్యలేక అజ్ఞానమంటారు. సంసారం అటువంటి అవిద్యల వల్ల వచ్చిందే. బ్రహ్మజ్ఞానం పెరగటంతో అవిద్య నశిస్తుంది. సంసారం కూడా అదృశ్యమవుతుంది. జగత్తు అదృశ్యమవదు. ఇది బ్రహ్మమాదిరి శాశ్వతమైంది. దీనికి ఆవిర్భావ, తిరోభావముంటోందే కాని విలోపంగాని, పూర్తి విధ్వంసం గాని ఉండదు. సంసారానికి మాత్రమే విలోపముంటుంది, విధ్వంస ముంటుంది. బ్రహ్మసృష్టి అయిన జగత్తు, జీవసృష్టి అయిన సంసారం ఒకదానికొకటి భిన్నమైంది.

## బ్రహ్మకు, జీవజగత్తులకు గల సంబంధం

వల్లభాచార్యుల ప్రకారం బ్రహ్మన్ కారణం. పరిపూర్ణం జీవజగత్తులు అతని కార్యం అంశాలు. కార్యకారణాలు. పరిపూర్ణ పాక్షికాలు సమరూపకాలు. దీనికి కారణము బ్రహ్మనే జీవజగత్తులుగా ఆవిర్భవించారు. అందువల్ల జీవజగత్తులు బ్రహ్మన్‌కు వేరు కావు. బ్రహ్మన్ యొక్క భిన్నరూపాలు. ఒక వస్తువు రెండు మూడు భిన్న రూపాలుగా గనిపించినప్పటికీ, ఆ వస్తుత్వంలో మార్పు ఉండదు. ఆ వస్తువు వస్తువుగానే ఉంటుంది. ఉదాహరణకు పాము చుట్టచుట్టుకున్నా, పడగెత్తినా పాము పాములాగే ఉంటుంది కాని మార్పు ఉండదు. అలాగే సచ్చిదానందస్వరూపమైన బ్రహ్మన్ జీవజగత్తులుగా మారినా బ్రహ్మన్ బ్రహ్మన్‌లాగే ఉంటుంది. జీవజగత్తులు బ్రహ్మ యొక్క సమరూపకాలని తెలుసుకోవాలి.

## మోక్షం

ఇతర వేదాంతులతో పాటు సంసారానికి గాని, ప్రపంచానికిగాని ముఖ్య కారణం, అజ్ఞానం, అవిద్యయని వల్లభాచార్యులు కూడా అన్నాడు. అటువంటి అవిద్య వల్ల ఆత్మ అహంకారమమకారాలలో బంధంలో చిక్కుకుందని తెలుస్తోంది. బ్రహ్మన్‌కు భిన్నంగా వ్యవహరిస్తోంది. ద్వితీయవాస్తవంగా మనగలుగుతోంది. వాస్తవానికి జీవుడు పూర్తిగా బ్రహ్మతో సరిమాపకంగా ఉంటాడు. బ్రహ్మపైనే ఆధారపడిఉంటాడు. స్వతంత్రంగా, ప్రత్యేకంగా ఉన్నాననుకుంటూ సకామకర్మలకు తలొగ్గి ఉంటాడు. జన్మ పునర్జన్మల చక్రంలో అవిరామంగా తిరుగుతుంటాడు. ఇది బంధస్థితి. ప్రాపంచిక చక్రభ్రమణం.

## మూడు లోకాలు

జీవరాసులకు మూడు రకాలైన భిన్నలోకాలను జగత్తుకల్పిస్తుంది. 1. విముక్తి నొందిన ఆత్మ పరబ్రహ్మతో సరిసమానంగా ఉంటుంది. ప్రపంచం కూడా సచ్చిదానంద స్వరూపమైన పరబ్రహ్మకు సమరూపకంగా ఉంటుంది.

2. పరబ్రహ్మకు బ్రహ్మధర్మమని, మాయాధర్మమనే సుగుణాలున్నట్లు శాస్త్రాలు తెలిసిన వారికి, పండితులకు జీవరాసులకు తెలుస్తూ ఉంటుంది. మాయ అంటే భగవంతుని అద్భుతమైన సృష్టించగల శక్తి. ఈ మాయా శక్తివల్లనే పరబ్రహ్మ తనకిష్టమొచ్చిన ప్రతిదానిని సృజించగలడు. అటువంటి వ్యక్తులకు జగత్తు పరబ్రహ్మకు సమరూపకంగానూ, అసమరూపకంగానూ కన్పిస్తూ ఉంటుంది. అదే సమయంలో తాదాత్మక జ్ఞానమే సరైందని వారికి తెలుసు. తాదాత్మత లేని జ్ఞానం తప్పని తెలుసు. ఉదాహరణకు ఒక యువకుడు ట్రైనులో ప్రయాణిస్తూ కిటికీలగుండా చూస్తే చెట్లు చేమలు ట్రైనుతో పాటు పరుగెడుతున్నట్లు కనిపిస్తాయి. వాస్తవానికి ఆ చెట్లు కదలవు. ఉన్నచోటనే ఉంటాయి. అదే విధంగా శాస్త్రజ్ఞానం తెలిసినంతమాత్రాన మోక్షం రాదు. అది అనుభవంలోకి రావాలి. సత్యదర్శనం కావాలి. శాస్త్రాలు తెలిసిన

పండితులకు బ్రహ్మ, జీవజగత్తుల బాహ్య జ్ఞానమే తెలుసు కాని వాటిని గురించిన ప్రత్యక్ష జ్ఞానముండదు. ఆంతరంగిక సాక్షాత్కారముండదు.

3. ఈ అవిద్య అజ్ఞాన కారణంగా సాధారణ జీవులకు జీవ జగత్తులు బ్రహ్మ యొక్క సమరూపకంగానూ, అసమరూపకంగానూ కనిపిస్తాయి. తెలిసినవారికి, తెలియనివారికి ముఖ్యమైన భేదం ఒకటి కనిపిస్తుంది. తాదాత్మ్యత లేని జ్ఞానం తప్పని తెలిసినవారికి తెలుసు. దాన్నే తెలియని వారు సరైందని అనుకుంటారు. ఉదాహరణకు ట్రైనులో ప్రయాణిస్తూ కిటికీగుండా చూస్తే ఏమీ తెలియని బాలుడు చెట్లు కూడా పరుగిడుతుంటాయని అనుకుంటాడు. వానికి కలిగిన జ్ఞానం తప్పని అనుకోడు. అదే విధంగా బ్రహ్మన్, జీవజగత్తులను తెలిసినటువంటివారికి అని సమరూపకాలు, అసమరూపకాలు అని తెలుసు. వారికి తాదాత్మ్యజ్ఞానం సరైందని, తాదాత్మ్యత లేని జ్ఞానం తప్పుని తెలుసు. తెలియని వారికి జీవజగత్తులు బ్రహ్మతత్త్వమని తెలుసు అయినా బ్రహ్మకు భిన్నంగా ఉన్నాయని తెలుసు.

వల్లభాచార్యుల ప్రకారం ముక్తి అనగా గోపిభావాన్ని పొందడమే. బృందావనంలోని పరమపురుషుడైన శ్రీకృష్ణున్ని ప్రభువుగా, భర్తగా సేవించడమే ముక్తి.

ముక్తి అంటే నొప్పులు, బాధలు లేనటువంటిది కాదు. బ్రహ్మానందస్థితియే ముక్తి. ప్రేమ, సేవ,రాసలీల ద్వారా ఆ బ్రహ్మానందస్థితిని పొందటమే ముక్తి.

## విదేహముక్తి

ఏకదేవారాధకులైన వేదాంతాచార్యుల వలె వల్లభాచార్యులు కూడా ఒక విదేహముక్తివాది. అతని ప్రకారం ఇక్కడ శరీరంలోగానీ, ఈ ప్రపంచంలో గానీ లభ్యమయ్యేదికాదు. చనిపోయిన తర్వాత లభ్యమయ్యేది. సరైన సాధనాల ద్వారా జన్మలు, పునర్జన్మలు లేకుండా చేసుకోవటమే ముక్తి.

## సాధనలు - జ్ఞానం, భక్తి

ఏక దేవారాధకుల వలె వల్లభాచార్యులు కూడా ఒక భక్తివాది. అతని ప్రకారం ముక్తి సాధనాలుగా జ్ఞానం, భక్తిని తీసుకున్నప్పటికి జ్ఞానం

ద్వారా మాత్రం ముక్తి రాదు. జ్ఞానం లభించిన వాడు అక్షరరూప బ్రహ్మమును మాత్రమే తెలుసుకోగలడు. బ్రహ్మను అక్షరుడని, అనంతుడని, సర్వవ్యాపియని, గుణ రహితుడని తెలుసుకోగలడు. దానిక్కారణం – ఈ దశలో బ్రహ్మన్ తన సద్గుణ, శుభగుణాలను కప్పివేస్తాడు. కాని నిజమైన భక్తుడు బ్రహ్మస్వరూపమైన శ్రీ కృష్ణుని పరమానందాన్ని అనుభవిస్తాడు. అమృతమయమయిన శ్రీకృష్ణుని అనంతప్రేమను చవిచూచును.

## రెండు రకాల భక్తి

వల్లభాచార్యుల ప్రకారము భక్తి రెండు విధాలు. ఒకటి మర్యాదభక్తి. రెండవది పుష్టి భక్తి లేక రాగానుగ భక్తి. మొదటి రకం భక్తులు శాస్త్రాల ఆదేశానుసారం ముక్తిని పొందుతారు. రెండవ రకం భక్తులు భగవంతుని ప్రేమ, దయల ద్వారా బ్రహ్మానందామృతాన్ని చవిచూసి ముక్తి పొందుతారు. వీరికి ప్రత్యేక సాధనాలు అవసరం లేదు.

వల్లభాచార్యుల ప్రకారం మర్యాదభక్తి కంటె పుష్టిభక్తి ఉన్నతమైంది. పుష్టి అంటే పోషణం లేదా అనుగ్రహం. "అనుగ్రహరూపో, భాగవత్– ధర్మః పుష్టి".

ఈ రెండు విధాల భక్తికి గల భేదాన్ని వల్లభాచార్యులు ఇలా చెప్పారు. శాస్త్ర గ్రంథాల ద్వారా స్వయం కృషితో భక్తి జ్ఞానాలను అవలంబించి ఆచరించ వచ్చు. వీటిని సక్రమంగా అమలుచేస్తే వచ్చే ముక్తిని మర్యాదముక్తి అంటారు. శాస్త్రీయ సాధనాలులేని వారు కూడా తమస్వయం కృషిచే ముక్తిని సాధించవచ్చు.

పుష్టి భక్తి విషయంలో మాస్టరు యొక్క ప్రేమ, దయ మాత్రమే ఉంటాయి. సాధకునికి ప్రేమ, సేవ, ఆత్మార్పణ ఉంటుంది.

ఈ సందర్భంగా వల్లభాచార్యులు ఒక సామాన్యమైన ఉదాహరణను ఇచ్చి మనకు విషయాన్ని స్పష్టం చేస్తున్నాడు. ఈ భార్యాభర్తల ఉదాహరణ తన అనుభాష్యంలో అందంగా చెప్పడం జరిగింది.

ప్రభువు ఆత్మలకు యజమాని అయినప్పటికి కొందరిని మాత్రమే తన సొంతవారిని ఎన్నుకుంటాడు. వారికి వివాహితుడైన భర్తగా అవుతాడు. ఈ విధంగా అతడు భక్తులను భరిస్తాడు. భక్తులు భగవంతున్ని భరిస్తారు.

భార్యాభర్తల మాదిరి భగవంతునికి, భక్తునికి ఉన్న సంబంధం మధురమైంది. సన్నిహితమైంది, సామీప్యమైంది. పరస్పర ఆధారితమైంది. తరిగిపోనిది. శాశ్వతమైందని వల్లభాచార్యులు చెప్పాడు. భక్తునికి, భగవంతునికి రెండు రకాలైన సంబంధముంటుందనే ముఖ్యమైన విషయాన్ని నొక్కి చెప్పాడు. భక్తునికి భగవంతుని అవసరం, భగవంతునికి భక్తుని అవసరముంటుంది. ఒకరు లేకుండా మరొకరు మనగలగ లేరు.

## నాలుగు రకాల పుష్టి భక్తి

పుష్టి భక్తి నాలుగు రకాలు

1. ప్రవాహ పుష్టిభక్తి
2. మర్యాద పుష్టిభక్తి
3. పుష్టి పుష్టిభక్తి
4. శుద్ధ పుష్టిభక్తి

1. సంసార ప్రవాహంలో మునిగినప్పటికి దైవత్వాన్ని సాధించేందుకు కష్టపడే భక్తుడు అవలంబించే మార్గమే ప్రవాహ పుష్టి భక్తి మార్గము. ఈ మార్గము సంసారికి చక్కగా సరిపోతుంది. ఇతడు కర్మమార్గాన్ని అనుసరిస్తాడు. అయితే ఇతడు కామ్యకర్మలు కాకుండా నిష్కామకర్మలు చేస్తాడు. ఇతనిలో ప్రవాహపుష్టి భక్తి నెలకొని ఉంటుంది.

2. ప్రాపంచిక వస్తువులపై మమకారాన్ని వదలిపెట్టి భగవంతుని పవిత్రనామాలను వినే భక్తునికి మర్యాదభక్తి మార్గం సరిపోతుంది. శాస్త్రాదేశాలను పాటించటం ద్వారా అతనిలో వైరాగ్యం ఉత్పన్నమవుతుంది. ఇటువంటి భక్తిని మర్యాద భక్తి అంటారు.

3. భగవంతుని దయవల్ల జ్ఞానార్జన పొంది భగవంతున్ని సేవించే భక్తునికి పుష్టిపుష్టి భక్తిమార్గం సరిపోతుంది.

4. భక్తి మార్గాలలో అతిశ్రేష్ఠమైనది శుద్ధ పుష్టిభక్తి. ఇది మధురమైన ప్రేమభక్తి. భగవంతుని దయవల్ల ఇది సాధ్యమవుతుంది. భగవంతున్ని ప్రేమిస్తూ, సేవిస్తూ అతన్ని స్తుతించే భక్తుల భక్తిని శుద్ధపుష్టి భక్తి అంటారు. దీన్నే ప్రేమభక్తి అని కూడా అంటారు. ఈ ప్రేమభక్తి మూడు భాగాలు. ఒకటి ప్రేమ, రెండవది ఆసక్తి, మూడవది వ్యాపన. ప్రేమ అంటే శ్రీకృష్ణునిపై ప్రేమ. శ్రీకృష్ణున్ని తప్ప ఇతరులెవరిని పరిగణించనివారు. ఆసక్తి అంటే శ్రీకృష్ణుడు తప్ప అన్నిటిపై ద్వేషముండేభావాన్ని ఆసక్తి అంటారు. వ్యాపన అంటే శ్రీకృష్ణునిపై గాఢమైన ప్రేమకలిగి ఉండడం. ఇతరులెవ్వరిని ప్రేమించకపోవటం. ఇటువంటి శుద్ధభక్తి భావమే సర్వాత్మభావం. జీవజగత్తంతటా భగవంతున్నే చూడటం శుద్ధపుష్టిమాన్ భక్తుని విధి భగవంతున్ని సేవించడమే.

ఈ సేవ రెండు రకాలు.

**1.** మనసులో భగవంతున్ని తలుస్తూ సేవించడం - దీన్ని మానసిక సేవ అంటారు.

**2.** ఎల్లప్పుడు భగవంతున్ని సేవించడం – దీన్ని దైహిక సేవఅంటారు. వల్లభాచార్యులు రాగమార్గం, లేకరాసమార్గం, ప్రేమమార్గం లేదా అమృతమార్గమే మంచి మార్గమని నుడివారు.

## జ్ఞానం కంటె భక్తి గొప్పది

ముక్తికి భక్తి జ్ఞానాలను సాధనాలుగా వల్లభాచార్యులు గైకొన్నాడన్నది తథ్యం. కాని భక్తి జ్ఞానాలు ఒకే ఫలితాన్ని ఇస్తాయని చెప్పలేం. జ్ఞానం కంటె భక్తి కోరతగ్గది. పైన పేర్కొన్నట్లు జ్ఞానవంతుడు అక్షర రూపాన్ని మాత్రమే గ్రహించగలడు. నిర్గుణ వంతుడని తెలుసుకోగలడు. కాని భక్తుడు భగవంతుని మధురమైన అందమైన ప్రేమ స్వరూపాన్ని కోరుతాడు గాని మరిదేన్నీ కోరడు.

## రెండు రకాల ముక్తి

జ్ఞాని, భక్తుడు ఇరువురు ముక్తిని సంపాదించేవారే. కాని మార్గాలు వేరు. జ్ఞానవంతుడు జ్ఞాన మార్గమైన మర్యాద భక్తిని అవలంబించేవారు సాయజ్యముక్తిని సాధిస్తారు. వారు భగవంతునితో ఏకమవగలరు.

భక్తిమార్గాన్ని అవలంబించేపుష్టిభక్తులు సాలోక్యముక్తిని పొందుతారు. వారు పరమపురుషుడైన శ్రీకృష్ణలోకంలో వసిస్తారు. వివిధ మధుర ప్రేమపూర్వకమైన రాసలీలలో పాల్గొంటారు. గోపబాలురు, గోపికలు, గోవులు, జంతువులు, పక్షులు, చెట్లు, నదులు, ఆ అమృతానందాన్ని చవిచూస్తాయి. రాసలీల భూమిపైనున్న వ్రజబృందావనంలోని రాసలీలతో సమానం. ముక్తి మార్గంలో శ్రేష్ఠమైందిది. ముక్తి అంటే ఆత్మ భగవంతునితో ఏకమైనా శ్రీకృష్ణుడు ఆ రాసకేళిలో తనంతతానుగా పాల్గొంటాడు. అనగా భక్తులకు తనకు గల భేదాన్ని ప్రేమ పూర్వకంగా, ఆనందపరంగా సృజిస్తాడు. ప్రతిభక్తుడు నిత్యం దీన్ని కోరుకొనువాడే. అలా శ్రీకృష్ణున్ని భర్తగా సేవించటమే మానవజీవితాంతంలో అత్యున్నతమైంది.

ఇలా వల్లభాచార్యులవేదాంతంలో మధురభావం, శృంగార భావం మధురంగా, ప్రేమరంజకంగా ఆధిపత్యం వహిస్తాయి.

## వల్లభాచార్యుల సిద్ధాంత విలువ

తత్త్వశాస్త్రరిత్యా వల్లభాచార్యుల వేదాంత సిద్ధాంత విలువ, ప్రామాణికత ఏమైనా ఇది వేదాంత తత్త్వశాస్త్రచరిత్రలో ఒక గొప్ప ఘట్టమని చెప్పుకోవచ్చు. అభ్యుదయ ఆలోచనా రంగంలో వల్లభాచార్యుల తాజా ఆలోచన, దృక్పథం ఒక మైలురాయి అనటంలో సందేహం లేదు. ఇంత వరకు ప్రపంచం గాంచని అద్వైత వాద తత్త్వవేతల్లో ఒకరైన శంకరాచార్యులను సవాలు చేసిన వల్లభాచార్యులను అంతతేలికగా పక్కన పెట్టలేం. శంకరాచార్యుల అద్వైతవాదాన్ని ఖండిస్తూ "విశిష్టాద్వైత వాదాన్ని" స్థాపించిన రామానుజాచార్యులను కూడా వల్లభాచార్యులు వదలిపెట్టలేదు. శంకారాచార్యుల అద్వైత వాదాన్ని

గైకొన్న అద్వైతవాదవ్యతిరేక సముదాయంలో వల్లభాచార్యులు ఒకరు. పవిత్రమైన సరస్వతీమాతవొదిలో ధైర్యంగా పోరాడే ఈ యోధునిలో ధైర్యముంది, నేర్పు ఉంది, యుక్తి ఉంది.

వల్లభాచార్యుల శుద్ధద్వైత వాదం భక్తి వాదం ఆధారంగా నెలకొల్పటం ఒక విశేషం. వాస్తవానికి శంకరాచార్యుల అద్వైత వాదం జ్ఞానవాదమైతే వల్లభాచార్యుల శుద్ధద్వైతవాదం భక్తివాదం. నిజంగా చెప్పాలంటే భక్తివాదాన్ని ద్వైతవాదమని, ద్వైతాద్వైత వాదమని అంటారు. దేవునికి జీవునికి భేదం లేకుంటే భక్తి, ఉపాసనలు సాధ్యంకావు. కాబట్టి వల్లభాచార్యులు అద్వైత వాదాన్ని భక్తివాదంతోనూ, భక్తివాదాన్ని అద్వైతవాదంతోను నిరూపించదానికి ప్రయత్నించాడు. నూతన తాత్త్వికవ్యవస్థను, నూతన మతవ్యవస్థను రూపొందించటానికి ముందడుగు వేశాడు.

## వల్లభుని తత్త్వం సంక్షిప్తంగా

నింబార్కుని మాదిరే వల్లభాచార్యులు కృష్ణ సంప్రదాయమతాన్ని స్థాపించాడు. గోపాలకృష్ణుడు అతని వ్యవస్తలో పరబ్రహ్మం. బ్రహ్మానికి, ప్రపంచానికి ఉన్న సంబంధం భేదాభేద సంబంధంకాదు. వాటి మధ్య ఉన్న సంబంధం శుద్ధద్వైత సంబంధం. శంకరాచార్యుల వారి కేవలాద్వైతం నుంచి తన ద్వైతాన్ని వేరుపరుస్తూ శుద్ధద్వైతమని పేరు పెట్టాడు. అతని దృష్టిలో శంకరాచార్యుల అద్వైతం ప్రపంచాన్ని వివరించటానికి మాయపై ఆధారపడింది కాబట్టి ఇది స్వచ్ఛమైందికాదు.

శుద్ధద్వైతానికి మూలగ్రంథం వల్లభాచార్యుల వారి 'అణుభాష్యం' ఇది వేదాంతసూత్రంపై చేసిన వ్యాఖ్యానగ్రంథం. అసంపూర్తిగా ఉన్న ఈ గ్రంథాన్ని వల్లభాచార్యుల కుమారులు విఠలానాథుడు పూర్తిచేశాడు. 'జైమినిసూత్ర, భాగవత' గ్రంథాలపై వల్లభాచార్యులు రాసిన వ్యాఖ్యానాలు కొన్ని భాగాలు మాత్రమే లభ్యమవుతున్నాయి. అతని ముఖ్యమైన మరొక గ్రంథం 'తత్త్వార్థ దీపనిబంధ' దీనికి తనే వ్యాఖ్యానం రాసుకొన్నాడు. దానిపేరు 'ప్రకాశ'.

ఈ మూడు వేదాంత ప్రస్థానాలకు వల్లభాచార్యులు భాగతవతాన్ని చేర్చాడు. ఈ నాలుగు గ్రంథాలను వేదాంతగ్రంథాలంటారు. (1) వేదము (ఉపనిషత్తులను కలుపుకొని), (2) గీత, (3) వేదాంతసూత్ర, (4) భాగవతం. వల్లభాచార్యుల దృష్ట్యా ఈ నాలుగుగ్రంథాలు ఒకదాని కొకటి దోహదం చేసుకునేవి. సంశయాలు ఉత్పన్నమయినప్పుడు ఒక గ్రంథం మరొక గ్రంథానికి దోహదపడుతుంది. వల్లభాచార్యులవారి వ్యవస్థలో భాగవతం ఒక విశిష్టమైన స్థానాన్ని ఆక్రమిస్తుంది. వల్లభాచార్యులు అన్ని గ్రంథాలను అంగీకరిస్తాడు. వైరుధ్య ప్రవచనాలను కూడా సత్యమని ఒప్పుకోవటం విశేషం.

వల్లభాచార్యుల వేదాంతంలో ఉన్నతమైన, పద్యవస్తువు కృష్ణుడు. ఉపనిషత్తులలో బ్రహ్మన్ అన్నారు. భాగవతంలో 'పరమాత్మ' అన్నారు. అతడు పురుషోత్తముడు. అతడు సచ్చిదానంద స్వరూపుడు. అతనిలో సద్గుణాతో ఉంటాయి. శాశ్వతమైనదైనా, మార్పుచెందనిదైనా మాయాశక్తిచే అన్ని రూపాలుగా మారుతుంటుంది. అతడు సృష్టించిన ప్రపంచానికి భిన్నంగాలేదు. అతని నుంచి వెలువడిన జీవులకు భిన్నంగా లేదు.

పరబ్రహ్మ అంతర్యామిగానూ, అక్షరబ్రహ్మగానూ గోచరిస్తాడని వల్లభాచార్యులు బోధించాడు. జీవులలో పరబ్రహ్మ అంతర్యామిగా వసిస్తాడు. ఆనందం పరిమితంగా ఉంటుంది. అక్షరపరబ్రహ్మలో కూడా ఆనంతత్త్వం పరిమితాగానే ఉంటుంది. ఈ అక్షరం/ఓంకారం పైననే జ్ఞానులు అదే తమ లక్ష్యమని ధ్యానిస్తూ ఉంటారు. వ్యతిరేక గ్రంథాలు 'అక్షర'మునకు మాత్రమే వర్తిస్తాయి. భక్తులు ఆ 'అక్షరాన్నే కృష్ణుని పాదమని, నిలయమని పరిగణిస్తారు. అక్షరమే భగవంతుని కరణం, పరమధామం, వ్యోమానం. ఇది ప్రకృతి పురుషులుగా గోచరిస్తుంది. ప్రతిదానికి కారణమవుతుంది. దీన్ని ముఖ్యజీవమని, జీవులకు ఉన్నతమైందని అంటారు.

ప్రప్రథమంగా భగవంతుడు ఒంటరిగా ఉండేవాడు. అనేకం కావాలను కున్నాడు. తత్ఫలితంగా తన లీలావినోదం కోసం ఈ ప్రపంచాన్ని సృష్టించాడు. అందువల్ల ఈ ప్రపంచం భగవంతుని స్వరూప పరిణామమయింది. ఈ పరిణామంలో భగవంతునికి ఏ మాత్రం హాని జరగలేదు. ఏ మార్పు

వల్ల అతడు బాధ పడలేదు. అనగా అవికృతపరిణామం వల్ల ఏ బాధపడలేదు. బ్రహ్మస్వరూపమైన ఈ ప్రపంచంలో సత్ పదార్థం వ్యక్తీకరణమైంది. ఇతర అంశాలైన చిత్ ఆనందం మరుగునపడ్డాయి. జగత్తు అవాస్తవం కాదు. భ్రమకాదు. వాస్తవంగా బ్రహ్మన్‌కు అభిన్నమైనది. అవాస్తవమైంది సంసారం. దీనిలో జీవలక్షణాలైన 'అహంకార మమకారాలు'ంటాయి. దీన్ని జ్ఞానంచే నిర్మూలించుకోవాలి. అంతేగాని ప్రపంచాన్ని కాదు.

జీవుడు పరబ్రహ్మ అంశమే. శాశ్వతుడు కూడా. ఈ ప్రపంచసృష్టి ఆరంభంలో జీవులు అక్షరం నుంచి ఉత్పన్నమయ్యాయి. నిప్పు నుంచి రవ్వలు ఉత్పన్నమయినట్లు జీవులు అక్షరం నుంచి ఉత్పన్నమయ్యాయి. అవి తెలుసుకునేవి, పనిచేసేవి, అనుభవించేవి. అవి అణురూపాలు. తమ మేధోసంపత్తిచే శరీరమంతా వ్యాపించి ఉన్నాయి. వాటిలో సత్ చిత్ వ్యక్తీకరణమయ్యాయి. ఆనందాంశం నిగూఢంగా ఉంది. మూడురకాలైన జీవులు మనకు తటస్థ పడుతుంటాయి. సంసార సాగరంలో ఈదులాడేవారు. వేదమార్గాన్ని అనుసరించేవారు(మర్యాద). భగవంతుని దయను పొంది స్వచ్ఛమైన ప్రేమతో భగవంతున్ని కొలిచేవారు(పుష్టి).

వేదమార్గాన్ని మర్యాద మార్గమని కూడా అంటారు. పుష్టిమార్గం, మర్యాదమార్గం మధ్యవున్న భేదం చాలా ముఖ్యమైంది. మర్యాద మార్గం ద్వారా వచ్చే ముక్తిక్రమమైంది. అడుగడుగు వేస్తూ ముందుకు సాగిపోవాలి. దేవమార్గం (దేవయాన)గుండా బ్రహ్మలోకం చేరి ముక్తిని పొందాలి. పుష్టిమార్గము పూర్తిగా భగవంతుని దయపై ఆధారపడివుంటుంది. కాబట్టి ముక్తి తక్షణమే వస్తుంది. ఈ మార్గాన్ని ఎంచుకున్న వారు బృందావనంలోని గోపికలు. ముక్తిలో అత్యున్నత దశ భగవంతుని చేరి అతని లీలావినోదాన్ని ఎల్లవేళలా అనుభవించటం. కృష్ణుడు జీవులందరికీ భర్త. గోకులంలో జీవులను రాసలీలకు రమ్మనటం ఈ లీలావినోదం కోసమే. సాయుజ్యం కంటే ప్రేమ ద్వారా భగవంతునితో వినోదించటమే ఒక అదృష్టం.

# 4

# యోగి వేమన (అచల పరిపూర్ణం)

కుమరగిరి వేమారెడ్డిని వేమన అని పిలిచేవారు. అతడు తెలుగు కవి, తత్త్వవేత్త. అతని పద్యాలు జనాదరణ పొందిన తెలుగు భాషలో రాయడం జరిగింది. సరళమైన భాషకు, దేశీయ జాతీయాలకు పేరుగాంచినవి. యోగ, వివేకం, నీతిని గురించి చర్చించాయి. యోగ మార్గంలో విజయం సాధించినందుకు గుర్తింపుగా అందరూ అతణ్ణి యోగి వేమన అని పిలిచేవారు.

## జీవిత సంగ్రహం

వేమన ఏ కాలంలో వసించినదీ పండితులలో ఏకాభిప్రాయం లేదు. అతని పద్యాల ఆధారంగా అతడు 1652 సంవత్సరంలో జన్మించాడని వేమనపై పరిశోధనగావించిన సి.పి. బ్రౌన్ అంచనావేశారు. అతడు పద్నైదు, పదహారు, పదిహేడు శతాబ్దాలలో జన్మించాడని వివిధ మూలాలు చెపుతున్నాయి.

ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లోని అప్పటి కొండవీటిరాజైన గడ్డం వేమగారి మూడవ కుమారుడు వేమన. అందరికంటే చిన్నవాడు. అతని తండ్రి పేరుతో వేమారెడ్డి అని పిలువబడేవాడు. తండ్రి తర్వాత వేమారెడ్డి అని పేరు వచ్చింది.

## బోధనలు

కొండవీటిలోని లంబికాశివయోగితో పరిచయం ఏర్పడింది. వేమనకు యోగమార్గంలో దీక్షనిచ్చాడు. ఆ తరువాత వేమన రాష్ట్రమంతాతిరిగాడు. కవిత్వం చెప్పాడు. యోగంలో విజయం సాధించాడు.

## కవిత్వం, కీర్తి

దేశీయభాష అయిన తెలుగులో ఎన్నో పద్యాలను వేమన అల్లాడు. అతని పద్యాలు నాలుగు పాదాలతో ఉంటాయి. నాలుగవ పాదంలో 'విశ్వదాభిరామ వినురవేమ' అనే మకుటం ఉంటుంది. మూడు పాదాలలో సరళమైన భాషలో సందేశాన్ని అందిస్తాడు. దక్షిణ భారత దేశమంతా విస్తృతంగా తిరిగాడు. ఒక కవిగా, యోగిగా జనాదరణను సంపాదించాడు. వేమన వాడిన సరళమైన భాషకు, మంచి సందేశాన్ని అందించినందుకు వేమన పద్యాలను ప్రజలు స్వీకరించారు. అత్యున్నతమైన గౌరవాన్ని ఇచ్చారు. వేమన మాట వేదమాట అనే తెలుగు నానుడి వచ్చింది. అంతరార్థంతో కూడుకున్న అతని చాటు పద్యశైలి వల్ల అతన్ని శ్లాఘించారు.

వేమన పద్యాలను సి.పి. బ్రౌన్ బ్రిటిషు ప్రభుత్వకాలంలో ఆంగ్లంలోకి అనువదించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఉన్నత పాఠశాలల్లో అతని పద్యాలను పాఠ్యాంశాలుగా చేర్చుతూ ఉంటారు. అతని గౌరవార్థం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2006లో కడపలో యోగివేమన విశ్వవిద్యాలయమని విశ్వవిద్యాలయానికి పేరు పెట్టారు. కడప ప్రాంతంలోని గండికోటలో కొంత కాలం వేమన వసించాడని ప్రజల విశ్వాసం.

## అంతిమదశ

ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా, కదిరి తాలూకాలోని కటారు పల్లెలో యోగివేమన సమాధిని చూపుతూ తలరాయి ఉంది. ఇచట వేమన చనిపోయాడని అందరి నమ్మకం. యోగి కాబట్టి అతన్ని పాతిపెట్టారు.

## కవితా శైలి

వేమన పద్యాలలోని చాలా పాదాలు తెలుగు భాషలోని గ్రామీణ పదాలే. పాదాలన్ని "విశ్వదాభిరామ వినురవేమ" అనే మకుటపాదంతో అంతమవుతాయి. ఈ మకుట పాదం యొక్క అర్థం "ఓ ప్రియవిశ్వదా వేమన చెప్పేమాటవిను". ఈ చివరి మకుటపాదానికి వివిధ అర్థాలు వ్యాఖ్యానాలున్నాయి.

పందొమ్మిదవ శతాబ్దంలో సి.పి. బ్రౌన్ వేమన పద్యాలను సేకరించి ప్రచురించారు. అతని పద్యాలు సామాజిక, నైతిక, అధిక్షేప, మార్మిక తత్త్వాన్ని ఇనుమడింపజేస్తున్నాయి. పద్యాలన్ని ఆటవెలది చందస్సులో చెప్పడం రాయడం జరిగింది.

## వేమన సిద్ధాంతం

వేమన యోగిని అచల పరిపూర్ణ రాజయోగ సిద్ధాంతిగా నిరూపించాలంటే దిగువ పేర్కొన్న పద్యాలవల్లనే సాధ్యమవుతుంది.

వేమన తత్త్వనిర్ణయం తెలియాలంటే వేమన పద్యాలే వెన్నెముక అని చెప్పుకోవాలి.

**ఆ॥ ఉత్తమోత్తముండు తత్వజ్ఞుడిల మీద**
**మహిమ జూపు వాడు మధ్యముండు**
**వేషధారి యుదర పోషకుదధముండు**
**విశ్వదాభి రామ వినురవేమ**

తత్వ నిర్ణయం తెలిసిన వాడే ఉత్తమోత్తముడని వేమన నిర్ణయం. అయితే వేమన ఏ మతానికి చెందినవాడు? అంటే కొందరు 'అద్వైతి' యని, మరికొందరు 'శివాద్వైతి' అని, ఇంకొందరు 'నాస్తీకుడని' తమ తమ ఇష్టానుసారం వేమనను త్రిప్పుకున్నారు. నిజానికి 'వేమన' మతాలకు అతీతమైన వాడు. మతవాదులకు చిక్కేవాడు కాడు. అతడు మతాలకు అందని భావాన్ని బోధించాడు.

**ఆ॥ మర్మమెరుగ లేక మతముల కల్పించి**
**ఉర్వి జనులు దుఃఖ మొందు చంద్రు**
**గాజుటింట కుక్క కళవళ పడ్డట్లు ॥ విశ్వ ॥**

**ఆ॥ చదువు చదువనేల సన్యాసి కానేల**
**షణ్మతముల జిక్కి చావనేల**
**అతని భజన జేసి ఆత్మలో తెలియుడీ ॥ విశ్వ ॥**

పరిపూర్ణ సత్యాన్ని (మర్మము)ను తెలుసుకొనకపోవడం వల్ల, వివిధ మతాలు పుట్టాయి. ఆ మతాలను ఆశ్రయించిన వారికి దుఃఖం తప్పదు. ఈ మతాలన్నీ ఎలా ఉన్నాయి? అంటే, గాజుగదిలోకి (Mirrors home) కుక్క వెళ్ళి చూస్తే, దానికి ఎదురుగా ఎటూ చూసినా అనేక కుక్కలు కనబడి, అవి అన్నీ, తన రూపాలేనని తెలుసుకోలేక గాబరా పడ్డట్టుంది. అట్లాగే, ఒకటి ద్వైతమని, ఇంకొకటి అద్వైతమని ఇలా అనేక దరనాలు ఏర్పడ్డాయి, సత్యం ఒక్కటే అయినప్పటికినీ. కనుక, సన్యాసి అయినా, షణ్మతాలను శోధించినా, చావే గతి కాని, అమృతత్వం పొందే నిర్ణయం లేదు. అందువల్ల ఆత్మ తత్వాన్ని పొంది, అక్కడే తెలుసుకోవలసిన విషయం ఉందని వేమన నిర్ణయం.

**ఆ॥ వెర్రి నక్కల వలె వేదముల్ చదివెద**
**రాశయంబు లెరుగరయ్య వారు**
**వేద సారమంత వేమన యెరుగును ॥విశ్వ॥**

వేదాల ప్రధాన లక్ష్యాన్ని తెలుసుకోకపోవడం వల్లే, క్రమేణా వేదమతం క్షీణించి అనేక మతాలు ఏర్పడ్డాయి. కనుక సారం తెలియని పఠనం వృధా అన్నీ, వేదాల సారమంతా తనకు తెలుసునని వేమన తెలియజేశాడు. అయితే వేమన స్వయంగా ఈ సారాన్ని తెలుసుకున్నాడా? లేదు. వేమన తన గురువు ద్వారా సర్వశాస్త్రాల సారాన్ని గ్రోలినట్టున్నాడు. అందువల్లనే అంత నిర్భయంగా నొక్కి చెప్పుతున్నాడు.

**ఆ॥ లోములకు గురువు లోకులకును గురు**
**వదియు తెలిసి మోక్ష మందు రోరి**
**గురునిగ నక నరక కూపము నుందురు ॥విశ్వ॥**

కనుక వేమనకు గురువు తప్పని సరిగా ఉండిఉన్నాడు. అతడే లంభికాశివయోగి. ఈ లంభికాశివయోగి అచల సిద్ధాంత సాంప్రదాయకుడే. అతని నుంచే వేమన పరిపూర్ణ రాజయోగమును గ్రహించినట్లున్నాడు.

ఆ॥ రాజయోగి మహిమ రాజయోగి కాక
ఇతర జనుల కెల్ల నేమి తెలియు
తాను దైవుడైన దైవము గొలుచునా ॥ విశ్వ ॥

ఈ విధానంలో అందరూ దైవ స్వరూపులే.

వీరి సంప్రదాయం నందు గురువే దైవం, గురువునకే పూజ ఉంటుంది. కాని ఇతర దేవతల ప్రసక్తి ఉండదు.

ఆ॥ వేమననగ యోగి వెలసె లోకములోన
పూజ లిడుడు పుణ్య పురుషులార
పూజ లిడిన యంత భుక్తి ముక్తుల నిచ్చు ॥ విశ్వ ॥

అచల పరిపూర్ణ రాజయోగ సిద్ధాంతం సంక్షిప్తంగా ఏమిటంటే? మూడు మాటల్లో 1. ఉన్నది పరిపూర్ణం 2. లేనిది ఎరుక 3. ఎరుకను విడవడం.

ఈ పరిపూర్ణాన్నే బయలనీ, అచలమనీ, గురు రహస్యమనీ, బట్టబయలనీ, పరిపూర్ణ బ్రహ్మమనీ, పరమనీ, పరమపురుషుడనీ, ఆయా సందర్భాలలో పేర్కొన్నారు. (బయలుకే పద్యాలలో మూడు అర్థాలు ఉన్నాయి. 1. ఆకాశం. 2. ఆత్మ, 3. అచలం) 'ఎరుక' అంటే ఏమిటి? ఈ సృష్టి కంతటికి మూలమైన పదార్థమోదో, అదే ఎరుక.

వేమన పరిపూర్ణ బ్రహ్మమును ఈ కింది విధంగా తెలియజేశాడు.

కం॥ నాదము బ్రహ్మాంబనుచును
వేదములను చదువవచ్చు వినికని నంతన్
నాదంబు లేని బయలున
నాదంతము పూర్ణపదవి నయముగ వేమా ॥

కం॥ చెప్పియు చూపగరానిది
మెప్పుగ మదిలోన జూచి మెలకువతోడన్
త్రిప్పలను బడక చూచిన
నొప్పుగ జగమెల్ల నిండి యుండును వేమా ॥

కం॥ కాయము విడచెదు వేళను
న్యాయంబుగ బుద్ధినొక్కి నమ్రత తోడన్
జ్ఞేయంబగు పరిపూర్ణము
ఛాయను గని పరిణమించు జయ్యన వేమా ॥

ఆ॥ అచట నిచట జూడ నమరదు గురుభక్తి
ప్రచురముగను నాత్మ బయలజేసి
రుచిరముగను జూడ నచలమై దోచురా ॥ విశ్వ ॥

ఆ॥ పరము పరమటంచు పలుకుదురందరు
పరము నందు నేమి ప్రబలమయ్యె
పరము డిందునందు పరిపూర్ణుడే కదా ॥ విశ్వ ॥

కం॥ నిరతంబెద తెగకుండిన
పరిపూర్ణ బ్రహ్మమాత్మ పదమున నుండన్
నిరవద్యమయిన అడవిని
జరి యించును జగమెరుంగ సత్యము వేమా ॥

కనుక పరిపూర్ణ బ్రహ్మం లేదా అచలం ఎలాంటిది అంటే, అది సర్వత్ర నిండి నిభిఢీకృతమై ఉన్నది. దాన్ని ఎవరు కూడా చెప్పి, చూపలేరు. దానిలో నాదం లేదు. ఆ పరం అంతట పరిపూర్ణమై ఉంది. దానిలో ఏదీ పుట్టలేదు. అది తప్ప ఏమీ లేదు. దాన్ని చూసి లేకుండా పోవడమే ముక్తి. అదే సర్వభ్రాంతి రహితం.

ఇక మతాల వారు నిర్ణయించిన బ్రహ్మమే అచల సిద్ధాంతులు నిర్ణయించిన 'ఎరుక' యొక్క నిజస్వరూపం. ఇదే వేమన మాటల్లో -

ఆ॥ **శైవ వైష్ణవాది షణ్మతంబుల కెల్ల**
**దేవుడొక్కడనుచు తెలియలేరు**
**తమకు భేదమైన తత్వంబు భేదమా** ॥ విశ్వ ॥

కం॥ మాయా విద్యల జూడకె
మాయల కిరవైన ఎరుక మర్మము గనకే
మాయా విద్యల జాలము
ఛాయలె జీవేశ్వరునకు జాతము వేమా

ఆ॥ ఎరుక యుండువాని కెరుకయే యుండును
ఎరుక లేని వాని కెరుక లేదు
ఎరుక లేని ఎరుక నెరుగుట తత్వంబు ॥విశ్వ॥

ఆ॥ బ్రహ్మమనగా వేరె పరదేశమున లేదు
బ్రహ్మమనగ దానె బట్టబయలు
తన్నుదానెరిగిన తానెపో బ్రహ్మంబు ॥విశ్వ॥

ఆ॥ తన్ను వెదకి చూడ తానెపో జీవుండు
తత్వ మరసి చూడ తానె యాత్మ
మన్ను మిన్ను లేదు మాయము లేదయా ॥విశ్వ॥

ఆ॥ ఆత్మదేహమందు నతి సూక్ష్మముగ జూచి
దేహమాత్మ యందు తేట పరచి
ఆత్మనెందు జూడ నతడెపో బ్రహ్మంబు ॥విశ్వ॥

కం॥ తలచినను శూన్యతత్వము
తలపక యుండినను శూన్యతత్వం బదియౌ
తలచిన తలపీదేరును
తలచక యుండినను తానె తత్వము వేమా ॥

ఆ॥ వ్రతములెన్నియైన వట్టి చిక్కులె కాని
ఆత్మ చిక్కు గాన నలవి గాదు
ఆత్మ చిక్కు బాపునతడెపో ఘనయోగి ॥ విశ్వ॥

ఆ॥ కాశి యాత్ర జేసి గాసి జెందగ నేల
రోసి గుణవికార రూపడంచి
మోసపోక ఎరుక మూలంబు గనువాడు
గాసి జెందబోడు ఘనుడు వేమా ॥

పరిపూర్ణ బ్రహ్మం తప్ప మిగిలిన సర్వమూ ఎరుకే. ఎరుకే మాయా స్వరూపమైనది. ఇది సర్వ మాయలకు పుట్టినిల్లు. జీవేశ్వరులు, ఆత్మానాత్మలు, ప్రకృతి పురుషులు, జడ చేతనములు, సాకార విరాకారాలు, దేహీదేహములు, సదసత్తులు, విద్యావిద్యలు, ప్రకాశాప్రకాశాలు, జ్ఞానాజ్ఞానాలు, దృక్దృశ్యాలు, క్షరాక్షరాలు మొదలైన సర్వద్వంద్వములూ ఎరుకే. ఇదే ఏక వస్తువుగా, అనేక వస్తువులుగా, సర్వస్వరూపంగా ఉన్నది. బీజమునందు వృక్షమంతా దాగి ఉన్నట్లుగా, ఆత్మయందే సర్వం బీజ స్వరూపంగా ఉంది. ఇదే అహం పదార్థం. తత్, త్వం పదార్థాలు ఇదే. ఇదే అసి పదార్థం. అన్నీ ఇదే. ఇదే లేకుంటే పరిపూర్ణ బ్రహ్మము తప్ప ఇంకేమీ లేదు. అన్నిటికీ మూలం ఎరుకే కాని, ఎరుకకు మూలం లేదు. పరిపూర్ణ బ్రహ్మంలో దీనికి స్థానమూ లేదు. కనుక, తత్వనిర్ణయంలో ఎరుక శూన్యం కాగలదు. ఉన్నది ఒక్కటే, అదే పరిపూర్ణ బ్రహ్మం. కనుక ఎరుక మూలంను తెలుసుకున్న వాళ్ళే సర్వ భ్రాంతి రాహిత్యం కాగలదు.

ఇక, లేని ఎరుకకు ఎరిగి, ఎరుక లేదా ఉండటం ఎలా? వేమన మాటల్లో -

ఆ॥ రాకపోక లణచు రాజమార్గము పూని
నాకమనెడు గురుతు వీక నెరిగి
సోకి మించ బయలు సూత్రంబు గాడొకో ॥ విశ్వ ॥

ఆ॥ ఎచట జూడ్కి నిలిపి యెందాక చూచిన
నచట దోచు కళల నందరాదు
అచట వ్యక్తి యరగి యందుట మోక్షంబు ॥ విశ్వ ॥

ఆ॥ రాజయోగమూని తేజమందుట ముక్తి
తేజ మందుకున్న దేబెలరయ
మర్మరహిత గురుని మరి చేర వలెనయా ॥విశ్వ॥

కం॥ భావాభావములంటక
సేవించెడు బట్టబయలు స్థిరమతి లోనన్
కేవల శివపర ధ్యానము
తావరమును గన్నవాడె ధన్యుడువేమా ॥

కం॥ వంచన చేసెడి ఎరుకను
మించిన పరతత్వ మమరు మేలిమిగానా
శించును గన్గొని యుండిన
సంచారము లేని బయలు సతమగువేమా ॥

ఆ॥ మనసు హక్కు కర్మ మరియేమి లేకయే
రాకపోక లేని రాజవీధి
పరగ హాని గలదె పరతత్వయోగికి ॥ విశ్వ ॥

ఎవరైతే అచల ఋషి అయిన రాజయోగిని చేరి సర్వనామరూపక్రియనటనలకు కారణమైన ఎరుక యొక్క మూలం ఎరిగి, పరిపూర్ణ బ్రహ్మమును దర్శిస్తారో, వారికి రాకపోకలు ఉండవు. అనగా జననమరణాలుండవు. ఎరుకకు అతీతమైనదేబయలు. ఈ పరతత్వాన్ని తెలుసుకొన్న రాజయోగి అహంకారాన్ని వదలి, అంటే కర్తృత్వ రహిత కర్మాచరణ ఉండి, కర్మలను ఆచరిస్తాడు. కనుక అతనికి ఎటువంటి హాని ఉండదు. అంటే జననమరణ బాధలు ఉండవు.

ఆ॥ పడచు పక్వమెన్న పసివాడెరుంగునా
ఎరుక దివ్యయోగి యెరుగుగాక
యోహగుణమెరింగి యోహంబు విడనాడు ॥విశ్వ॥

ఈ విధంగా రాకపోకలను అణచివేసే మార్గమే, రాజమార్గం. ఉన్నదున్నట్లుగా, ఈ రాజమార్గం తెలుసుకున్న వారే రాజయోగి, వేమన

మొదట అన్ని రకాల యోగాలు చేసి, చివరకు రాజయోగి అయ్యాడు. దీనికి ఏ సాధనా అవసరం లేదు. తత్వవివేచన తప్ప. ఇది మానసిక సాధన. శ్రీ శివరామదీక్షితుల కంటే ముందుగా వేమన యోగి ఈ సిద్ధాంతాన్ని తెలియజేశారు. శ్రీ శివరామదీక్షితులు రాసిన గ్రంథం బృహద్వాశిష్ఠంలో కూడా వేమన ఉపయోగించిన బయలు, ఎరుక, పరిపూర్ణము మొదలైన పదజాలం ఉపయోగిస్తూ ఈ పరిపూర్ణాచల రాజయోగ సిద్ధాంతాన్ని సిద్ధాంతీకరించారు. దీన్ని మతమనకూడదు. ఇది మతాతీతమైన సిద్ధాంతం. దీని మూలబీజాలు వేదాలలోనూ, ఉపనిషత్తులలోనూ, భగవద్గీతలోనూ ఉన్నవే. అయితే వేమనకు పూర్వమే ఈ సిద్ధాంతం గురు పరంపర సాంప్రదాయకంగా వస్తూ ఉంది.

ఈ సిద్ధాంతానికి, వేమన పద్యాలకు సమన్వయం కుదురుతుంది. అట్లాగాక, వేమనను, మిగతా ఏ తత్వవేత్తగానైనా తీసుకుంటే వేమన పద్యాలకు, ఆ తత్వానికి సమన్వయం కుదరడం లేదు. కనుక వేమన మతాలకు అందని సూక్ష్మమైన భావాన్ని బోధించాడు. తన పద్యాలలో ఆ భావమే, అచల పరిపూర్ణ రాజయోగం అని తెలుస్తుంది. కొందరు పొరపాటున దాన్ని 'అద్వైతమ'ను కొన్నారు. షణ్మతముల చిక్కి చావనేల అని కుండబద్దలు కొట్టినట్టుగా మతాల స్థితిని తెలియజేశాడు. కనుక, వేమన బోధించినది "శంకరాద్వైతం" ఎంతమాత్రం కాదు. వేమన యోగి ఆచరించినది రాజయోగమే. "రాజయోగమూని తేజమందుటముక్తి" అన్నాడు. ఈ మార్గము "అచలవ్యక్తి మరగి యందుట మోక్షంబు" అన్నాడు కనుక, ఇది అచల సిద్ధాంతులకు తెలిసి ఉన్నది. కనుక నిస్సందేహంగా వేమన 'అచల పరిపూర్ణ రాజయోగ సిద్ధాంతి" అని తెలుస్తుంది.

ఇంతవరకు మనం వేమన అచల పరిపూర్ణ రాజయోగ సిద్ధాంతాన్ని తెలుసుకున్నాం. ఇక వేమన రచనల్లో వెలిబుచ్చిన వివిధ దృక్పథాలను తెలుసుకోకపోతే ఈ అధ్యాయం అసంపూర్తిగానే మిగిలిపోతుంది.

## వేమన - వివిధ దృక్పదాలు

**లోభి** గురించి వేమన ఏమన్నాడో ఈ కింది పద్యంలో చూడవచ్చు.

**ఆ॥ కుక్క గోవుగాదు కుందేలు పులి గాదు**
**దోమ గజము గాదు దొడ్డదైన**
**లోభి దాతగాదు లోకంబు లోపల ॥ విశ్వ ॥**

ధనవంతులను ధర్మాత్ములుగా మార్చే శక్తి ఒక ఆధ్యాత్మిక సంపదకే ఉన్నదని చెప్పుకోవచ్చు. ఎందుకంటే బతుకు క్షణికం, సంపద అస్థిరం అని తద్వారా దాన ధర్మాలు చేసేత ముక్తి లభిస్తుందని చాటాడు వేమన.

**ఆ॥ ఏమి గొంచువచ్చె ఏమితాగొనిపోవు**
**పుట్టువేళ నరుడు గిట్టువేళ**
**ధనములెచటికేగు తానేగునెచటికి ॥ విశ్వ ॥**

దేవుడొక్కడే అన్నదానికి ఈ దిగువ ఇచ్చిన పద్యాన్ని చూస్తే మనకు అవగతమవుతుంది. ఇన్ని మతాలు ఎందుకూ దైవమొక్కటే అనడానికి మచ్చుగా ఈ పద్యం తెలియజేస్తున్నది.

**ఆ॥ పశులవన్నెవేరు పాలేకవర్ణమౌ**
**పుష్పజాతి వేరు పూజయొకటే**
**దర్శనములు వేరు దైవంబదొక్కటే ॥ విశ్వ ॥**

అంటాడు వేమన

సంఘసంస్కరణకు చిత్తశుద్ధి, సాహసం ఉంటేనే సాధ్యమవుతుందంటారు వేమన. ఈ విషయాన్ని కింది పద్యంలో చూడవచ్చు.

ఆ॥ చిత్త శుద్ధి గలిగి చేసిన పుణ్యంబు
కొంచమైననదియు కొదువగాదు
**విత్తనంబు మఱ్ఱి వృక్షంబునకు నెంత ॥ విశ్వ ॥**

వేమన నోట పలికిందల్లా బంగారమయ్యింది. ఆయన పద్యపాదాలన్నీ సామెతలై తెలుగు వారి నాల్కలపై నర్తించాయి. చురుక్కుమనె చమత్కారగుణం

సామెతల సొత్తు. నన్నయ "నానా రుచి రార్థ సూక్తి నిధి నన్నాదు" ఇది వేమన్న విషయంలో కూడా వర్తిస్తుంది. మచ్చుకు కొన్ని పద్యాలను చూద్దాం.

ఆ॥ అనువు గాని చోట అధికులమనరాదు
కొంచమైన నదియు కొదువ గాదు
కొండ అద్దమందు కొంచమై ఉండదా ॥విశ్వ॥

ఆ॥ చెప్పులోన రాయి చెవులోన జోరీగ
కంటిలోన నలుసు కాలిముళ్ళు
ఇంటిలోన పోర ఇంతింత గాదయా ॥ విశ్వ ॥

ఆ॥ ఆత్మ శుద్ధిలేని ఆచారమదియేల
భాండశుద్ధిలేని పాకమేల
చిత్తశుద్ధి లేని శివపూజలేలర ॥ విశ్వ ॥

పండితులు వేమనను నిరాదరించారు, పామరులతణ్ణి శిరసా వహించారు. "ఇవేమి పద్యాలయా హాయిగా ఒక కావ్యం రాసుకొనరాదా" అని ఎవరైనా మందలించారేమో వారికి సమాధానంగా వేమన ఇలా అన్నారు.

ఆ॥ నిక్కమైన మంచి నీలమొక్కటి చాలు
తళుకుబెళుకు రాళ్ళు తట్టదేల
చాటుపద్యమిలను చాలదా యొక్కటి ॥ విశ్వ ॥

అని చెబుతూ దీనికి అనుబంధంగా మరొక పద్యం -

ఆ॥ గంగి గోవు పాలుగరిటడైనను చాలు
కడివెడైననేమి ఖరము పాలు
భక్తి కలుగు కూడు పట్టెడైనను చాలు ॥ విశ్వ ॥

అని చెప్పి మరో ఊరికి సాగిపోయినట్టున్నాడు. దీన్ని బట్టి చూస్తే వేమన ఒక చోట నిలువక మఠం వంటిదేమి స్థాపించుకొనలేదని తెలుస్తుంది.

ఇతని నీతులు, విమర్శలు, లోకోక్తులు, అన్నీ సమాజ సుఖజీవనానికి ఎల్లకాలం పనికి వచ్చేవిగా ఉంటున్నాయి. ప్రొఫెసర్ వినయ్ కుమార్ సర్కార్

కబీరు, చైతన్యుల కంటే వేమనకు అధిక స్థానాన్ని ఇచ్చారు. ఒక ముస్లిం మేధావి మహమూద్ అలీ ఇతని వేదాంతం కబీరు, సూఫీ, తత్త్వంలో పోల్చి గౌరవించాడు.

విలియం హోవర్డ్ క్యాంబెల్ (1910) తెలుగు భాష బాగా నేర్చి " లోకకవులలో వేమన ఒక్కడే మహాకవి అని చాటాడు. "వేమన ఇంగ్లాండు విక్లిప్ అంతటి వాడు.అని అభిప్రాయ పడ్డాడు.

ఈనాడు కొద్దో, గొప్పో పద్యాలను గానీ, గద్యాలను కానీ, రాయగల వారందరిని కవి శబ్దంతో పిలుస్తున్నారు. అయితే వేమన యోగియా, కవియా అంటే రెండూ అని సమాధానం వస్తుంది. అదేలాగంటే సృష్టికి మూలకారణమైన పదార్థమేదో దాని స్థాన స్వరూప స్వభావాలను ఉన్నదున్నట్లుగా తెలుసుకున్న వారే ఋషులు, ఇంకా తెలుసుకొన్న విధానాన్ని ఆచరణలో పెట్టినవారే యోగులనబడతారు.

రెండు విషయాలలో వేమన పూర్ణసిద్ధిని సాధించాడు. కనుకనే త్రికాలజ్ఞుడు కాగలిగాడు. అందువల్లే అతని పద్యాలు విశ్వజనీన సత్యాలు (Universal Trupths కాగలిగాయి. అవి అన్ని కాలాలు, అన్ని దేశాలు, అన్ని పరిస్థితుల వారికి విజ్ఞానాన్ని అందించేవిగా ఉన్నాయి. అందుకే ఆ మహాకవి ఏ జాతి, వర్గ, కుల, మతాలకు సంబంధించిన వారు కాదు. అతను ప్రజాకవి.

**ఆ॥ అల్పుడెపుడు పల్కు ఆడంబరము గాను**
**సజ్జనుండు పల్కు చల్లగాను**
**కంచు మోగినట్లు కనకమ్ము మ్రోగునా** ॥విశ్వ॥

అని చల్లగా, మెల్లగా సజ్జనుడే తానై బంగారు రుచులతో కంచు ఘంటమై తెలుగువారందరి నోళ్లలో అనుసృతంగా మ్రోగుచున్నాడు వేమన.

# 5

# సర్వేపల్లి రాధాకృష్ణన్ (నవ్యవేదాంతం)

## జీవిత సంగ్రహం

సర్వేపల్లి రాధాకృష్ణన్ కుటుంబం తెలుగు కుటుంబమైనా తమిళ ప్రాంతంలో నివసించడం వల్ల, అక్కడి భాషా సంప్రదాయాలను అనుసరించడం వల్ల చాలా మందికి పేరును బట్టి వారు తమిళులనే భావం తడుతుంది. కాని వారు తెలుగు వారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ మద్రాస్ (చెన్నై) సమీపంలో ఉన్న తిరుత్తణిలో సెప్టెంబర్ 5, 1888న జన్మించారు. చిన్నతనంలో తిరుపతిలోని మిషన్ హైస్కూల్‌లోనూ, తరవాత నెల్లూరు, మద్రాస్ క్రిస్టియన్ కళాశాలల్లోనూ విద్యనభ్యసించారు. 1909లో ఎం.ఏ. (తత్వశాస్త్రం) పట్టా తీసుకున్నారు. ఈయన మద్రాస్ ప్రెసిడెన్సీ కళాశాలలోనూ, రాజమండ్రి ఆర్ట్స్ కళాశాలల్లో లెక్చరర్‌గా పని చేశారు. తరవాత మైసూర్ విశ్వవిద్యాలయంలో ఫిలాసఫీలో ఆచార్యులుగా ఎంపికయ్యరు. "Philosophy of Rabindranath Tagore" The Region of Religion in contemporary philosophy అనే గ్రంథాలను రాశారు. 1921లో కలకత్తాలో జార్జి వి.ప్రొఫెసర్‌గా నియామకం జరిగింది. భారతీయ దర్శనం రెండు సంపుటాలు, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ఇచ్చిన ఉపన్యాసాలను “The Hindu view of life” గా "East and West in Religion",

ఉన్నాయి. ఈ గాథలు, పురాణాలు పెక్కు శాశ్వత సత్యాలను పామరుల నుంచి పండితుల వరకు అర్థమయ్యే రీతిలో హృద్యంగమంగా మన ముందుంచుతాయి. ఈ మత గ్రంథాలు మనకందించే సందేశం సహేతుకమైంది. మనం ఏ మాత్రం అశ్రద్ధ చేయడానికి విస్మరించడానికి వీలు లేనిదంటారు.

నిత్యం కదలిపోయే కాలంలో తలెత్తే అవసరాలు, సమస్యలూ, కాలం మహిమలకతీతంగా కాలంలోనే అంతమాత్రంగా భాసించే సత్యాల మధ్య మౌలికంగా భేదాలు లేవు అన్న విషయాన్ని రాధాకృష్ణన్ వ్యాఖ్యానాలు స్పష్టపరుస్తాయి. ఆధ్యాత్మిక అనుభవమూ శాస్త్రీయమైనదే, హేతుబద్ధమైనదే. ఆధునిక శాస్త్ర విజ్ఞానం పైకి భిన్నంగా కనపడినా, మూలంలో మానవాళి ఆధ్యాత్మిక శాస్త్రీయ సంపదతో సంబంధం కలిగిందని డా॥ రాధాకృష్ణన్ అన్నారు. ఈ విశ్వాసంతోనే వారు మత గ్రంథాలను వాటిలోని ఆధ్యాత్మిక సంపదను తను అనువాద వ్యాఖ్యానాల రూపంలో ప్రపంచానికందించాయి. ఆయా గ్రంథాల్లోని సత్యాలు, సందేశాలు మన ఆధ్యాత్మిక జీవనానికి, లౌకిక సంపదకు, సౌఖ్యానికి ఎంతగానో దోహదం చేస్తాయంటారు డా॥ రాధాకృష్ణన్.

## తత్వశాస్త్రం

డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ తత్వశాస్త్రం అనే పదాన్ని చాలా విస్తృతమైన అర్థంలో వాడారు. తర్కం, నైతికశాస్త్రం, సామాజిక తత్వశాస్త్రం, అతి భౌతిక శాస్త్రం, తత్వశాస్త్రంలో అంతర్భాగాలే. అతి భౌతిక శాస్త్రం పదార్థాల అంతిమ స్వభావాన్ని గురించి చెబుతుంది. సత్తాశాస్త్రం జ్ఞాన మీమాంస శాస్త్రం దీనిలో అంతర్భాగాలు. శాస్త్ర విజ్ఞానం మన అనుభవం వివిధ పార్శ్వాలను అధ్యయనం చేస్తుంది. కానీ తత్వశాస్త్రం మన అనుభవాల అర్థాలను, ఔచిత్యాన్ని, ప్రయోజనాన్ని వివరణను సమగ్రంగా శోధిస్తుంది. ఇది నిరంతర పరిశోధన. తత్వ శాస్త్రానికి రెండు భాగాలున్నాయి. వివరణాత్మకం, వర్ణనాత్మకం దీనినే అనుభవాత్మకమని కూడా అంటారు. శాస్త్ర విజ్ఞానం వర్ణనాత్మకంగా ఉంటుందే గానీ "ఈ" వస్తు ప్రపంచమెందుకుంది? ఈ చరాచర జగత్తు, సృష్టి ఏమిటి?

అని ప్రశ్నలను సందేహాలను వెలిబుచ్చుతుంది. ఎంత సేపు ఉన్నదాన్ని వర్ణిస్తూ పోతుంది. శాస్త్ర విజ్ఞానం పదార్థాన్ని, ప్రాణాన్ని చైతన్యాన్ని విలువలను విడివిడిగా అధ్యయనం చేస్తుంది. కానీ తత్వశాస్త్రం ఈ విషయాలనన్నిటినీ సమగ్ర రూపంలో ఒకదానితో మరొకటి సృజనాత్మక సంబంధాలు కలిగి ఉన్న వానిగా విశ్లేషిస్తుంది, వివరిస్తుంది. తత్వశాస్త్రం అనుభవాన్ని స్థూల రూపంగానూ, దానిలోని క్రమాన్ని దాని సత్తాను వివరణాత్మకంగా అధ్యయనం చేస్తుంది. విశ్వాన్ని అర్థం చేసుకోవడానికి తత్వశాస్త్రం అవిరళకృషి చేస్తుంది. అనుభవం ఎన్నో స్పష్టమైన అంశాలను ఒకదానితోనొకదాన్ని సమన్వయపరుస్తూ ముందుకు సాగుతుంది తత్వశాస్త్రం. ఈ అధ్యయనంలో సంయమనమెరుగని జిజ్ఞాసతో కూడిన పరిశోధనా శాస్త్రజ్ఞానం నివేదికలు, అఖండ ప్రతిభావంతులైన కళాకారుల అంతర్బుద్ధి జ్ఞానం రూపాలుగా వెలుగొందే రుషుల, ప్రవక్తల అంతర్ దృష్టులు అంతర్భాగాలు, పొందగలిగిన ఏ తాత్విక సిద్ధాంతమైన, భావనా పరంపరైనా మనం గ్రహించగల విషయాలను సమాచారాన్ని పరిగణనలోకి తీసుకుంటూ, హేతుశక్తిని, అంతర్బుద్ధిని, అంతర్ దృష్టులను ఉపయోగించుకోవాలి. ఎందుకంటే మనిషి అంతరాత్మలో ఇవన్నీ అంతర్భాగాలే. రాధాకృష్ణన్ తత్వశాస్త్రాన్ని ముఖ్యంగా అనేక సృజనాత్మక అంతర్ దృష్టులు ప్రదర్శనగానే అంటారు గానీ, వ్యవస్థీకరింపబడే ప్రత్యయాత్మక పునర్నిర్మాణంగా భావించలేదు. ఎన్నో సందర్భాలలో వారు తత్వశాస్త్రమంటే ఎన్నో విషయాలను, సమస్యలను ఒకదాని నుంచి మరొక దానిని వేరు చేసి చర్చించడం కాదని స్పష్టం చేశారు.

## మతం, సృజనాత్మక అనుభవాలు

డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ మతం అనే దాన్ని యదార్థత స్వభావంలోకి అంతర్ దృష్టి లేదా యదార్థత అనుభవం అని నిర్వచించారు. ఈ అనుభవం యదార్థతకు సంబంధించిన వ్యక్తిత్వం సంపూర్ణ ప్రతిస్పందన. అన్నింటికీ కేంద్రంగా నిలిచిన యదార్థతకు వ్యక్తి సమగ్ర ఆత్మ ప్రతిస్పందన. మతమన్నది పరమసత్యం. వ్యక్తిలో తనను తాను వ్యక్తం చేసుకున్న రూపం. అది దేవునిలో

మన యదార్థ స్వభావానికి సంబంధించిన జ్ఞానం. అది వ్యక్తి ఏదైతే పరమ సత్యంగా భావిస్తాడో దానిపట్ల తన అంతరంగిక జీవితాన్ని వ్యవస్థీకరించుకునే విధానం. సత్యదర్శనానికి ప్రతి వ్యక్తి చేసే అకుంఠిత ప్రయత్నమే మతమని అంటారు.

ప్రతిమతం, మనిషి అతీత ప్రకృతి స్థాయిలో ప్రకృతి కంటే మించిన స్థాయిలో జీవిస్తాడని నమ్ముతుంది. మతానికి సంబంధించిన తత్వశాస్త్రం భావాంధకారంతో నిండిన దైవశాస్త్రం కంటే భిన్నమైంది. మత సంబంధమైన తత్వశాస్త్రం, మతపరమైన అనుభవాలు కలిగిన వ్యక్తి అనుభవాలను, సమస్యలను హేతుబద్ధంగా శోధిస్తుంది. ఆ సమస్యలకు శాస్త్రీయమైన పరిష్కారాలను కనుగొనటానికి ప్రయత్నిస్తుంది. అపౌరుషేయాలుగా పరిగణించబడే వేదాలు సంపూర్ణాత్మల (దైవత్వం పొందిన) అంతర్బుద్ధుల రూపాలు, ఆ సత్యాలను కొన్ని అంగీకరించిన పరిస్థితులాధారంగా తిరిగి అనుభవంలోకి తెచ్చుకోవచ్చు. మతం వ్యక్తి దైవత్వస్థితిని మరింతగా పెంచాలి. జ్ఞానాన్ని పెంచాలి. అవగాహన తీవ్రతను నిశితంగా మలచాలి. ఈ రకమైన జ్ఞానం, అవగాహన ఎన్నో మార్పులకు ఆలవాలమైన జీవితంలో చాలా మెరుగైన రీతిలో, వివేకంతో జీవించడానికి తగిన మానసిక స్థైర్యాన్ని ఇవ్వగలగాలి. మతం, మనిషిని తన ప్రవృత్తులలో ఆరోగ్యకరమైన మార్పులను తీసుకు వస్తూ తనలోని దైవత్వ వ్యక్తీకరణకు అంతఃకరణ శుద్ధిగా ప్రయత్నాలను చేయమని ప్రబోధిస్తుంది. దైవం ఆకాశంలో లేదు, పాతాళంలో లేదు, ప్రతివ్యక్తి హృదయంలో దైవం ఉన్నాడు. కానీ అరిషడ్వర్గాల వలయంలో చిక్కుకొని మానవుడు దానవుడుగా మారుతున్నాడు. ఇలాంటి తరుణంలో ప్రతి మతం మనిషిని అంతర్ముఖుణ్ణి చేసి, అంతర్లీనంగా ఉన్న దైవీశక్తులు, బాహ్యాలౌకిక జీవనానికి మూలస్తంభాలన్న జ్ఞానాన్ని ఇవ్వగలగాలి. మానవ జీవిత గమ్యం, పరమార్థం ప్రాపంచిక భోగాలననుభవించడం కాదు, ఆత్మోన్నతి అనుభవంలోకి రావడమే. మతపరమైన ఆచారాలు, శిక్షణ అనేవి మనం జీవితంపట్ల హేతుబద్ధమైన విజ్ఞతతో కూడిన దృక్పథాన్ని తదనుగుణమైన ఆచరణలను అలవరచుకునేటట్లుగా చేయడమే.

ప్రతి మతం మన అంతఃకరణ శుద్ధికి, పవిత్రతకు దోహదం చేయాలి. ఇది నిరంతరం కొనసాగవలసిన ప్రక్రియ. ఈ సాధనలో శ్రవణ, మనన, నిధిద్యాసనం అనేవి ముఖ్యమైన ఘట్టాలు. సాధకుడు ఒక ఘట్టాన్నుంచి మరొక ఘట్టం వైపు పయనించాలి. ఒక్కొక్క ఘట్టంలోని అనుభవం ఒక్కొక్క రకంగా ఉంటుంది. అయితే వివిధ దశల అనుభవాలలలో కర్త, కర్మ అనే ద్వంద్వాలుండవు. అది భేదాలెరుగని, భాగాలులేని సంపూర్ణమై చైతన్యం. ఈ అనుభవంలో వ్యక్తి సంపూర్ణసత్త తనని తాను గ్రహించగలుగుతుంది. ఈ చైతన్య స్థితిలో ఎన్నో అనుభూతులు, భావాలు, ఆవేశాలు, ఆనందం అన్నీ ఒకే అనుభవంగా, మాటలకందని బ్రహ్మానందంగా ఏకమవుతాయి. సాధారణ మానసిక స్థాయిలోని తేడాలన్నీ మటుమాయమవుతాయి. ఇలాంటి చైతన్య స్థితి కాలం కట్టళ్ళకు లొంగదు. అస్థిత్వం, చైతన్యం, ఒకటే అయి అందులో జ్ఞాత, జ్ఞేయం కలిసిపోతాయి. ఇదే సృజనాత్మక అనుభవం. గాఢమైన మతానుభవంలో వ్యక్తి ఆత్మ విశ్వాత్మతో లయమవుతుంది. ఇది వ్యక్తి స్వతసిద్ధంగా అనుభవంలోకి తెచ్చుకోవలసిందే. అలాంటి అనుభవం నుండే శాంతి, శక్తి, ఆనందం ఉద్భవిస్తాయి. ఆనందం అనేది మనోజ్ఞమైన మతానుభవం యొక్క వ్యక్త రూపాలు. మతపరమైన దివ్యానుభవంతో మానసిక నైతికానుభవాలు, ఆచరణలో అంతర్నిహితంగా ఉంటాయి. అయితే ఆ దివ్యానుభవం అన్ని సాధారణ పరిధులను దాటి అద్వైతానుభూతిని మిగులుస్తుంది.

మతం అంటే కేవలం సత్యాన్వేషణకై అనుసరించే ధ్యానమార్గమే కాదు. అది ఒక తపన, తపస్సు, వేదన. అది జీవుడు తన పరిమితులను గ్రహించి, అపరిమితమైన ఆనందానికి అర్రులు చాచే బాధ. ఈ బాధ సాధకుణ్ణి ఏకోన్ముఖంగా చేస్తుంది. గొప్ప మతాచార్యుల, బోధకుల, మానుషరూపంలో ఉన్న దేవుళ్ళతో జీవితాలపై సత్యాన్ని రుజువు చేస్తాయి. తూర్పు దేశాల్లోని మతాలు నిత్యం వెలుగుతో భాసించే ఆంతరంగిక జీవితాలను పరిపుష్టం చేయటమే లక్ష్యంగా పేర్కొంటాయి. అటువంటి ఆంతరంగిక వెలుగు ద్వారానే ఆధ్యాత్మిక స్వేచ్ఛను సాధించవచ్చు. పశ్చిమ దేశాల్లో మతాన్ని

సాంఘిక దృగ్విషయాలుగా ఎంచుతారు. సాంఘిక సుస్థిరతకు ఆధారంగా భావించారు. కానీ తూర్పు దేశాల్లో మతం ఆత్మోన్నత్యానికి మూలాధారం. మోక్ష ప్రాప్తికి మతం రాజమార్గం. ప్రాపంచికత అన్నది పశ్చిమదేశ మతాల ప్రస్ఫుటమైన లక్షణం.

డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఏమతాన్ని సంపూర్ణమైనదిగా, సమగ్రమైనదిగా పరిగణించలేదు. మతమన్నది పెరుగుదల ప్రక్రియ. ఈ ప్రక్రియలో నూతనంగా ఉద్భవించేది పాతదానిపై ఆధారపడి ఉంటుంది. ఇది అనివార్యం. ప్రపంచంలోని వివిధ మతాలు, శాంతియుత సహజీవనానికి, అంతర్జాతీయ సంక్షేమానికి, సమానత్వం, స్వేచ్ఛ, మానవ హక్కులు, సాంఘిక న్యాయం మొదలైన సమస్యల నెదుర్కొనే మిత్రులుగా భావించారు. మతాలను మానవాళి అభ్యుదయానికి, సాంస్కృతిక పునరుజ్జీవానికి ఆధారంగా వాడాలి. ప్రపంచ ఐక్యతకు మతసహనం ప్రధానమైందన్నారు. ఏ మతమైనా ప్రపంచాన్నంతా మార్చాలని ప్రయత్నం చేస్తే ఆ మతం అధికారం, శక్తికి ప్రాముఖ్యం ఇచ్చే మతంగా మారుతుంది.

## కేవల సత్తా

ప్రపంచం ఉనికి, సత్తా ఉనికిని సూచిస్తుంది. ప్రపంచం ఉంది అనడంలోకి సత్తా ఉంది అనే అర్థం ఉంది. ఈ సత్తాయే చరాచర జగత్తుకు మూలం. మన ఉనికిని అన్వేషిస్తూ పోతే సత్తా స్వరూప స్వభావాలు క్రమేపీ ద్యోతకమవుతాయి. సత్తా ఉనికిని రుజువు చేయలేం. అది స్వేచ్ఛామయం. అనంతరం ఉనికి అంతా సత్తా మీదనే ఆధారపడి ఉంటుంది. ప్రతి వస్తువు ఉనికి సత్తాతో ముడిపడి ఉంది. సత్తా అన్నది మనమనుకునే స్థబ్దతలేదా గతిశీల అంశాలను, లక్షణాలను కలిగి ఉండదు. అది దేని నుంచీ ఉత్పత్తి కాలేదు లేదా మన ఆలోచనలు లక్ష్యంగా సూచించే వస్తువూ కాదు. సత్తా అన్నది ఒక్కటే. అదే దివ్యాత్మ. సత్తాయే దేవుడు. సత్తను నియంత్రించే బాహ్యమైన శక్తి ఏదీ లేదు. అది స్వతంత్రమైనది. తన స్వశక్తితోనే సత్తా ప్రపంచం రూపు తీసుకుంటుంది. కేవల సత్తా సంపూర్ణ స్వేచ్ఛను కలిగి ఉంటుంది.

కేవల సత్తా రెండు భుజాలున్నాయి. ఒకటి బ్రహ్మం - చరాచర జగత్తునధితమించే సత్తా రెండోది ఈశ్వరుడు. పరమాత్మ అవసరమైన సత్తా. సంభావ్యమైన వాస్తవాలు శక్తి సత్తా కలిగి ఉంటాయి. ఉనికి గల వాస్తవాలు వాస్తవిక సత్తాను కలిగి ఉంటాయి. ఇవన్నీ పరమాత్ముని సంకల్పం మీద ఆధారపడి ఉంటాయి. పరమాత్మలో ద్వంద్వాలుండవు. కర్త, కర్మ భేదాలుండవు. ఆత్మ కర్తలో మాత్రమే ఉంటుంది. అది మరో దానికి లోబడి ఉండదు. కర్మకు సంబంధించిన కర్త కేవలం తార్కిక స్థాయిలోనే ఉంటుంది. ఆత్మ కర్త అయినప్పుడు అది ఏ కర్మకు కర్త కాదు. ఆత్మ అనంతం, దానికి రూపం లేదు, రూపం ఉంది. ఈ రెండు అంశాల కలయిక విశ్వసత్తా ప్రధాన లక్షణం. దైవం నామరూపరహితుడు. కానీ అన్ని నామాలు, రూపాలు తానై ఉండగలడు. అనంత సత్తా అన్నది లేదు. సత్తాయే అనంతరూపాల్లో వ్యక్తమై ఉంది. అది వ్యక్తం, అవ్యక్తం, రూపం, రూపరహితం.

సత్తాకు నాలుగు భాగాలున్నాయంటారు డా॥ రాధాకృష్ణన్. 1. కేవల బ్రహ్మం, 2. సృజనాత్మక ఆత్మ- ఈశ్వర 3. విశ్వాత్మ - హిరణ్యగర్భుడు, 4. ప్రపంచం - విరాట్ స్వరూపుడు. సంపూర్ణమైన సత్తాకు ఇవి నాలుగు భుజాలు. అవే అతీత విశ్వజనీన సత్తా, అదే అన్ని మూర్త రూపాలకు మూలమందున్న శక్తి. అదే కారణంగా ఎన్నో భాగాలుగా తనను తాను వ్యక్తపరచుకొనే సూత్రం, ఈ సృష్టికి సారభూతం, అదే దృశ్యమాన ప్రపంచం. ఇవన్నీ ఒకదానితో మరొకటి కలిసుండే భాగాలే. ఒకదాని వెంట మరొకటి ఉండవు. విశ్వానికి సంబంధించినదిగా చూసినప్పుడు పరమసత్తా దేవుడుగా కనిపిస్తుంది. విశ్వం దృష్ట్యా దేవుడు కేవల సత్త, కేవలుడు, పరిపూర్ణుడు తాను విశ్వంగా రూపం దాల్చినప్పుడున్న లక్షణం.

బ్రహ్మం ఎలాంటి గుణం, ఆకారం, విశేషణం లేని ఆధారం. ప్రతిదీ దాని నుంచి ఉద్భవించేదే. కానీ ఈశ్వరుడు వ్యక్తులకు సంబంధించిన దేవుడు. బ్రహ్మం నిర్వికల్ప సమాధికి మూలమైతే, ఈశ్వరుడు సవికల్పక సమాధికి లక్ష్యంగా నిలుస్తాడు. బ్రహ్మ, ఈశ్వరుడు వేరు కాదు. వారు ఒకే సత్తాకు

చెందిన రెండు అంశలు. సృష్టి శక్తిగా చూడడం జరిగే బ్రహ్మయే ఈశ్వరుడ బ్రహ్మను సృష్టి శక్తి స్వరూపునిగా ఎంచినప్పుడు అది ఈశ్వర తత్వమవుతుంది

## నైతిక సిద్ధాంతాలు

సృష్టిలో ఆది నుంచీ మంచికి, చెడుకి, ఉదాత్తతకు, నైచ్యానికీ, వెలుగుకీ, చీకటికీ సంఘర్షణ కొనసాగుతూనే ఉంది. వ్యక్తి స్వేచ్ఛాయుత సంకల్పాన్ని వృధా చేయడం లేదా దుర్వినియోగం చేయడం వల్ల చెడు ఉద్భవిస్తోంది. చెడునే పాపం అని కూడా అంటున్నాం. దేవుడు మానవుల ఎంపికలలో జోక్యం చేసుకోడు. బాధలు, కష్టాలు వ్యక్తి పెరుగుదలకు దోహదం చేస్తాయి. అదీ కాక ఏ దేవుడైదే అదృష్టానికి విముఖంగా ఉంటాడో ఆ దేవుడు ప్రేమ మయుడు కాదు. బాధలు, దుఃఖం లేకుండా ప్రేమ అన్నది లేదు. బాధలు, దుఃఖం మానవ జీవితాల్లోని అంతర్భాగాలు. అవతారునిగా దేవుడు మానుష రూపంలో ఎన్నో బాధలను, వ్యధలను అనుభవిస్తాడు. అవతారుని బాధల మయమైన జీవితం మానవాళికి కొత్త స్ఫూర్తిని, శక్తినిస్తుంది.

నిరంతరం అవ్యవహితంగా సాగే ప్రపంచ ప్రక్రియ సామరస్య పూరితమైన ఐక్యతను లక్ష్యంగా కలిగి ఉంటుంది. ఆ దృష్ట్యా నైతిక జీవితం, నీతి సూత్రాల అమలు జీవితాన్ని సమృద్ధం చేయాలి. నైతిక ప్రగతి న్యాయం మన అంగీకారాన్ని సూచిస్తుంది. నైతిక ధర్మాలను తు.చ. తప్పక పాటించే వ్యక్తి ప్రపంచ నైతిక ప్రమాణాలను పెంచుతాడు. డా॥ రాధాకృష్ణన్ నైతిక ప్రమాణాలను, ప్రగతిని వ్యక్తిగత మోక్ష ప్రాప్తిగా కాక, సాంఘిక శ్రేయస్సును పెంపొందించే ధర్మ సాధనాలుగా పరిగణించారు. సుగుణం అనేది ఉన్నతమైన దాన్ని ఉత్తమమైన దాన్ని అచంచలమైన విశ్వాసంతో వెలయింపచేసే ప్రయత్నాలలో ఉంటుందంటారు. ఇది మంచిది, ఉతాత్తమైనది అని కేవలం అనుకుంటే సరిపోదు. స్థిత ప్రజ్ఞతో, ఎన్ని అడ్డంకులొచ్చినా ఆ మంచికి సుగుణాన్ని స్థూల రూపమివ్వడంలోనే నైతిక శక్తి ఉంది. నీతిగా ఉండటమంటే నీతి బోధలను చేయడం కాదు. అది శీలసంపదగా రూపొందాలి అంటారు. అవినీతి అంటే దుస్వార్థంగా జీవించడం. ఎక్కడైతే పరహితం ఉంటుందో

అక్కడ నీతి ఉంటుంది. ఎవరిలో అయితే కరుడు గట్టిన స్వార్థముంటుందో అక్కడ ఉండేదే అవినీతి.

ఏ రూపంలో ఉన్న ప్రాణమైనా దానికి సాంఘిక ప్రయోజనం, విలువ ఉంటుందో అదే నీతి.నీతి ప్రాణశక్తులకు ఆజ్యం పోస్తుంది. అవినీతి ప్రాణం అనే వెలుగును మట్టుబెడుతుంది. సాంఘికాచారాలు సమాజశ్రేయస్సును ఐక్యతను పటిష్టం చేసినప్పుడు వాటిని నీతిరూపాలుగా పరిగణిస్తాం. ఏ ఆచారాలు, ఆచరణలు కులం పేరిట, మతం పేరిట, జాతి పేరిట సాంఘిక జీవితాన్ని విచ్ఛిన్నం చేస్తాయో అవి అవినీతి శక్తుల విశృంఖల విహారాలు. మనం ఉదాత్తమైన జీవితం గడిపే విషయంలో నిర్దష్టమైన అమూర్తమైన నియమ నిబంధనలు లేవు. కానీ విశ్వపరిణామ ప్రక్రియకు, విలువలను పరిపుష్టం చేయడానికి దోహదం చేసే మన జీవన విధానం, కర్మాచరణ మనల్ని ముందుకు నడిపిస్తుందంటాడు. ఆత్మ సిద్ధి అంటే వ్యక్తి సంకుచిత స్వార్థానికి మించి చాలా లోతుగా, విశ్వజనీనమైన తన ప్రకృతిని బాగా గ్రహించడలగడమే. ఉదాత్త గుణాలైన స్థిత ప్రజ్ఞత, ప్రేమ, న్యాయం, నిర్మలత్వం మొదలైనవి వ్యక్తిత్వానికి అనేక పార్శ్వాలు. అంతఃచైతన్యం, ఎరుక, సత్యం, అహింస అనేవి ఆధ్యాత్మిక జీవనానికి ప్రధాన లక్షణాలు. సర్వేశ్వరుడు సర్వాంతర్యామి అని మనం నమ్మినప్పుడు ప్రతి జీవి పట్ల మనకు అనురాగం, వాత్సల్యం, కరుణ ఉంటాయి గానీ, ద్వేషం, గర్వం మచ్చుకైనా ఉండవు.

ఆధ్యాత్మికంగా మనం ఎదుగుతున్నప్పుడు నైతిక స్థాయిలను అధిగమిస్తాం. ఆ స్థితిలో నీతి, అవినీతి, సుఖం, కష్టం మొదలైన ద్వంద్వాలకర్థం ఉండదు. వ్యక్తి నీతిబద్ధంగా జీవితం గడుపుతున్నప్పుడు, అది కాలక్రమేణా ఆ వ్యక్తిని మంచికి, ధర్మానికి మారుపేరున్నట్లుగా పిలుస్తాయి. గౌరవమూ, ప్రేమతో నిండిన నిస్వార్థ సేవ అటువంటి వ్యక్తికి ఉచ్ఛ్వాస నిశ్వాసలవుతాయి. వ్యక్తిత్వ వికాసంలో అన్ని అంశాలు, దశల మధ్య, సమైక్యతను సాధించిన వ్యక్తి ఎన్నడూ తప్పు చేయడు. అలాంటి వ్యక్తిత్వం వ్యక్తికి పూర్తి స్వేచ్ఛనిస్తుంది. అదే 'సర్వాత్మభావం' అలాంటి వ్యక్తే విశ్వమానవుడు. ప్రపంచ పరిణామ

క్రమంలో ఇలాంటి విముక్తాత్మలు ప్రముఖ పాత్ర వహిస్తాయి. నైతిక నియమాలు, ధర్మాచరణ శాశ్వత ప్రపంచ శాంతిగా సమానత్వంగా రూపొందుతాయి. నైతాకాచరణ లేని మన మత విశ్వాసాలు వినాశకర శక్తుల ఊపిరులంటారు.

## విద్య ప్రాముఖ్యత

విద్యను సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక మార్పులు తీసుకువచ్చే సాధనంగా డా॥ రాధాకృష్ణన్ నిర్వచించారు. సాంఘిక జాతీయ స్థాయిలలో సమైక్యతను, నైతిక, ఆధ్యాత్మిక విలువలను సమర్థవంతంగా చేయటానికి, ఆర్థిక రంగంలో ఉత్పాదకతను వృద్ధి చేటానికి విద్య ఉపయోగపడాలి. విద్య మన విజ్ఞానాన్ని, మన నైపుణ్యాలను పెంచాలి. అదీకాక అది మనం సంఘంలో అందరితోనూ సమైక్యంగా, శాంతియుతంగా జీవించటానికి తగిన మానసిక స్థాయి నివ్వాలి. విద్య సాంఘిక శాంతికి, సుస్థిరత్వానికి వెన్నెముక కావాలి. కేవలం ఆర్థిక ప్రగతివల్లే నాగరికత నిలబడదు. వ్యక్తులలో ఉదాత్త విలువలు, వాటికి ఆచరణ రూపం ఇచ్చే మన ప్రయత్నాలు మాత్రమే జాతీయ సమైక్యతకు, విశ్వశాంతికి దోహదం చేస్తాయి. విద్య మనల్ని ఈ లక్ష్యాలకున్ముఖంగా తీర్చిదిద్దాలి.

మనం అభ్యసించే విద్య మన వ్యక్తిత్వాలకు తగిన చేవను ఇవ్వాలి. మనలో ఈనాడు కావాల్సిన గాంభీర్యం, విశాల దృక్పథం కొరవడినాయని అంటారు. మనం ఎన్నో డిగ్రీలు సంపాదించవచ్చు. సాంకేతిక పరిజ్ఞానం బాగా కలిగి ఉండవచ్చు. కానీ జీవితంలో ఒక లక్ష్యం, గమ్యం లేకపోయినప్పుడు, జీవితంలో అన్నీ ఉండి ఏమీలేనట్లుగా భయమూ, ఆందోళన, ఆశాంతి అనేరూపాల్లో అంధకార బంధురమవుతుంది. ఉన్నత లక్ష్యం లేకపోతే మనసు తగిన స్థిమితాన్నివ్వదు, సంతృప్తి ఉండదు.

విద్య మనసుకు పదును పెడుతూ, సంతరించుకునే పెక్కుశక్తి సామర్థ్యాల వెలుగులో జీవితానికి ఒక గమ్యాన్ని, పరమావధిని ఇస్తుంది. విద్య కేవలం తిండి, గుడ్డ మిగతా భౌతికావసరాలకే అనుకుంటే విద్యావ్యాసంగం అక్కర్లేదు. పశుపక్ష్యాదులు ఏ విద్యను అభ్యసించకుండానే బ్రతుకుతున్నాయి.

విద్య వివేకాన్ని, విమర్శనాశక్తిని, విచక్షణాజ్ఞానాన్ని ఇస్తుంది. ఏది ఉచితం, ఏది అనుచితం అన్న జ్ఞానాన్ని ఇస్తూ, ఉచితమైన దానిని ఎంచుకోవటం, దాన్నే అనుసరించగల ధీశక్తిని విద్య ఇస్తుంది. నేటి యువతీయువకులు తమ శక్తులేమిటో తాము తెలుసుకొని సమాజ శ్రేయస్సుకై విద్య ఇచ్చే శక్తిని ఉపయోగించాలి. తమ ప్రయోజనా లేమిటో గుర్తెరిగి వాటిని సాధించుకుంటూ, రాబోయే తరాలకు కూడా ఉపయోగపడేటట్లుగా తమ ప్రజ్ఞా పాటవాలకు తగిన రూపునివ్వగల్గాలి. ఇదంతా విద్యవలనే సాధ్యపడుతుంది. విద్య మనకు ఉన్నతమైన విలువలకు ఆచరణ రూపం ఇవ్వగలిగిన మానసిక శక్తి నీయగలగాలి. దమం, దానం, దయ అనేవి ఉత్తమోత్తమ విలువలు. దమం అంటే సంయమం. ఆత్మ సంయమమే, అన్ని సుగుణాలకు భూమిక. మనం నేర్చే విద్ద ఈ గుణాన్ని సమృద్ధవంతం చేయాలి.

అనేక రకాలైన వికారాల నుంచి, దుర్గుణాల నుంచి, విముక్తమైన వ్యక్తే విద్యకు నిజమైన స్నేహితుడు. ఈ రకమైన విముక్తి, స్వేచ్ఛ విద్య పరమావధిని స్పష్టం చేస్తుంది. 'తద్ ద్వితీయం జన్మ' విద్య మానవుని రెండో జన్మ. శారీరకమైన జన్మ మొదటిది. విద్య వల్ల మనకు కలిగే జ్ఞానం రెండోది. విద్య జీవితం పట్ల, సంఘం పట్ల తేజోవంతమైన దృక్పథాన్ని ఇస్తుంది. అదే మనకు స్థిత ప్రజ్ఞత ప్రసాదిస్తుంది.

విద్య మనకు కేవలం సమాచారాన్ని అందివ్వటమే కాదు. జ్ఞానాన్ని ఇవ్వాలి. జ్ఞానం అనేది మనం నేర్చుకున్న విజ్ఞానం వెలుగులో అనుక్షణం జీవించగల ప్రజ్ఞపై ఆధారపడి ఉంటుంది. అంతరంగంలో శాంతి, వెలుగు ఉండాలి. మనం అభ్యసించే వివిధ కోర్సులు ఈ శాంతిని, వెలుగును ఇనుమడింపచేయాలి.

విద్యా విధానాన్ని గురించి మాట్లాడుతూ, రాధాకృష్ణన్ ఏ విద్యావిధానమైనా వ్యక్తిలో విజ్ఞానాన్ని సమపాళ్ళలో పెంచేదిగా ఉండాలంటారు. జ్ఞానాన్ని ఉత్తమోత్తమ గ్రంథాలను అధ్యయనం చేయటం ద్వారా పొందవచ్చు. సాహిత్యం, తత్త్వశాస్త్రం, మతం వేరుకాదు. ఇవి విశ్వక్రమాన్ని వివిధ దశల్లో

మార్పులను, వాటి అంతశ్చర్యలను సమైక్యరీతిలో వ్యాఖ్యానిస్తాయి. కాబట్టి విద్య విద్యార్థులలో వివిధ విషయాలను గురించి సమగ్రంగా ఆలోచించే ధోరణిని పెంపొందించాలి. అదేకాక సత్య సంధత్వాన్ని, ఆవేశాలకు బలికాకుండా సమస్యలను సామరస్య పూరకంగా పరిష్కరించుకునే మనస్థిమితాన్ని ఇవ్వాలని అంటారు రాధాకృష్ణన్.

విద్యావిధానం, విద్యార్థులను గురించి మాట్లాడుతూ రాధాకృష్ణన్ ఉపాధ్యాయుల గురుతర బాధ్యతలను స్పష్టం చేశారు. కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులు అభ్యసించే విద్య, ఉపాధ్యాయుల అంకితభావం, వారి మానసిక, నైతికస్థాయిలపై ఆధారపడి ఉంటుంది. ఉపాధ్యాయులలోనూ, విద్యార్థులలోనూ అంకితభావం లోపిస్తే ఏ విద్యా విధానమైన, ఎంతటి నియమ నిబంధనలైనా ఎవరినీ ఏమీ బాగుచేయలేదంటారు. నిరంతర సత్యశోధన, వివిధ రంగాలలో భావాలను సాంఘిక శ్రేయస్సుకై ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దటం వివిధ స్థాయిలలో గల విద్యాసంస్థల (ఉపాధ్యాయులు, విద్యార్థులు) పరమ లక్ష్యం కావాలి. ఒక జాతి సంస్కృతి, మానవాళి శాంతియుత సహజీవనం, విద్యాసంస్థల పనితీరుపై ఆధారపడి ఉంటుంది. మన విశ్వవిద్యాలయాలు మన సంప్రదాయాలను, మన పూర్వీకులిచ్చిన భావసంపదను ఆధునికయుగంలో తలెత్తే ఎన్నో రకాలైన సమస్యలకు పరిష్కారమార్గాలు కనుగొనేందుకు ఉపయోగపడేటట్లు మలచాలన్నారు. అదేవిధంగా మన సంస్కృతీ సంపదలో ఉత్తమమైన వాటిని విదేశీ సంస్కృతి సంపదలో ఉత్తమమైన వాటిని, విదేశీ సంస్కృతులలో ఉత్తమమైన భావాలతో, ఆచరణలతో మేళవించి శాస్త్రీయ, సాంకేతిక రంగాలలో, సాంస్కృతిక రంగాలలో మహోన్నత శిఖరాగ్రాలనధిరోహించేటట్లు చేయటమే మన విద్యావిధాన లక్ష్యం.

శాస్త్రవిజ్ఞానాధ్యయనం చాలా ముఖ్యమైంది. మన విద్యావ్యాసంగంలో శుద్ధశాస్త్రం (Pure Sciene), అనుప్రయుక్తశాస్త్రం, సాంకేతిక విషయాలు గణనీయమైన స్థానాన్ని పొందాయి. విద్యార్థులు ఈవిషయాలను అధ్యయనం

చేయటంలోనే తమ సమయాన్నంతా వినియోగించక, మానవజీవితానికి అర్థం, దాని ఔన్నత్యాన్ని కూడా గ్రహించేందుకు కొంత సమయాన్ని వినియోగించాలి. విశ్వవిద్యాలయాలు విద్యార్థులలో మానవజీవితం ఒక అపరూపమైన విలువ అంటారు. ఈ విలువలను ఆకళించుకునే అవకాశం, వాటిపట్ల జిజ్ఞాసను పెంపొందించాలి. విలువలపట్ల జిజ్ఞాసను పెంపొందించని విద్య విద్యకాదు అది అవిద్య అవుతుంది. ఈ విశ్వంలో మనిషి సాధనం, పాత్రను మనం అభ్యసించే విద్య మనకు తెలియచేయగల్గాలి. ఈ సందర్భంగా రాధాకృష్ణన్ విశ్వవిద్యాలయాల్లో అతిభౌతికశాస్త్రం(Metaphysics) అధ్యయనం ప్రాముఖ్యతను వివరించారు. అదేవిధంగా సామాజిక శాస్త్రాలు, సామాజిక సేవ హృదయాన్ని విద్యార్థులకు విశదీకరించాలి. విద్యార్థులు అభ్యసించే ఏ శాస్త్రమైనా, కళైనా అది ప్రతివ్యక్తిలో సామాజిక స్పృహను, అవగాహనను పెంపొందించాలి. సామాజిక స్పృహ కలగజేయని విద్య విద్య కాదు. ఆ తప్పు విద్యది కాదు, విద్యార్థులది, చుట్టూ ఉన్న సమాజానిది.

ప్రజాస్వామ్యంలో విశ్వవిద్యాలయాల పాత్ర చాలా గణనీయమైనది. విశ్వవిద్యాలయాలు అంతర్జాతీయ ప్రమాణాల స్థాయిలో గొప్ప విద్యాంసులను శాస్త్రజ్ఞులను, సాంకేతిక రంగాల్లో ప్రతిభావంతులను కాదు తయారు చేయాల్సింది. మంచి శీలం ప్రతిభ ఉన్న నాయకులను తయారుచేయాలి. విద్యార్థులలో ప్రతిభను గుర్తించి వాటికనుగుణమైన వాతావరణాన్ని విశ్వవిద్యాలయాలు సృష్టించాలి. విద్యార్థుల అభిరుచులకు, ప్రతిభకు తగిన అవకాశాలు లేకపోతే విద్యార్థులు సంఘ విద్రోహక శక్తులుగా మారతారు. విద్యార్థి సంవత్సరాల తరబడి విద్యాలయాల్లో అభ్యసించే ఏ కోర్సుకైనా సామాజిక ఔచిత్యం ఉండాలి. ఈ సామాజిక ఔచిత్యం విద్యార్థులకు జీవనోపాధి అవకాశాలను కల్పిస్తుంది. జీవనోపాధి అవకాశాలు లోపిస్తే విద్యార్థులు నిస్పృహ, నిరాశలకు బానిసలవుతారు. తద్వారా వారికి ఏళ్ళ తరబడి అభ్యసించే విద్యను సమగ్రమైన సాంఘిక శక్తిగా, నైతిక విలువలకు, ఆధ్యాత్మిక దృష్టికి మూలసూత్రంగా తీర్చిదిద్దాలి. ఈ బృహత్తర కార్యక్రమంలో,

రాధాకృష్ణన్ చరిత్రను మూడు తరగతులుగా విభజిస్తాడు. సాంస్కృతిక చరిత్ర, సామాజిక చరిత్ర, వివిధ శాస్త్రాల చరిత్ర. చరిత్రను వాఖ్యానించేటప్పుడు చారిత్రక గ్రంథాలను తన ఇష్టమొచ్చిన రీతిలో వాఖ్యానించరాదు. ఆ గ్రంథాలలో ఇచ్చిన సమాచారం మీదే కేవలం ఆధారపడరాదు. మంచి ప్రమాణాలు ఉన్న వ్యాఖ్యానం చరిత్రకారుని సహానుభూతి, భావనాశక్తిని, సృజనాత్మక అంతర్ దృష్టిని స్పష్టపరుస్తుంది. చరిత్ర అనేది మానవుడు తనని తాను అధిగమించడానికి నిరంతరం కొనసాగించే ఉద్యమం, ఈ సంఘర్షణ, ఈ ఉద్యమం తాను నమ్మిన విలువలు, ఆదర్శాలు, స్వాతంత్ర్యం అన్న వాటిని వాస్తవాలుగా రూపొందించడానికి చేసే మహా యజ్ఞం. ఈ చారిత్రాత్మక ఉద్యమాలు 'మానవాళి పరస్పరాధారం' అనే ప్రాథమిక సూత్రాన్ని తెలియజేస్తాయి. పరస్పరాధారం దేశాల మధ్య, జాతుల మధ్య శాంతియుత సహాజీవనాన్ని పటిష్టం చేస్తుంది. ఒక దేశంలో సంభవించే సంఘటనలు ఇతర దేశాలపై ప్రభావాన్ని చూపుతాయి. అందువల్ల ప్రపంచంలో సంభవించే సంఘటనలను పృథక్కరణంగా పరిశీలించరాదు. చరిత్ర ఈ విషయమై అందర్నీ హెచ్చరిస్తోంది.

ప్రపంచంలో జరిగే వివిధ ఆవిష్కరణలను, సంఘటనలను, వాటి మధ్య అంతశ్చర్యలను చారిత్రక సత్యాలుగా అవగాహన చేసుకోవాలంటాడు డా॥రాధాకృష్ణన్.

రాధాకృష్ణన్ అమూర్త భావాలకు ఒక స్పష్టమైన, సరళమైన రూపాలను ఇవ్వడంలో ప్రతిభను ప్రదర్శించారు. ఈయన ఒక ద్రష్ట, దార్శనికుడు, ఒక మహా రచయిత.

# 6

# జిడ్డు కృష్ణమూర్తి (చైతన్య వాదం)

## జీవిత సంగ్రహం

జిడ్డు కృష్ణమూర్తి మదనపల్లెలో మే, 11, 1895లో జన్మించారు. తల్లిదండ్రులు శ్రీమతి సంజీవమ్మ, నారాయణయ్య. ఈయన బాల్యంలోనే తల్లిని, సోదరిని కోల్పోయారు. ఈ రెండు సంఘటనలు ఆయనను ఎంతో కలచివేశాయి. ఈయన తండ్రి మదరాసుకు మకాం మార్చినప్పుడు అడయార్‌లోని దివ్యజ్ఞాన సామాజికులు అనీబిసెంట్, లెడ్‌బీటర్‌ల దృష్టి కుశాగ్రబుద్ధి, స్ఫురద్రూపియైన కృష్ణమూర్తిపైన పడింది. ఆయన పోషణ, శిక్షణా కార్యక్రమాలను వారు స్వీకరించారు. అదృశ్యగురువు కుతూమీ చేత దీక్షనిప్పించారు. ఈయనను ఒక జగద్గురువుగా చేయాలని వారి సంకల్పం. ఇందుకై వారు విరాళాలను, ఆస్తులను పోగుచేసి 'Order of the star of the East' అనే సంస్థను స్థాపించారు. కాని కృష్ణమూర్తికి ఈ వ్యవహారాలన్నిటి మీద విరక్తి కలగనారంభించింది. 1925లో కృష్ణమూర్తి సోదరుడు నిత్యానందం మరణం ఆయనను తీవ్రంగా కలచివేసింది. 1926 సంవత్సరం నాటికి కృష్ణమూర్తి ఆలోచనా విధానంలో పూర్తి మార్పు వచ్చింది. 1929లో 'Order of the star of the East' సంస్థను రద్దు చేస్తున్నట్లు కృష్ణమూర్తి ప్రకటించారు. సత్యం అనంతమైంది, అపారమైంది - ఏ ఒక్క నిర్ణీత సంస్థా,

బాటా దాన్ని చేరుకోలేవని ప్రకటించారు. ఇది ఆయన అనుయాయులను విస్మితులను చేసింది. శ్రీమతి అనీబిసెంట్‌కు ఇది నచ్చకపోయినా అంగీకరించక తప్పలేదు.

దీని తరువాత కృష్ణమూర్తి ఏ సంస్థతోనూ, వ్యవస్థతోనూ సంబంధం పెట్టుకోలేదు. మానవుడికి సంపూర్ణ స్వేచ్ఛను కలిగించటమే తన జీవిత లక్ష్యంగా ఎంచారు. ఈ ఏకైక లక్ష్యాన్నే తుది వరకూ తన ఊపిరిగా పెట్టుకున్న దార్శనికులు కృష్ణమూర్తి. 1986 ఫిబ్రవరి 17న తుదిశ్వాస విడిచేంతవరకూ తాను నమ్మిన సత్యాన్ని, అనుభవాన్ని ప్రపంచంలోని వారందరితోనూ పంచుకున్నారు.

## సత్య శోధన

జిడ్డు కృష్ణమూర్తిగారి మాటలువిన్నప్పుడు మనకు సోక్రటీస్ చెప్పిన ఈ కింది మాటలు గుర్తుకు వస్తాయి.

"జిజ్ఞాస లేని జీవితం వృథా. స్వతంత్ర ఆలోచనలు లేకపోవటంవల్ల వ్యక్తి అంధ విశ్వాసాలకు బానిస అవుతాడు. సత్యం ఎన్నో సంస్థల రూపంగా మారినప్పుడు సంస్థలు, సమాజాలు తమ అనుయాయులను యాంత్రికమైన పావులుగా మారుస్తాయి. సత్యమనే దానికి నిర్దిష్టమైన బాట, దారి లేదు. సూత్రరూపాల్లో బంధించినది సత్యం కానేరదు". ఎవరికి వారు ఈ సత్యాన్ని తమలోనే కనుగొనాలి, అనుభవించాలి. కేవలం గురువులమీద, సంస్థల మీద ఆధారపడటం అవివేకం అంటారు కృష్ణమూర్తి.

ఎంతటి మహత్తరశక్తి, వ్యక్తి, సంస్థ ఏ వ్యక్తికీ సత్యాన్ని ఆవిష్కరింప చేయదు. ఎవరికి వారుగా నిర్నిబద్ధ మనస్సుతో సత్యాన్ని అనుభవించాలి. సత్యం ఏదో ఒక స్థానంలో ఉంటుందనుకోవటం పొరపాటు. ఎవరివల్లనో మనకు సత్యం అవగతమవుతుందనుకోవటం, వారిని పూజించటం, విశ్వసించటం చాలా పెద్ద పొరపాటు. సత్యమనేది భావనకాదు, పర్యవసానమూ కాదు.

కృష్ణమూర్తి తీవ్రమైన ఆలోచనావాది. ఆయన వివిధ తరగతులకు చెందిన అధికారాన్ని, ప్రమాణాన్ని నిరసించారు. వ్యక్తినిగానీ, ఒక గ్రంథాన్ని గానీ, సంప్రదాయాన్ని గానీ మనం ఒక అథారిటీగా స్వీకరిస్తే మనం మన స్వేచ్ఛను, సృజనాత్మకతను కోల్పోయినట్లే. సత్యాన్ని దర్శించటంలో ఎవరికై వారు ప్రయత్నం చేయాలి, మార్గాన్నెంచుకోవాలి. వ్యవస్థీకృతమైన ఏ మతమూ, ఏ సంస్థ ఏ వ్యక్తినీ అజ్ఞానాంధకారంనుండి విముక్తుణ్ణి చేయలేదు. ఈ జ్ఞానం, చైతన్యం చేతనే కృష్ణమూర్తి ఆర్డర్ ఆఫ్ ది స్టార్ సంస్థను 1929లో రద్దు చేశారు. అట్లాగే వారు హేతు శక్తిని యథార్థ జ్ఞానానికి (True knowledge) మూలంగా (Source) ఎంచలేదు. ఆలోచన అనేది మన స్మృతి (జ్ఞాపకశక్తి) వ్యక్తీకరణ మాత్రమే. అది ఎన్నో భావాల మధ్య సంబంధాన్ని తెలుపుతుంది. కానీ అది సత్యాన్ని అనుభవంలోకి తీసుకురాలేదు. పైగా అది సంఘర్షణను, (Conflict), సంభ్రమాన్ని (Confusion), దుఃఖాన్ని కలిగిస్తుంది. మన అవగాహనా శక్తిని కాంతి హీనం చేస్తుంది.

సత్యాన్ని ఊహాశక్తితో (Imagination) అవగాహన చేసుకోలేం. ఊహాశక్తి, ఆలోచనల (Thoughts) లాగా స్మృతి (Memory) పై ఆధారపడి ఉంది. ఊహాశక్తే కల్పనాశక్తి. ఈ శక్తి మనలను సత్యానికి దూరం చేస్తుంది. సత్యాన్ని అర్థం చేసుకోవడానికి ఎలాంటి సాధనలు, యోగం, అతీంద్రియ అనుభవాలు ఏమాత్రం నమ్మదగినవి కావనీ కృష్ణమూర్తి అంటారు. ఆయన తననెప్పుడూ గురువుగానో, బోధకుడిగానో వర్ణించుకోలేదు. ఒక మార్గాన్ని వారు సూచించారు. దానినను సరించి ఎవరి అనుభవం ద్వారా వారే తమ మోక్షమార్గాన్ని ఎంచుకోవాలంటారు.

మన మనస్సు, జీవన విధానంపైన మన సత్యం, సాధన, మోక్షం ఆధారపడి వుంటాయి. జీవితంలో చాలా ముఖ్యమైనది, 'నిన్ను నీవు తెలుసుకోవటమే' అంటాడు. నిన్ను నీవు తెలుసుకోవటమంటే ఏదో మార్పుకు లోను కానిదాన్నో, నీవు ఊహించే అమరమైన దాన్నో, నీవు భాషా శక్తితో ఆత్మగా వర్ణించేదాన్నో తెలుసుకోవటం కాదు. అది నిన్ను నీవు అనుక్షణం

తెలుసుకోవాలి. నీ అనుభవాలను, అనుభూతులను, ఆలోచనలను, ఆచరణలను అనుక్షణం నిర్నిబంధిత మనసుతో (Unconditioned mind) గ్రహించాలి. అందుకై అనుక్షణం మనం మెలకువతో ఉండాలి. ఎంత అప్రమత్తంగా ఉంటే అంత ఎక్కువగా మనల్ని మనం తెలుసుకోగలం. సంప్రదాయ సిద్ధాంతాలలో మనల్ని మనం తెలుసుకోవటమంటే ఆత్మసాక్షాత్కారంగానో, దైవత్వాన్ని అనుభవంలోకి తెచ్చుకోవటంగానో అభివర్ణించారు. ఇలాంటి వర్ణనలూ, సిద్ధాంతాలు తరతరాలుగా వ్యక్తులకు కుంటివానికి ఉపయోగపడే చంక కర్రలుగా (Crutches) నే ఉపయోగపడుతున్నాయి. ప్రతివ్యక్తి అనుక్షణం తనని తాను నిశితంగానూ, నిర్దుష్టంగానూ పరిశీలించుకోవాలి. అంతేకానీ 'ఎవరో మహద్గురువు ఇట్లా చెప్పారు ఫలాన మతం, సాంఘిక సంస్థ నాకు రక్షణ కల్పిస్తుంది' అనుకుంటూ ఎవరిమీదో, దేనిమీదో ఆశలు పెట్టుకుని ఆధారపడటం గుడ్డివాడు లాంతరు పట్టుకుని బాటవెంట పయనించడం లాంటిది. అందువల్ల ఎవరైతే ఒక అధికారానికీ, ఒక సంస్థకు అధిపతిగా ఉన్న వ్యక్తికి లోబడి వుంటాడో, ఎవరైతేవారి మోక్షానికై తమ స్వేచ్ఛను గురువుల పాదాలచెంత పణంగా పెడతారో వారికి సత్యం, స్వరూపం, జీవితం విలువ, పరమార్థం తెలియదంటారు కృష్ణమూర్తి. సత్యం అపారమైంది. అవధులు ఎరుగనిది. ఏ వ్యక్తిలో అయితే సరళత, అణకువ ఉండవో ఆ వ్యక్తికి స్వేచ్ఛ ఉండదు. అణకువ అంటే అవతలవారిని తమకంటె మిన్నగా ఎంచి వంగి వంగి దణ్ణాలు పెడుతూ చీకటినే వెలుగుగా భ్రమపడటం కాదు. సుగుణాలు (Virtues) మనకు తగిన స్వేచ్ఛను ఇస్తాయి, కానీ ఎంతో జాగ్రత్తగా, స్వార్థపూరిత మనసుతో గుణించి, గుణించి అలవరచుకొనే అణకువ, అణకువ కాదు. అది మెరిసే ముసుగులో ఉన్న బానిసత్వం, నీ మనస్సును, నీ భావాల స్వభావ, స్వరూపాల్ని నీవే నిత్యం శోధిస్తూ తెలుసుకోవాలి గానీ, ఎవరో నిన్ను ఉన్నతుడుగా భావించే బాబాయో, ఆచార్యుడో, మహర్షో మతసంస్థో నిన్ను ఉద్ధరిస్తుందని భావించడం సత్య విరుద్ధం అంటారు కృష్ణమూర్తి.

గట్టి సంకల్పంతో (Strong will) చేసేపని - అనుకూలమైనదైనా సంక్షోభానికి, సంఘర్షణకూ దారి తీస్తుంది. అలాంటి కార్యం అవగాహనకు మార్గమవదు. ఒక అధికారాన్ని ఉన్నతమైన లక్ష్యంగా ఎంచుకొని, దానికి అనుగుణంగా తనని తాను మలచుకోవటమంటేతన స్వేచ్ఛను కోల్పోవటమే అంటారు. స్వేచ్ఛలేని చోట సత్యాన్ని గ్రహించటానికి ఏమాత్రం అవకాశం లేదు. ఎలాంటి అవరోధాలు లేని చోటనే అవగాహన ఉంటుంది. అవగాహన ఉన్నచోట స్వేచ్ఛ ఉంటుంది. స్వేచ్ఛ బజారులో దొరికే వస్తువు కాదు, అది ఒకరికి మరొకరు ఇచ్చేది కాదు. దేనినైతే మనం బజారులో కొంటామో అది శాశ్వతంగా నిలవదు. మనకు ఎవరైనా ఏదైనా ఇస్తే అది మన చేతినుండి వెంటనే జారిపోవచ్చు. మనచేతిలో ఉన్నది, ఎవరో ఒకరు మనకు ఇచ్చినది మనం కోల్పోతామనే భయం వెంటాడుతూనే ఉంటుంది. భద్రత (Security), శాశ్వతత్వం (Permanence) అనేవి ప్రతి రంగంలోనూ, అందునా ఆధ్యాత్మిక రంగంలో మన లక్ష్యాలు కావటంవల్ల అధికారానికి మనం పట్టం కడుతున్నాం. ఇలాంటి ధృక్పదంవల్ల ప్రతివారు అవధులు ఎరుగని తమ స్వేచ్ఛను కోల్పోతూ, ఎన్నో భావనా రీతులకు, సిద్ధాంతాలకు, సంస్థలకు, దేవుళ్ళుగా ఎంచబడే గురువులకు (Godmen) అనుయాయులుగా, బానిసలుగా మిగులుతూ నకిలీ జీవితాలను గడుపుతున్నారంటారు కృష్ణమూర్తి.

ఎన్నో కోర్కెలకు, లక్ష్యాలకు బందీ అయిన ప్రయత్నాలు స్వేచ్ఛను, అవగాహనను ఇవ్వలేవు. స్వేచ్ఛ, అవగాహన అవిభాజ్యాలు, కృష్ణమూర్తి సమస్యలను తగిన అవధానంతో పరిశీలించమంటాడు. ఆయన ఏ సమస్యకు 'ఇదే సమాధానం' అని ఖచ్చితంగా చెప్పరు, ఎందుకంటే తను 'దీనికి ఇదే పరిష్కారం' అని చెపితే ప్రతివారు దానినే గుడ్డిగా నమ్మి, తమ స్వేచ్ఛను, ఆనందాన్ని కోల్పోతారు. అందువల్ల వారి ప్రసంగాలన్నీ మనల్ని ఆలోచింపచేసి మన మార్గాన్ని మనమే శోధించి, అవగాహన చేసుకొనేందుకు దోహదం చేస్తాయి.

## అవధానం

కృష్ణమూర్తి అవధానానికి (Attention), మనసు లగ్నం చేయటానికి (Concentration) మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరిస్తారు. మనస్సుని లగ్నం చేయటమనేది ఒక కోరికతో, ఇచ్ఛాశక్తితో చేసేది. ఒక కోరికను సిద్ధింపచేసుకోవటానికి ఏకాగ్రతను సాధనంగా ఉపయోగిస్తాం. ఈ శక్తిని ఒక సాధనంగా లక్ష్యసిద్ధి కోసం వాడటం, పెంపొందిచుకోవటం జరుగుతుంది. ఏకాగ్రత అనేది సత్యావిష్కరణ కోసం సాధనం కాదు. సత్యాన్ని ఏకాగ్రత ద్వారా అనుభవంలోకి తీసుకురాలేం. ఎందుకంటే ఏకాగ్రత అనేది సంఘర్షణను జనింపచేస్తుంది. ఏకాగ్రత మనస్సు సహజమైన పోకడను, ప్రవాహాన్ని నిరోధిస్తుంది. నిరోధం, అవరోధం స్వేచ్ఛకు శత్రువు. సంఘర్షణలు మనసులో అలజడిని జనింపచేస్తాయి. అలజడికి ఆలవాలమైన మనస్సు యధార్థాన్ని గ్రహించలేదు. యధార్థాన్ని గ్రహించడం అవధానంవల్లనే సాధ్యపడుతుంది. అవధానంలో 'నేను' అనే ధ్యాస కలిగిన ప్రయత్నం లేదు. అది సహజమైన, అప్రయత్నమైన సృజనాత్మకమైంది. ఇకదానిపట్ల అవధానంగా ఉండటమంటే ప్రయత్నం లేకుండా, ఇచ్ఛ లేకుండా ఉండటమే. అవధానస్థితిలో ఒక్క విషయమే వుంటుంది. అదే చేతనాత్మక స్థితి. ఈ స్థితిలో జ్ఞాత (Knower), జ్ఞేయం (Known) మధ్య ఉన్న వ్యత్యాసం మటుమాయమవుతుంది. ఈ స్థితే ఒక విషయాన్ని గురించి సంపూర్ణ జ్ఞానాన్ని ఇస్తుంది.

అవధాన స్థితిలో మనస్సు తన సహజసిద్ధమైన సిద్ధిని పొందుతుంది. అక్కడ 'నేను ప్రయత్నం చేస్తున్నాను, నేను ఇది కోరుతున్నాను, నాకు ఇది కావాలి' అనే ధ్యాస ఉండదు. ఈ స్థితి సమగ్రమైన జ్ఞానాన్ని ఇస్తుంది. ఈ స్థితిలో వైరుధ్యాలు, సంఘర్షణలు ఉండవు. మనస్సును నిర్దిష్టమైన మార్గంలో నడిపిద్దామన్న పట్టుదల ప్రయత్నాల ఊపిరయితే అలాంటి కార్యాచరణలన్నీ సంఘర్షణలనే సృష్టిస్తాయి. ఈ విషయాన్ని మనందరం ఏ ఒత్తిడులకు లొంగని మనస్సుచేత గ్రహించాలి.

కృష్ణమూర్తి బోధనలలో ప్రధానమైనది వరణమెరుగని ఎరుక. ప్రతివారి మనస్సు గత స్మృతులతో, తత్సంబంధమైన ఆలోచనలతో, చింతలతో నిండి ఉంటుంది. ఇది బరువులలోకెల్లా పెద్దబరువు. అనుక్షణం ఈ బరువు మనల్ని వెంటాడుతూనే వుంటుంది. నిద్రావస్థలో సైతం ఈ స్మృతులు, ఆలోచనలు ఎన్నో విధాలైన దిగులు, భయం, వివిధ విషయాలకు సంబంధించిన ఆందోళనలు మన మనస్సును ముసురుతూనే ఉంటాయి. అంటే మనమందరం ఈ బరువుకి బానిసలమే. ఈ బరువును మోస్తున్నంతకాలం మనకు ఏ సమస్యలపట్ల సంపూర్ణమైన అవగాహన, అవగాహననుండి ఉద్భవించే స్వేచ్ఛ ఉండవు. అందుచేతనే కృష్ణమూర్తి మన ఎరుక వరణమెరుగనిదై (Choiceless) ఉండాలి, స్వేచ్ఛ అనేది జీవితం పరమావధి కాదు. అది మన జీవిత గమనాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవటానికి ప్రధమ సోపానం. స్వేచ్ఛ లేకపోతే ఆధ్యాత్మిక జీవనం లేదు.

మనం జీవితంలో అడుగడుగునా ఎన్నుకోవటం, కోరుకోవటం జరుగుతుంది. ఒక్కొక్కసారి మనముందు ఎన్నో ప్రత్యామ్నాయాలుంటాయి. వీటిలో ఏదో ఒకదాన్నో, కొన్నింటినో ఎంచుకోవాల్సి వస్తుంది. ఈ ఎన్నిక తప్పయితే ఫలితం ఆశించిన దానికి వ్యతిరేకంగా వస్తుంది. ఎన్నిక (Choice) సరియైనదైతే అది సంతోషానికి, సంతృప్తికి దారి తీస్తుంది. ఈ ఎన్నిక (Choice) ఎన్నో దురభిప్రాయాలనుండి (Prejudices), ఇష్టా ఇష్టాలనుంచి ఉద్భవిస్తే ఫలితాలు ఎన్నో తికమకలతో నిండి ఉంటాయి. సరియైన ఆనందాన్ని ఇస్తే ఎన్నిక (Choice) ఎలాంటి వికారాలకు, కోరికలకు బానిస అవ్వని మనస్సు నుండి స్వతసిద్ధంగా ఉద్భవిస్తుంది.

వరణమెరుగని ఎరుక అంటే, ఎరుక అనేది ఎలాంటి భావనకు బానిస కారాదు. ఎలాంటి భావననూ, సిద్ధాంతాన్ని, ఆదర్శాన్ని మనసు ఎంచుకోరాదు. ఇచ్ఛా పూర్వకంగా ఎలాంటి ఆలోచనలను మనసులోకి తెచ్చుకోకూడదు. ఎలాంటి అనుభూతులను కావాలని చెప్పి మనస్సునుండి

నెట్టి వేయరాదు. మంచి అవధానంతో (Attention) ప్రతిభావాన్ని, అనుభూతులను కావాలని అవలోకించాలి. సంతోషాల్ని కలిగించే భావాలనైనా, బాధను కలిగించే విషయాలనైనా ఎలాంటి మనోవికారాలు లేకుండా గమనించాలి. దీనినే కృష్ణమూర్తి వరణమెరుగని ఎరుక (Choiceless awareness) అని అన్నారు. ఎన్నో మనో వైకల్యాలకు బందీ అయి, నిత్యం నలిగే మనస్సుకు నవ్యత్వం, నూతనత్వం అనేది తెలియనే తెలియదు.

సామాన్యంగా మన సంజ్ఞానం(Cognition) ఉద్దేశపూర్వకంగా ఉంటుంది. ఈ పద్ధతిలో ఎన్నో ఆక్షేపణలు (Drawbacks) లోపాలు ఉన్నాయి. మొదటిది ఆలోచన, భావము. ఒక భావాన్ని ఎంచుకోవటం (Choose) అంటే భావం ప్రస్ఫుటమైన రూపాన్ని తీసుకోవటం. అలాంటి భావం సత్యానికి మార్గం కాదు. ఇచ్ఛాపూర్వకమైన ఎరుక (Deliberate awareness) సత్యాన్ని గ్రహించలేమంటాడు. అదేకాక కావాలని చెప్పి అలవరచుకునే ఎరుక మనసులో వివిధ వైరుధ్యాలను, సంఘర్షణలను జనింపచేస్తుంది. అలాంటి మానసిక స్థితిలో శాంతి, ఆనందం ఏమాత్రం ఉండవు. సంఘర్షణలు మనసును మలినంచేస్తూ అంధకారాన్ని మరింత ఉధృతం చేస్తాయి. ఉద్దేశపూర్వకమైన ఆలోచనాసరళి వల్ల మనసు సరళమైన, లోతైన సహజ సృజనాత్మక శక్తుల ఆవిర్భావాన్ని అవగాహన చేసుకోలేదు.

ప్రత్యేకంగా బాధను కలిగించే భావాలను, అనుభవాలను అర్థం చేసుకోలేదు. ఒక భావం మనస్సులో మెదలగానే దానితో మనం ఘర్షణ పడతాం. దానినుండి తప్పించుకునేటందుకు, దానిని మనస్సులోనుంచి నెట్టివేసేందుకు ఎంతో శ్రమిస్తాం. ఈ ప్రయత్నం సంఘర్షణను మరింత తీవ్రతరం చేస్తుంది. ఇది మానసిక శక్తులను వృథా చేస్తుంది. అందువల్లనే వ్యక్తి మానసికంగా బలహీనుడు, అశక్తుడు అవుతాడు. కొన్ని భావాలను మనస్సునుంచి నెట్టివేయడానికి ప్రయత్నం చేస్తాం. వాటిపట్ల చాలా విముఖంగా ఉండటం కూడా జరుగుతుంది. అంటే మనస్సుకు సంతోషాన్నివ్వని అనుభూతులను, అనుభవాలను నిర్వికారంగా, పూర్తి

అవధానంతో (Attention) అవగాహన చేసుకునే స్పష్టమైన మానసిక స్థితిని కోల్పోతాం. ఒక రకంగా తప్పించుకోటానికి ఉద్దేశపూర్వక ప్రయత్నం జరుగుతుంది. ఇలాంటి ప్రయత్నాలన్నీ మన మనస్సును, జీవితాలను, మరింత క్షోభతో, దుఃఖంతో నింపుతాయి. అంటే మనలో వరుణమెరుగని ఎరుక పూర్తిగా లోపించిందన్న మాట. మన ఆలోచనా సరళి, పద్ధతి మన కోరికలకు, ఇష్టా ఇష్టాలకు అనుగుణంగా నడుచుకున్నప్పుడు మన మానసిక శక్తులు స్వేచ్ఛను, శాంతిని ఆవిష్కరించలేవు. మానసిక ప్రవృత్తులను, ఆలోచనా ధోరణులను ఒక ప్రేక్షకునిగా నిర్వికారంగా అవగాహన చేసుకునే తత్త్వమలవరచుకున్ననాడే మన జీవితంలో లోతులు, శాంతి, స్వేచ్ఛలు సంపూర్ణంగా అవగతమవుతాయి. దీనినే వరణమెరుగని ఎరుక అంటారు కృష్ణమూర్తి. దీన్ని పరిష్కారమార్గంగా (దేనినీ కూడా) సిద్ధాంతీకరించరు.

వరణమెరుగని ఎరుక (Choiceless awareness) ఏ విధమైన భావనారీతి చేత, అభిప్రాయాల చేత బంధించడం జరుగదు. అది నిర్నిబద్ధమైన (Unconditioned) మానసిక స్థితి. సామాన్యంగా మన జ్ఞానం ఎన్నో ఆలోచనలతో, సిద్ధాంతాలతో లోబడి ఉంటుంది. అందువల్లనే సంఘంలో నేటికీ వైమనస్యం, విద్వేషం, విశృంఖలంగా శాంతిని, సామరస్యాన్ని నాశనం చేస్తున్నాయి. వరణమెరుగని ఎరుక ఒక భావం, పని, సమస్యను గురించి సమగ్రమైన రూపాన్ని మనకు ఇస్తుంది. ఈ సమగ్ర రూపంలో ఎలాంటి వైరుధ్యానికి (Contradiction) సంఘర్షణకు తావులేదు. ఒక విషయాన్ని పరిశీలిస్తున్నపుడు అలాంటి ఎరుక మన అనుభవాన్ని నామ రూప రహితంగా శాంతికి, సౌఖ్యానికి, సామరస్యానికి మూలాధారంగా మనముందుంచుతుంది. ఆ ఎరుక పరిశీలకుడు, పరిశీలింపబడే విషయాన్ని తెలుసుకునేవాడు, తెలుసుకోబడే విషయానికి మించిన స్థితిని మనముందుంచుతుంది. ఇదే కాలం అవధులు ఎరుగని సత్యం, వాస్తవికత, వరణమెరుగని ఎరుకే (Choiceless awareness) వైరుధ్యాపలెరుగని వివిధరూపాలలోని సత్యాలు, వాస్తవాలు.

ఏ విధమైన వైరుధ్యం, వైషమ్యమెరుగని ఎరుక భావాతీత స్థితిలో వుంటుంది. అలాంటి స్థితి భాషాపరమైన పరిమితులను, సరిహద్దులను అధిగమించేది. ఏ భాషా అనిర్వచనీయమైన ఎరుకను తమ పదాల్లో, భావనలలో, ప్రత్యయాలలో (Concepts) బంధింపలేవు. పదే పదే కృష్ణమూర్తి మాట (Word) యథార్థం (Fact) కాదు అంటాడు. యథార్థం శుద్ధ ఎరుక. శుద్ధమైన ఎరుక (Pure awareness) మాటలకందని అనిర్వచనీయమైన స్థితి. మాటలలో దాన్ని బంధించే ప్రయత్నం చేయుటం దాన్ని హత్య చేయటంలాంటిదే. శుద్ధ చైతన్యమే స్థిరంగా ఉంటుంది. అందుచేతనే కృష్ణమూర్తి వర్తమానాన్నే చాలా ముఖ్యమైందిగా, ప్రధానమైనదిగా ఎంచుతాడు. గత స్మృతుల క్రీనీడల్లోనో, భవిష్యత్తుకు సంబంధించిన కాల్పనిక జగత్తులోనో జీవించే జీవితం యథార్థానికి, స్వేచ్ఛకు నిజమైన జీవితం కాదు. కాలానికి హద్దులున్నాయి. ఒకనాడు కాలానికే కాలం తీరుతుంది. కానీ శుద్ధమైన ఎరుక మాత్రం నిత్య సత్యంగా వెలుగొందుతూనే ఉంటుంది.

## ప్రజ్ఞ, ఆవిర్భావం

ప్రజ్ఞ అనేదాన్ని కృష్ణమూర్తి ప్రత్యేకమైన అర్థంలో వాడతారు. ప్రజ్ఞ శుద్ధమైన ఎరుక నుంచి ఉద్భవిస్తుంది. సామాన్యంగా మేధాసంపత్తిని ఉపయోగించడమే ప్రజ్ఞగా భావిస్తారు. ఇది భావం యొక్క రూపం. కానీ కృష్ణమూర్తి ప్రజ్ఞను భావం కంటె భిన్నమైనదిగా భావిస్తారు. ప్రజ్ఞ మనోభావమూ కాదు, హేతువాదనా కాదు లేదా విశ్లేషణాశక్తీకాదు. అది సంఘర్షణ, సంభ్రమానికి (Confusion) సంబంధించని అప్రయత్నమైన (Effortless) అవగాహన. ఇచ్ఛాపూర్వకమైన ప్రయత్నమున్నచోట, బలవంతమైన ఆలోచన ఉన్నచోట అవగాహనకు తావు లేదు. అవగాహన లేనిచోట ప్రజ్ఞ లేదు. ప్రజ్ఞ సాక్షాత్, ప్రత్యక్ష (Direct) అవగాహన, ప్రజ్ఞ గల వ్యక్తే జ్ఞాని. ప్రజ్ఞే ప్రత్యక్ష జ్ఞానం.

మనసును నిత్యం వివిధ విషయాలకు సంబంధించిన సమాచారంతో (Information facts and figures) నింపటం వల్ల ప్రజ్ఞ వృద్ధి చెందదు. వివిధ

అంశాలకు సంబంధమైన సమాచారం మనసును బరువైనదిగా చేస్తుంది. విద్యాపరమైన శిక్షణ, అభ్యసనం నేర్చుకోవటం, జీవమునకు మూలమైన వాస్తవికతను అవగాహన చేసుకోవటానికి ఏమాత్రం దోహదం చేయదు. అలాంటి అభ్యసనం, శిక్షణ వ్యక్తికి మంచి హోదా, కీర్తి భౌతిక సంపద ఇవ్వవచ్చు. కానీ అది ప్రజ్ఞను, ప్రేమను, శాంతిని సౌఖ్యాన్ని ఇవ్వదు.

సరళంగా ఉండటమంటే మనసును ఏ భావాలకు, సిద్ధాంతాలకు, ఏ ప్రత్యేకమైన ఆచరణ మార్గాలకు బంధీ చేయకుండా జీవించగలగటం. కోరికలకు, వికారాలకు, వ్యాకులతకు బంధీ అయిన మనసు ప్రజ్ఞకు ఆలవాలం కానేరదు. ఉన్నతమైన మేధాసంపత్తే ప్రజ్ఞ అనుకోవటం పొరపాటు. ప్రజ్ఞకు ఆలవాలమైన వివాదాలను, విద్వేషాలను ఎరుగదు. సామరస్యం, శాంతి, చీకటి మరకలెరుగని వెలుగే ప్రజ్ఞ ప్రధాన లక్షణాలు. అవిచ్ఛిన్నమైన మానసిక శక్తి, స్థైర్యం, అనిర్వచనీయమైన శాంతి ప్రజ్ఞావంతుల లక్షణాలు. ఈ శక్తులు కల్గిన మనస్సు అహంకార శృంఖలాలనుండి విముక్తమవుతుంది. 'నేను', 'నాది' అనే భావాలు ఉండనే ఉండవు. ప్రజ్ఞాశీలురు అంతటా ఏకత్వాన్ని దర్శిస్తారు. వారి జీవితాలు ప్రేమతోను, సరళతతోనూ, అణకువతోనూ తొణికిసలాడతాయి.

## జీవితం

మానవ జీవితం అంటే సంబంధం (Relation). జీవించటమంటే సంబంధ బాంధవ్యాలను అనుభవించటం, మానవులకు తోటివారితోనూ, పరిసరాలలోని ప్రాణులతోనూ, ప్రకృతితోనూ, భావాలతోను సంబంధం ఉంటుంది. ఈ విషయాన్ని మనమెవరమూ విస్మరించకూడదంటాడు కృష్ణమూర్తి. జీవితం నది లాంటిది. అది అనంతంగా ప్రవహిస్తూనే ఉంటుంది. ఎప్పుడూ అన్వేషిస్తూ, శోధిస్తూ ముందుకు తోసుకుంటూ, గట్లపైకి పొర్లుతూ అటునిటూ పయనిస్తూనే ఉంటుంది. కానీ దానిని మనం సాఫీగా సాగనివ్వం. ప్రతివారు వారికోసం ఒక చిన్న నీళ్ళగుంటను తవ్వుకుంటాం. ఆ చిన్న గుంటను చూచే మనం ప్రతి ఒక్కరు దాన్ని మన జీవితం

అనుకుంటున్నాం. అసలు ప్రవాహాన్ని విస్మరించాం. ఆ మహా ప్రవాహానికి భద్రత (Security), విరామస్థలం ఉండవు, కానీ ప్రతివారు తమ పరిధిలో - హోదా, ఆస్తులు, అంతస్తులు, జీవితాన్ని భద్రంగా చూచుకోవటానికి అహర్నిశలూ శ్రమిస్తున్నారు. ఏదీ శాశ్వతం కాదని తెలిసి కూడా ప్రతివారు శాశ్వతత్వం కోసం ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఈ శాశ్వతత్వం అనే విశ్వాసం, సూత్రంపైన ఆధారపడి మానవాళి తరతరాలుగా ఎన్నో సామాజిక, సాంస్కృతిక, మత, రాజకీయ సంస్థలను సృష్టిస్తున్నాం. శాశ్వతత్వం దేనికోసం? సుఖం కోసం, పేరు, ప్రతిష్టలు, గౌరవం కలకాలం నిలవాలనే వాంఛతో, మనం మన సంతతి ద్వారా, ఆస్తిపాస్తులద్వారా పేరు ప్రఖ్యాతులు కొనసాగాలని కోరుకుంటాం. అంటే మనకి మనంగా నిర్మించుకున్న చిన్న నీటిగుంటలో శాశ్వతమైన జీవితాన్ని కోరుకుంటున్నాం. ఈ జీవితాన్ని శాశ్వతమైనదిగా చేసుకోవటానికై సమాజాన్ని నిర్మించుకున్నాం.

మనం మన జీవితమనే చిన్న గుంట తవ్వుకొని మన చుట్టూ మన కుటుంబాలూ, మన ఆంక్షలూ, మన సంస్కృతులూ, మన భయాలూ, మన దేవుళ్ళూ, ఆరాధనా పద్ధతులూ అనే కంచెలను నిర్మించుకుని అక్కడే మరణిస్తాం. ఎన్నడూ ఆద్యంతాలెరుగని జీవిత ప్రవాహాన్నే మనం పట్టించుకోం. ఈ చిన్న నీటిగుంటే అసలు జీవితం అనుకుంటూ మోహాన్ని (Infatuation) ప్రేమగా ఎంచుకుంటూ జీవితాన్ని గడిపేస్తున్నామంటాడు. అద్భుతమైన శక్తితో, వేగంగా నిత్య నూతనత్వంతో గంభీరంగా నిరంతరం ప్రవహించే జీవితాన్ని మనం లెక్కచేయం. ఈ మహాప్రపంచానికి ఆవలగా శాశ్వతత్వాన్ని కోరుకునే మనస్సు చిన్న నిలవ నీటిగుంటలాంటిది కాబట్టి త్వరలో కలుషితమైపోతుంది. అయినా దీనినే ఎన్నో మతపరమైన క్రతువులతో, దైవారాధనా పద్ధతులతో శుద్ధి చేయటానికి ప్రయత్నిస్తాం. కానీ నిర్విరామంగా ప్రవహించే నదీ ప్రవాహం మాత్రం ఏ అడ్డు గోడలను, కాలం అవధులనూ లెక్కచేయక, మనం శాశ్వతమనుకొనే నామరూపాలను మించి ముందుకు సాగుతూనే ఉంది.

మన మనసు ఎన్నో స్మృతులకు, అనుభవాలకు ఆలవాలం. ఎన్నో గ్రంథాలను పఠిస్తున్నాం. ఎన్నో విషయాలను జ్ఞాపకముంచుకుంటున్నాం. ఈ జ్ఞావకాల రంగుటద్దాలలోంచి జీవితాన్ని చూస్తున్నాం. మన కోరికలకనుగుణంగా మన జీవితాన్ని మలచుకోవటానికి ఆరాటపడుతున్నాం. ప్రతి విషయంలో భద్రత కోసమై సంఘర్షణలకు లోనవుతూనే ఉన్నాం. ఈ కారణంగా ద్వంద్వాలతో నిండిన మన మనసుకు జీవితం నిజస్వరూపం అవగాహన కావటం లేదు. మనస్సు నిత్యం తనను తాను తెలుసుకుంటూ, గతానికి, భవిష్యత్తుకు అతీతంగా, భద్రతకోసమై అర్రులు చాచకుండా ఉండే అసాధారణమైన మనస్సే మానవజీవితం. అదే సృజనాత్మకమైన మనస్సు. అదే సృజనాత్మకమైన జీవితం. ఎటువంటి అవధులూ అడ్డుగోడలూ లేకుండా జీవితాన్ని అర్థం చేసుకోవటంలోనే అమితమైన అందం, ఆనందం వున్నాయి. అదే ప్రేమ. "మీ హృదయంలో అదే లేకుంటే మీ మంచితనం వికసించదు" మంచితనం, అందం, ప్రేమ అవిభాజ్యాలు. అంతర్గతంగా స్వేచ్ఛలేనిదే బాహ్యమైనది అందంగా ఉండటం సాధ్యం కాదు. ఒక మనిషిలో ప్రేమ ఉంటే ఆ మనిషి ముఖం ముచ్చటగా, అందంగా ఉంటుంది. అందులో విశిష్టమైన కాంతి ఉంటుంది. మన హృదయంలో అద్భుతమైన ప్రేమ ఉన్నప్పుడు, దాని ప్రగాఢతను దానిలోని ఆహ్లాదాన్నీ, పారవశ్యాన్నీ అనుభూతి చెందిన మరుక్షణం ప్రపంచం పూర్తిగా మారిపోతుంది. మన హృదయాల్లో ప్రేమ లేకుండా, ఆహ్లాదం లేకుండా ప్రపంచంలో అందం ఉండదు.

## ప్రేమ

ప్రేమ కేవలం ఒక అనుబంధం. ఒక అనురాగ భావం కాదు. ఒక మనోభావాన్ని మాటల్లో వ్యక్తం చేయటం కాదంటారు కృష్ణమూర్తి.

కరుణ లేనప్పుడు ప్రేమ ఉండదు, ప్రేమ, కనికరం, ఔదార్యం ఉండవు. స్వలాభాపేక్ష లేకుండా మనం ఉండటం జరగదు. అందుకే మనలో ప్రేమ ఉండదు. మనస్సుకి సంబంధించిన ఏ విషయంతోనూ హృదయాన్ని నింపకుండా ఉన్నప్పుడే ప్రేమ ఉంటుందంటారు కృష్ణమూర్తి. అలాంటి ప్రేమ

ఒక్కటే ఈ ప్రపంచంలో ఉద్రిక్తతనీ, ఉన్మాదాన్నీ, వైషమ్యాలను మార్చగలదు. అంతే తప్ప సిద్ధాంతాలు, వాగ్వివాదాలు కావు. అందరిపట్ల ఆధరభావమే అన్ని సుగుణాలకి, విలువలకి మూలం. ప్రేమ ఆలోచనకి అతీతమైనది. అది రేయింబవళ్ళు కృషి చేస్తే లభించేది కాదు. సాధనవల్ల సమకూరేది కాదు. మానసిక ప్రక్రియలు ఆగిపోయినప్పుడే ప్రేమ ఉద్భవిస్తుంది. నిజమైన ప్రేమకు భావపరమైన, మతపరమైన ఎల్లలు, కొలమానాలు ఉండవు. అలాంటి ప్రేమ సమస్యలన్నిటికీ పరిష్కారమార్గం. ప్రేమించాలంటే ఎదుటివారు ఎలాంటి వారైనా వారి లోపాలను పట్టించుకోకుండా ప్రేమించగలగాలి. ప్రేమించబడాలంటే కోపం, అసూయ, దురాశ, గర్వం మొదలైన లక్షణాలు లేకుండా ఉండాలి. మన ప్రవర్తన దయ, సానుభూతి, ఔదార్యం, స్నేహానికి ప్రతీకగా నిలవాలి. లాభనష్టాలను బేరీజు వేసుకుంటూ మనస్సులో రంగరించే ప్రేమ ప్రేమకాదు. అది వ్యాపారం అంటాడు కృష్ణమూర్తి. మనస్సు ప్రతిదాన్నీ సమయం, స్థలం, దూరం, దుఃఖం మూసలలో పోసి, విశ్లేషించి ఆలోచిస్తుంది. విభజించి ఆలోచించే చోట ప్రేమ లేదు. ఆలోచనా ప్రక్రియ ఆగిపోయినప్పుడే ప్రేమ ఉద్భవిస్తుంది. ఆలోచన ప్రేమకి పెద్ద అవరోధం. అది ప్రేమకు ధారితీయదు. ప్రేమను వృద్ధి చేసుకోవాలి అన్న కోరికసైతం ఆలోచనా ప్రక్రియ ఫలితమే. ప్రేమను గురించి మనమిచ్చే నిర్వచనాలు, వర్ణనలు ప్రేమ కాదు. అవి ఆలోచనల వ్యక్తీకరణాలు. ఆలోచన ప్రాముఖ్యాన్ని పూర్తిగా అర్థం చేసుకున్నప్పుడే ఆలోచన నుండి స్వేచ్ఛ లభిస్తుంది. అందుకు అపారమైన జ్ఞానంఅవసరం. ప్రేమకు స్వేచ్ఛనివ్వాలి. అంటే ముందు ఆలోచనా శృంఖలాలనుండి విముక్తులం కావాలి. "నేను విముక్తుణ్ణి కావాలి, నాకు స్వేచ్ఛ కావాలి' అని తపన చెందే వ్యక్తికి స్వేచ్ఛ రాదు, ప్రేమ తెలియదు. ప్రేమను మన మనస్సులలో బంధించి, అది మనం చెప్పిన పద్ధతి ప్రకారం నడవాలనుకుంటాం. దానికి స్వేచ్ఛనివ్వం. మనం మనస్సులతో చాలా కాలిక్యులేటెడ్‌గా ప్రేమిస్తాం. ఎక్కడైతే కాల్‌క్యులేషన్ ఉంటుందో అక్కడ వ్యాపారం ఉంటుంది. ప్రేమ హృదయానికి సంబంధించింది. మన

హృదయాన్ని మనస్సుకు సంబంధించిన వాటితో నింపి, హృదయాన్ని ఎప్పటికీ శూన్యంగానే ఉంచుతాం. ఈ కారణంగానే మన చిరునవ్వులతో, ఆప్యాయతలతో, దరహాసంలో ప్రేమ అనే జీవం ఉండదు. హృదయం ఎరుగని మన ప్రేమ మనల్ని నటులుగానే మిగులుస్తుంది.

ప్రేమించడానికి ఎటువంటి నిర్దిష్టమైన పద్ధతి, ప్రణాళిక లేదని తెలుసుకోవటమే మన అసలు సమస్య. ప్రేమను గురించి ఎన్నో అభిప్రాయాలుంటాయి. ప్రేమను గురించి ఎంతో విజ్ఞానాన్ని సంపాదించాం. అయినా ప్రేమ ఏమిటో మనకి తెలిసిరాలేదు. ఎందుకంటే మన అవగాహనంతా నిర్వచనాలకు, వర్ణనలకే పరిమితమయింది. కాబట్టి సత్యాన్ని (నిజాన్ని) తెలుసుకోవాలంటే మాటను పట్టుకుని ఉండటం, బుద్ధిని ఉపయోగించడం కాదు. సత్యాన్ని గురించిన సమాచారం, విస్తృతమైన వివరణ 'సత్యం' కాదు. అట్లాగే ప్రేమను గురించిన వివరణలు ప్రేమకాదు. మనిషి అంటే కేవలం శరీరమే కాదు. ప్రాణం, ప్రాణంలేని శరీరం కట్టె మాత్రమే. 'ప్రేమించడం అంటే పవిత్రంగా, పరిశుద్ధంగా, నీతిగా ఉండటం', మనవిద్య, వ్యాసంగాలు, హృదయంనుండి ఉద్భవించే అనురాగం అలాటి నిష్కళంకమైన ప్రేమను ఆవిష్కరింపచేస్తుంది.

## విద్య

విద్య సంపూర్ణ జీవనానికి, నవచైతన్యానికి, వినూత్నమైన మేల్కొలుపుకి విద్య మనసులోని లోతులను వెలికితీస్తుంది. సృజనాత్మక శక్తులను ఆవిష్కరింపచేస్తుంది. విద్య అడ్డుగోడలు ఎరుగని జీవితాన్ని అనుభవించడానికి దోహదం చేయాలి. ఆత్మ జ్ఞానమే విద్య (Self knowledge is education) పాక్షికమైన దృక్పథాలు, ప్రత్యేకమైన భావాలు సంకుచితమైన పర్యవసానాలకు దారితీస్తాయి. సరియైన విద్య వ్యక్తికి తగిన సంవేదనీయత (Sensitivety) నిస్తుంది. అభ్యసనం (Learning) విద్యలోని అంతర్భాగం. ఒక విషయాన్ని చాలా ప్రత్యేకంగా, విశేషంగా పరిశోధించడం, ఎన్నో విషయాలను వివరంగా తెలుసుకోవటమనేది అభ్యసనంలోని

ప్రముఖమైన, విశిష్టమైన భాగాలు కావు. వీటికంటె మించి సృజనాత్మకత భావనాశక్తి, సంపూర్ణమైన అవగాహన అంకితభావం అనేవి సాధకుని ముఖ్య లక్షణాలు. విద్య అంటే సామాన్యంగా ఇంద్రియాలకు తగిన శిక్షణ ఇవ్వటం, మేధాసంపత్తిని పెంచటం, కొన్ని నైపుణ్యాలను (Skills) సంపాదించటం అనుకుంటాం. ఈ పరిమితమైన పరిధి కృష్ణమూర్తి ఆలోచనలకు చాలా దూరంగా ఉంటుంది.

విద్య పరమార్ధం విద్యార్థిలో విడివిడి ముక్కలు, అతుకులు ఎరుగని జీవితం(Non fragmented living) పట్ల అవగాహన కలిగించటం. విద్యను గరిపే ఆచార్యుడే అలాంటి జీవితాన్ని గడపాలి. విద్యావ్యాసంగంలో నిమగ్నమైన గురు, శిష్యులు ఒక వినూత్న పరివర్తన ప్రక్రియకు లోనవుతూ ఉంటారు. ఎలాంటి బంధాలు బంధీకాని మనస్సే, మనస్సు యొక్క ప్రతి కదలికను, జీవితం యొక్క ప్రతి అంశాన్ని అర్థం చేసుకోగలదు. అభ్యసనం అనేది ఎలాంటి రాగద్వేషాలతో బంధింపబడనప్పుడే మనలో పరివర్తన తీసుకురాగలదు. అభ్యసనం (Learning) నిత్యం సాఫీగా కొనసాగే శోధన. అభ్యసనం ఎప్పుడైతే కొన్ని లక్ష్యాలతో, గమ్యాలతో నిర్దేశింపబడుతుందో అప్పుడు దానిలో జీవం మరుగున పడుతుంది.

విద్య తత్సబంధిత శిక్షణ అభ్యసనం స్వచ్ఛందంగా ఉపాధ్యాయులలోనూ, విద్యార్థుల లోనూ మానసిక విప్లవం (Psyc) తీసుకురావాలి. నేడు ప్రపంచంలో నానాటికీ పెరిగిపోతున్న హింస, అత్యాచారాలు మానవాళి మనుగడకే గడ్డు సమస్యగా తయారైనాయి. అందుచేత విద్యావ్యాసంగం అందరిలోనూ మానసిక విప్లవం తీసుకురావాలి. విద్య తనను గురించిన జ్ఞానానికి మూలభూతమవ్వాలి. తన మనస్సు ఏ విధంగా సంచరిస్తోంది. నిరంతరం ఆవిర్భవించే భావాలు అనుభూతులు ఏ విధంగా సాగుతున్నాయి. అవి ఏ విధమైన ప్రభావాలకు లోనవుతున్నాయి అనే జ్ఞానాన్ని విద్య మనకు ఇవ్వాలి. విద్య పరమార్థం ఇలాంటి ప్రజ్ఞను (Intelligence) అవగాహనను (Understanding) ఇవ్వటమే. మనం సమకూర్చుకునే విజ్ఞానం మన

మనస్సును గురించిన అనుభూతులు, ఇచ్ఛ, వాంఛ మొదలైనవి, సమగ్రజ్ఞానం ఇవ్వనందువల్లనే నేడు ప్రపంచం అశాంతి, దుఃఖం, అసూయ, ద్వేషాలతో అలమటిస్తోంది. మనం అనుభవించే జీవితం, అభ్యసించే విద్య రెండూ వేరు కారాదు. రెండూ వేరైనప్పుడు అన్ని అనర్థాలు సంభవిస్తాయి. విద్యను కేవలం జీవనోపాధి సముపార్జనకే అభ్యసించినప్పుడు అది జీవితంయొక్క సమగ్ర స్వరూపాన్ని మనకివ్వలేదు. నేడు శాస్త్ర, సాంకేతికరంగాలలో ప్రగతిని సాధిస్తున్నాం. కాని దారిద్ర్యం, హింస, శోకం, సంఘర్షణలు, వైషమ్యాలు మాత్రం మనలను పట్టి పీడిస్తూనే ఉన్నాయి. దీనికి కారణం విద్య ఇచ్చే వెలుగు మన నిత్యజీవితాల్లో లోపించటమే.

ప్రపంచంలో నలుమూలలా నేడున్న విద్యావిధానం ప్రతివారి మనస్సును ఎన్నో విషయాలను గురించిన సమాచారంతో నింపుతుందే గానీ, వారిలో వారిని గురించిన సమగ్రమైన జ్ఞానాన్ని ఇవ్వటం లేదు. ఈ కారణంగా ప్రతివారు యంత్రాల్లాగా పనిచేస్తూ పరుగెత్తుతున్నారు. అభ్యసించే విద్య మన మనస్సులలో నిద్రాణంగా ఉంటున్న హేతువులను, దృక్పథాలను నిశితంగా అర్థం చేసుకునేశక్తినివ్వాలి ఇలాంటి శక్తి చాలా సహజంగా, అప్రయత్నంగానే మనకు అబ్బాలి. సమస్యలను ప్రతిదాన్నీ ఎన్నో ఖండాలుగా విభజించి విశ్లేషించడం, ఆ విశ్లేషణే జ్ఞానం అనుకోవటం అవిద్య. వీనినే కృష్ణమూర్తి సమగ్రమైన అవగాహన లేకపోవటం (Utterlack of comprehension) అంటారు. నేటి విద్యావిధానం ఎన్నో తరగతులైన నైపుణ్యాలకు, ఉత్పత్తులను బాగా పెంచేందుకు కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానానికి అవసరానికి మించిన ప్రాధాన్యతనిస్తోంది. ఈ రకమైన స్పెషలైజేషన్ సమగ్రమైన దృష్టినీయడం లేదు. ప్రతి రంగంలో నిరంతరం అధికమయ్యే స్పెషలైజేషన్ విద్యాధికులను సైతం సంకుచిత ధోరణులకు బానిసలుగా చేస్తోంది. మనిషి తనతోటి వారిని గురించి పట్టించుకోవటమే మానేశాడు. పరుగుపందెంలో పాల్గొనే క్రీడాకారులు మిగతావారిని పట్టించుకోకుండా గెలుపే ధ్యేయంగా పరుగెత్తుతున్నట్లు, నేటి విద్యావిధానం ప్రతివారిని తను రంగంలో ముందుకు దూసుకుపోయే రాకెట్‌లాగా తయారుచేస్తోంది. నేటి విద్యావిధానం వివిధ

స్థాయిలలోని విద్యార్థులను, ఉన్న పరిస్థితులను అంగీకరిస్తూ, వాటిని అర్థం చేసుకోవటానికి పరిష్కారానికి సామూహికంగా తయారుచేసిన మార్గాలను, నమూనాలను అనుసరించేటట్లు బలవంతం చేస్తోంది. బలవంతం (Force) చేసే విద్య విద్య కాదు. విద్య అనేది మనలోని సృజనాత్మకశక్తుల ఆవిష్కరణలో అంతర్భాగం కావాలి.

విద్యా వ్యాసంగంలో క్రమ శిక్షణకు (Discipline) అత్యధిక ప్రాధాన్యతనీయడం జరుగుతోంది. ఇలాంటి క్రమశిక్షణ మానసిక బానిసత్వానికి (Mental slavery) దోహదం చేస్తుందేగానీ, వ్యక్తివికాసానికి, ఆత్మజ్ఞానానికి దారితీయటం లేదు. అంటే స్వేచ్ఛను సమగ్రతను గ్రహించేటట్లు చేయటం, స్వేచ్ఛ సమగ్రతలను అర్థం చేసుకుని విద్య గరపటం ఎన్ని విషయాలను కంఠస్థం చేసిన ఎంత విద్య నేర్చినా విద్య యొక్క సారాన్ని గ్రహించనట్లే. సంఘంలో మౌలికమైన మార్పు. నామరూపాలెరుగని చైతన్యం రావాలి అంటే వ్యక్తుల మనస్సుల్లో చీకటి జాడలెరుగని వెలుగు ఉద్భవించాలి. మనస్సు అన్ని కోణాలను, అంతర శక్తులను గ్రహించగల్గేట్లు చేసే స్వేచ్ఛ, భయం ఆందోళన నుండి విముక్తి చేసే విద్యే అన్నిటికీ మూలమంటాడు కృష్ణమూర్తి. దీన్ని వారు 'inward revolution' అంటారు. విద్య పరమార్థం ప్రజ్ఞను జనింపచేయటం. ఈ ప్రజ్ఞ వ్యక్తి మనస్సు, హృదయం సమగ్ర నిరవధిక కార్యాచరణలో ప్రతిఫలిస్తుంది. వ్యక్తి మాట, ప్రవర్తన విద్య ఇచ్చే ప్రజ్ఞకు ప్రతీకకావాలి. విద్య మనలను భయం, భద్రత (Fear and Security)అనే విషవలయం నుంచి ముక్తుల్ని చేయాలి. విద్య సారం మన హృదయాలను, మనస్సులను ఆవరించినప్పుడు భయానికి, ఆందోళనకు తావుండదు.

విద్య ప్రతివ్యక్తిని సంపూర్ణ మానవునిగా తీర్చి దిద్దాలి. సంపూర్ణ మానవుడు తన అంతరప్రవృత్తులను, భావాలను, అనుభూతులను ఎలాంటి ఆరళ్ళకు లొంగని మనస్సుచే శోధించగలుగుతాడు. మనసా వాచా కర్మణాఅలాంటి వ్యక్తి ఉదాత్తుడిగా ఉండగలుగుతాడు. ఉదాత్తతకు, మంచితనానికి కుల, మత, కాల, ప్రాంతీయ లక్షణాలు గానీ, బ్రాండ్

గానీ, హద్దులు గానీ లేవు. ఇలాంటి హద్దులు, లక్షణాలు, విద్య పరమార్థానికి మనం కల్పించే గ్రహణాలు. సరియైన విద్య శాస్త్రీయ, సాంకేతిక పరమైన శ్రేష్ఠతను (Excellence) సాధించడానికి, మనసులలో, హృదయాలలో కూడా సామరస్యాన్ని, శాంతిని అనుభవించడానికి తగిన (సమానమైన) ప్రాముఖ్యాన్ని ఇస్తుంది. వ్యక్తి అంతరంగంలో శాంతి, స్పష్టత, ఒక క్రమం ఉన్నప్పుడే సంఘంలో శాంతి సౌఖ్యాలుంటాయి. మనం నేర్చుకునే పాఠ్యాంశాలు జీవితాన్ని ఎలాంటి రంగుటద్దాలనుంచే కాక, సూటిగా, స్పష్టంగా సమగ్రంగా చూడగలిగిన శక్తిని ఇవ్వాలి. జీవితాన్ని సూటిగా చూడలేనప్పుడు వ్యక్తి ప్రతి రంగంలోనూ తాను నమ్మే అధికారానికి బానిసగా మిగులుతాడు.

కృష్ణమూర్తి తమ ప్రసంగాల్లో తరచూ "జీవితాన్ని అర్థం చేసుకోవటం అన్నిటికంటె ముఖ్యం అంటారు. పరీక్షల్లో ఉత్తీర్ణులవటం, గణితం, భౌతికశాస్త్రం మొదలైనవాటిల్లో నైపుణ్యం సంపాదించటం దానితరువాతే' అంటూ ఉండేవారు. విద్యార్థులు, యువకులు అడిగే ప్రశ్నలు ఎంతో సహనంతో, ప్రేమతో సమాధానాలిచ్చేవారు. మనం అభ్యసించే విద్య మన మనస్సులో మౌలికమైన మార్పు తీసుకురావాలి. ప్రతిమార్పు మానవాళి శాంతి, సౌఖ్యాలకు దోహదం చేయాలి. మత, జాతి విద్వేషాలు లేని ప్రపంచాన్ని మనం సృష్టించుకోగలగాలి.

మనం ఎటు చూసినా ప్రపంచంలో అల్లకల్లోలం, సంఘర్షణలూ – ఏ ఒక్కరికీ, ఏప్రాంతంలోనైనా శాంతి, భద్రత లేకపోవడం, క్షణ క్షణం, అనుక్షణం ఆందోళనలతో నిండిపోయిన నిత్య జీవితం – ఈ క్లిష్ట పరిస్థితుల్లో నివసిస్తున్న మనకు కావలసింది మనశ్శాంతి, అశాంతికి మనిషి మనస్సే మూలకారణం అంటారు కృష్ణమూర్తి. మనస్సునూ, ఆలోచనలనూ అనాసక్తంగా పరిశీలించడంలో స్వేచ్ఛ లభిస్తుందనీ, ఒక అపూర్వమైన తీరులో బోధించారు కృష్ణమూర్తి.

ధ్యానం : ధ్యానం అనేది మనస్సును మలినాల నుంచి పూర్తిగా విముక్తం చేసే ప్రక్రియ. మనస్సును శుద్ధి చేయడానికి సరైన ధ్యానం అవసరమంటారు

కృష్ణమూర్తి. చాలాకాలం ధ్యాన సాధన చేశారు. ఈ విషయంలో ఎన్నో పుస్తకాలు చదివిన తరువాత ఓ మఠానికి వెళ్ళి అక్కడ రోజుకు కొన్ని గంటలు ధ్యానం చేసేవాళ్ళను చూసిన తరవాత కృష్ణమూర్తి కూడా కొన్ని క్రమశిక్షణలను అవలంభించారు. అయితే కృష్ణమూర్తి ధ్యానాన్ని గూర్చి ఎలా విశదీకరించారో తెలుసుకుందాం.

కృష్ణమూర్తి తత్త్వవేత్తగా, దివ్యజ్ఞానవేత్తగా విఖ్యాతి పొందిన అద్భుతమైన వ్యక్తి. ఆయన ప్రభోదించిన ధ్యానం "ఏకాగ్రత" "జాగరూకత" ల మధ్య విభేదాన్ని చూపుతూ సాగుతుంది. "జ్ఞాత", 'జ్ఞానం" మధ్య తేడాను కూడా తొలగిస్తుంది. ఆలోచనలకు ఒక అంతాన్ని చూపడమే ధ్యానం అని ఈయన అభిప్రాయం. మనస్సు స్థిరంగా ఉన్నప్పుడు ధ్యాన ప్రవాహం కొనసాగుతుందని ఆయన అభిప్రాయం.

## ధ్యాన విధానం

పారమార్థికోన్నతికోసం ధ్యానం చేసే అన్వేషికుల అవగాహనకు అందకుండా పోతుంది. సమాజం నుంచి బాహ్యంగా నిర్ణయాలు చేయాలన్న కృష్ణమూర్తిగారి ఉద్దేశం వ్యక్తిగత స్వేచ్ఛా ఆలోచనల పట్ల విశ్వాసం కనబరచడమే. ధ్యానం ద్వారా మనసు వేటాడే ప్రశ్నలకు సంతృప్తికరమైన సమాధానాలు మనసు కేంద్రీకరణ ద్వారా మహత్తరమైన వివరణలు పొందే సామర్థ్యం కలుగుతుంది. కేంద్రీకరణ ద్వారా మహత్తరమైన వివరణలు పొందే సామర్థ్యం కలుగుతుంది. ఈ ఆలోచనా ప్రక్రియనే కృష్ణమూర్తిగారు విశ్వసించారు. దీనవల్లే ఆయనకు గతిశీల చింతనా పరుడనే పేరు వచ్చింది. 'ఆలోచనాసామర్థ్యం లేని తలకాయ ఉండి వృథా, విచారణ లేని జీవితం జీవించడం వృథా, "ధ్యానం లేని హృదయం ఎడారిగా మారుతుందని, బంజరుభూమి అయిపోతుందని" అన్నవారి మాటలు ఎల్లవేళలా ధ్యానం దేనిగురించి చేయాలన్న ప్రశ్న ఈ సందర్భంలో తలెత్తుతుంది. దానికి కృష్ణమూర్తిగారు ఈ విధంగా సమాధానం ఇస్తారు.

"సత్యానికి మార్గం ఉండదు. సత్యాన్ని అన్వేషించాలి. కాని దానికి ఏ విధమైన సూత్రం ఉండదు. ఏది సూత్రీకరించినా అది వాస్తవం కాదు. మీరు నియమరహిత సంద్రాన్ని నియంత్రించాలి. ఆ నియమరహిత సంద్రమే మీరు. మిమ్మల్ని మీరు అన్వేషించుకొనేందుకు ఉద్యమించాలి. అయితే దానికో పద్ధతి, నియతి ఉండదు. వారికి అన్వేషణే అంతు పట్టదు.

ఏదైనా అంశం మీద ధ్యానం నిలపాలన్నా లేదా సారాంశాన్వేషణ చేయాలన్నా లేదా దాని సత్యం శోధించాలన్నా ఆ నియంత్రిత మనసుతో చేయాలని కృష్ణమూర్తిగారి అభిప్రాయం. ఇతరుల అనుభవాలను పోగుచేసిన వివరాలను విశ్వసించకూడదని, అవి అసంతృప్తికరంగా వైవిధ్యంతో కూడినవిగా ఉంటాయని వారి వాదన. సరైన ధ్యానం మానసిక ప్రాయశ్చిత్తానికి అవసరం. మనసును ఖాళీ చేయకుండా ఎటువంటి పునర్నవీకరణ జరగదు. అట్లా ఉండిపోతే నాశనమే. నిరంతర పునరావృతివల్ల మనసు చెదరిపోతూ ఉంటుందని కృష్ణమూర్తిగారి అభిప్రాయం.

కొంతమంది దైవాన్ని ధ్యానిస్తూ, దైవం ఒక భావనగా లేదా ఆలోచనగా దృగ్విషయ ప్రపంచంలోని ఇతర భావనలతో సమంగా భావిస్తారు. దైవాన్ని ఒక ఆలోచనగా పరిగణించకూడదు. వారి సహజ స్వభావం తెలుసుకోకుండా ధ్యానిస్తూ దాదాపు తెలిసిన అంశాన్నే తెలుసుకోలేకుండా పోతున్నారు. అందువల్లే వేర్వేరు వ్యక్తులకు దైవం పట్ల వేర్వేరు అభిప్రాయాలు ఉంటున్నాయి. అటువంటి వ్యక్తుల అభిప్రాయాలను గ్రహించి లేదా వారి భావాలను గ్రహించడం హేతుబద్ధమైన చర్య కాదు. వారి ఆలోచనా సరళిని అంచనా వేయడమే అసలు పొరపాటు. వారు చెబుతున్నది, అనుభవించామని వివరించేది వారి ఊహ మాత్రమే. ఒక్కోసారి పాక్షిక సత్యం కావచ్చు కాని పరిపూర్ణ సత్యం కాదు.

"తెలుసుకోవాలని కోరుకుంటున్నప్పుడు తెలుసుకొనేది ఆత్మవిక్షేపం. అదే మీరు కోరుకుంటున్నది. కోరిక సృజన అనేది వాస్తవం కాదు. సత్యాన్ని కోరుకుంటే తిరస్కరించాలి. సత్యానికిస్థిరమైన అవధి ఉండదు. మార్గదర్శకత్వం ఉండదు. మాట వాస్తవం కాదు".

ఇవన్నీ వివరించడం కృష్ణమూర్తిగారు "వాదం" విశ్వసించరని కాదు. వ్యక్తి సిద్ధాంతాల్ని లేదా తత్వాన్ని లేదా ఒక ప్రత్యేక గ్రంథాన్ని గుడ్డిగా విశ్వసించకూడదని కృష్ణమూర్తిగారి అభిప్రాయం. ఇతరుల ఆలోచనల పట్ల, చర్యల పట్ల విశ్వాసం ఏర్పరచుకుంటే వారిని అధికారికంగా భావించి, సాధికారికంగా భావించి ఉంటారు. అంటే స్వతంత్ర ఆలోచన, విచారం కోల్పోతున్నారన్నమాట. స్వేచ్ఛను వదులుకుంటున్నారు. సృజనాత్మకత కోల్పోతూ ధ్యానంలో మునిగిపోతున్నారన్నమాట.

హేతుబద్ధమైన ఆలోచనకూడా సరైనది కాదని కృష్ణమూర్తి గారి భావన. ఎందుకంటే తన సొంత కారణంతో ఇతరులను ఒప్పించేందుకు పూనుకుంటారని అందువల్లే అవీ సరిపోవనీ అంటారు. ఆలోచన అంటే స్మృతి వ్యక్తీకరణ. ఆలోచన కూడా వేరవుతూ, భిన్నాభిప్రాయాల మధ్య సంబంధం సూచిస్తూ వైరుధ్యం, అయోమయం, ఆశ్చర్యం, విచారం, కష్టాన్ని కూడా ఫలితార్థంగా సూచిస్తూ ఉంటుంది.

## ధ్యానానికి పరిష్కారం

సత్యం, దైవం లేదా పరమం పూర్తిగా తెలుసుకోలేనిదై వ్యక్తి తన ఊహతో సంతృప్తి పడవలసిందేనా ? అన్న ప్రశ్నకు సొంత ధ్యాన విధానంతో ముందుకు సాగి విచారణ జరిపి, "అనియంత్రిత మనసు" ను అభివృద్ధి చేసుకోవాలని కృష్ణమూర్తి గారి సమాధానం. అప్రమత్తత, జాగరూకత కూడా అవసరమే. ఈ లక్షణాలతో మిమ్మల్ని మీరు అర్థం చేసుకోవచ్చు. నిరంతరం తనను తాను పరిశీలించుకోవాలి. తనమోసాలు, కపటాలు, ఈర్ష్యలు మొదలైనవి తెలియక లేదా తెలుసుకోలేక పోతే ఎలా ? అని ప్రశ్నిస్తూనే ఆత్మజ్ఞానం లేనప్పుడు అమాయకత్వంలో ఉంటాడని కృష్ణమూర్తిగారు సమాధానం చెప్పారు. అమాయకత్వం ఆవరించిన వ్యక్తికి తనను గురించి తనకు తెలియదు. ఇతరులు అనుసరించే సిద్ధాంతాలు, సూత్రాలు (వారి బుద్ధి ఏకాగ్రత తెలుసుకున్నవి). కంటకాలుగానే మారి కుంటివారికి నడక నేర్పినట్టుగానూ ఉంటుంది. అవన్నీ గుడ్డివాళ్లు చీకట్లో ఉంటే ఎవరో లాంతరు

దీపం అందించినట్లే అవుతుంది. అందుకే కృష్ణమూర్తి గారు ఆత్మ విచారం, ఆత్మ పరిశీలన భావనల మీద ఊనిక ఉంచారు. వ్యక్తిని తక్కువ అంచనా వేయడం సహించలేదు. ఒక సందర్భంలో ఇలా అన్నారు.

"అధికార ఆరాధనం పెద్దదైనా చిన్నదైనా చెడుదే. అది మతంలో మరింత చెడుపు చేస్తుంది.... తనకు ఏమీ తెలియదని తెలుసుకున్న వ్యక్తి: తనలో వైరుధ్యాలను తెలుసుకోగలడు. ఆత్మలో ఆచ్ఛాదితమైన విశ్వాసాలను, ఇంద్రియ వాంఛలను మాత్రమే తెలుసుకోగలడు."

ఒంటరిగా ధ్యానం చేయవచ్చని కృష్ణమూర్తిగారు హెచ్చరించారు. మనసు చెదిరితే అదుపులో ఉంచడం కష్టం. అదుపులో ఉంచి ధ్యానం చేస్తే పరమానందస్థితిని చేరుకుంటారు.

వ్యక్తిత్వాన్ని త్యాగం చేసినవారు, గురువు దగ్గర ఆత్మార్పణ చేసుకొన్నవారు తామేమిటో తాము తెలుసుకోలేరు. వారి వ్యక్తిత్వం వారికి తెలియదు. జీవిత విలువలు తురీయ వాస్తవాల జ్ఞానం తెలియదు. ధర్మబద్ధమైన జీవనం గడపడం శుభకరం, ప్రయోజనకరం.

కృష్ణమూర్తి ధ్యానం అంటే ఇదేనా అని పలుమార్లు పలుచోట్ల ప్రశ్నిస్తారు. అయితే ఆ ప్రశ్నల పరంపర క్రింది విధంగా వుంటుంది. సాధారణంగా నిఘంటువులో 'ధ్యానానికి' ఉన్న అర్థం ఆలోచించడం, పున: పున: చింతించటం, ఏకాగ్రంగా సమాలోచన చేయడం అన్నమాట. ఇంకా మెదడును అన్యత్రా కాకుండా నిలిపి ఉంచడం. ధ్యానమంటే ఇంతేనా అని వాపోతారు కృష్ణమూర్తి. ధ్యానం అంటే ఈ ప్రపంచానికి దూరంగా పారిపోవడమా? తన చుట్టూ తాను గిరి గీసుకుని, తనని ఏకాంతంగా చేసుకునే కార్యకలాపాలా? ప్రతిరోజూ కొంత సమయం.... గదిలోనే ఒక మూలన కూర్చొని పదినిమిషాల పాటు ప్రశాంతంగా కూర్చోవడం, ఏకాగ్రంగా ఏదో విషయాన్ని గురించి ఆలోచించడం ధ్యానమనబడుతుందా? లేదా ధ్యానం చేయడానికి ఏదో నియమిత కాలానికి కట్టుబడి కూర్చోవడమా ? లేదా ధ్యానం చేస్తే నిత్యం శాంతి నుంచి ప్రశాంత స్థితికి చేరుకొంటామా? లేదా

మరేదో స్థితికి చేరుకుంటుందనుకుంటున్నారా అని ప్రశ్నిస్తారు. ఒక చిత్తరువు ఒక అభిప్రాయం మీద మనస్సును నిలిపి ఉంచితే కనుక ఆ ధ్యానం పరిమితమే కాకుండా నియమబద్ధీకరించినట్లే అవుతుంది. అది యాంత్రికం కూడా అవుతుంది. ఒక విషయం మీద లగ్నం చేసి, ఆలోచన మరో విషయం మీదకు పోతుంది. అలా పోగూడదని చెప్పుకుంటారు. ధ్యానం చేశాక బయటకు వచ్చి నా ధ్యానం పూర్తయిందని అనుకుంటారు ధ్యాన సాధకులు. ఇలాంటి ధ్యానాన్నే గురువుల వద్ద సాధకులయిన శిష్యులు నేర్చుకుంటున్నారు. అయితే ఇదంతా ధ్యానం అనబడదంటారు కృష్ణమూర్తి. ఇదంతా సాధన క్రమంలో ఒక అంతస్తు మాత్రమేనని కృష్ణమూర్తి అభిప్రాయం. పరిపూర్ణంగా, నిశ్శబ్దంగా, మౌనంగా ఉండటం అనేది ధ్యానమనబడుతుంది. ధ్యానం అంటే సుఖాలను వెతుక్కోవడం కాదు. సంతోషాన్ని అన్వేషించడమూ కాదు. ఇది వాటికి విరుద్ధమైనదంటారు. ఇది ఒక మనోస్థితి, దానికి ఒక పద్ధతిగానీ, ఒక సూత్రంగానీ ఉండదు. కాబట్టి అక్కడ పరిపూర్ణమైన స్వేచ్ఛ ఉంటుంది. ఇంకా ధ్యానం అంటే మనసూ, హృదయమూ పూర్తిగా, సమూలంగా మార్పు చెందడం అనే అంతరార్థం కూడా ఉన్నదన్నదే, కృష్ణమూర్తి ఆలోచన.

## ధ్యానం ఎప్పుడు, ఎలాచేయాలి ?

ధ్యానం పదిమందిలో ఉన్నప్పుడు కానీ, మరొకరితో కాని, ఒక బృందంతో గాని కలిసి చేయకూడదంటారు కృష్ణమూర్తి. ఏకాంతంగా ఉన్నప్పుడే ధ్యానం చేయాలి. రాత్రిపూట అంతా ప్రశాంతంగా ఉన్నప్పుడు గానీ, నిశ్చలంగా ఉండే వేకువ వేళల్లో గానీ చేయాలంటారు. ఏకాంతంలో ధ్యానం చేస్తున్నప్పుడు అది ఏకాంతమే కావాలంటారు. ధ్యానసాధకుడు పూర్తిగా ఒంటరిగా అయిపోవాలట. ఒక విధనాన్ని గానీ, ఒక పద్ధతిని గానీ అనుసరించకూడదు. మాటలను జపం చేయకూడదంటారు కృష్ణమూర్తి.

## ధ్యానం వల్ల ప్రయోజనాలు

నియమ నిబంధనలు, భౌతిక వ్యాయామాలు, భంగిమలు, శ్వాస వ్యాయామాలు మొదలైనవి చెప్పడంకన్నా ధ్యానం వల్ల సరైన విధంగా ఆత్మవిచారం, ఆత్మ పరిశీలన చేసుకోవచ్చు.

ధ్యానం వల్ల వ్యక్తిగత బుద్ధి శక్తి పెరుగుతుంది. మూఢాలోచనల నుండి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లభిస్తాయి. ప్రతి సమస్యకు ఇదే పరిష్కారం అనేవారు గుడ్డిగా విశ్వసించేవారనే పేర్కొనాలి.

ధ్యానంవల్ల మనసుకు సముచిత ఏకాగ్రత పెరుగుతుంది. దానివల్ల ఒత్తిళ్లు, అపాయకర, వినాశకర అయోమయావస్థలు స్వేచ్ఛగా ఉండే ఆలోచనలకు అవకాశమిచ్చేలా మనసులో వైరుధ్యాలు తొలగిపోతాయి.

ధ్యానం సృజనాత్మకతను వృద్ధి చేస్తుంది. వ్యక్తి తను సాధించదలచుకున్నది సాధించగలడు. ధ్యాన సాధకుడిగా ( ముఖ్యంగా కృష్ణమూర్తి తత్వాన్ని పాటిస్తే) ఇది సాధ్యం. నెమ్మదిగా "తెలుసుకునేవారు, తెలుసుకోవలసింది" కి మధ్య అంతరం తొలగిపోతుంది.

చెడు అవకాశాల వినియోగం దుష్ఫలితాలను ఇస్తుంది. ధ్యానం వల్ల మన మనసు క్షాళనమవుతుంది. అప్పుడు సరైన అవకాశాలను స్పష్టంగా తెలుసుకోగలుగుతాం.

సాధారణంగా మన జ్ఞేయం బుద్ధిపూర్వకంగా చరిస్తుంది. జాగృతివల్ల కావాలని సత్యాన్ని అవగతం చేసుకోలేం. సాధకుడు చేసే ఆచరణ - ధ్యానం దీర్ఘకాలం కొనసాగే అవధానం (చురుకైన జాగృత స్థితి) ధ్యానం వల్ల కలిగే సత్ఫలితాలు. భారతీయులకు సాధన, అవధానం అనే పదాలతో పరిచయం వుంటుంది. ఇవే ధ్యానంలో కీలకపదాలు. వీటినే కృష్ణమూర్తిగారు ఆచరణాత్మకంగా అందించారు. ఆయన దాదాపు తన జీవితమంతా, పాశ్చాత్య దేశాల్లో గడిపినా మాతృభాషను మరచినా, తన సహజాభిప్రాయాలను వ్యక్తం చేసి భారతీయుల ఆలోచనా రీతులను లేదా ధ్యాన రీతులను స్పష్టపరచారు.

## ఆనంద సామ్రాజ్యం

కృష్ణమూర్తిగారు తమ ప్రసంగాలలో తరచు ఆనంద సామ్రాజ్యం గురించి మాట్లాడుతూ ఉండేవారు. మనలో చాలామంది ఆనంద సామ్రాజ్య ద్వారం తెరవడానికి అవసరమైన తాళపు చెవి కొందరివద్దనే ఉన్నదని నమ్ముతారు. కానీ అది ఎవరివద్దా లేదు. దానిని హస్తగతం చేసుకునే అధికారం ఎవరికీ లేదు. ఆ తాళపుచెవి మీ 'సెల్ఫ్' మాత్రమేనని గుర్తుంచుకోండి అనేవారు. ఆ సెల్ఫ్‌ను ప్రక్షాళన చేసి, ఏనాటికీ క్షీణించని నిత్యత్వం కలదిగా రూపొందించడం ద్వారానే మీకొక శాశ్వత సామ్రాజ్యం లభిస్తుంది అంటారు. ఎన్నడూ క్షీణించని శాశ్వతత్వం మీలో నెలకొన్నదో లేదో ఎవరికి వారే తెలుసుకోవాలి. ఎవరికి ఎవరూ చెప్పరు. చెప్పినా అది సత్యం ఛాయే గానీ అసలు సత్యం కాదు. ఏ జగద్గురువు, ఏ సంస్థ ఎవరి దుఃఖంనుండీ, మానసిక భానిసత్వం నుండీ విముక్తి చేయలేదు. ఎవరికి వారుగా నిర్నిబద్ధమైన స్వేచ్ఛను, ఆనందాన్ని అనుభవించగలగాలి.

## దర్శన వైశిష్ట్యం

జిడ్డు కృష్ణమూర్తి ప్రముఖ దార్శనికుడు. ఒక దార్శకుని జీవితం, బోధనలు ప్రతివారికీ, అన్ని కాలాల్లోను మార్గదర్శకాలుగా ఉపయుక్తమవుతాయి. దేశ, కాలమాన హద్దులెరుగని సత్యాన్ని అనుభవంలోకి తెచ్చుకున్న ద్రష్ట మానవాళిని మేల్కొల్పుతూ తన జీవితాన్ని వారికే అంకితం చేసుకుంటాడు. ఈయన మేధావంతుడైన తాత్వికుడు కాదు. ఏ సిద్ధాంతాన్ని ప్రబోధించలేదు. ఏ సంస్థను నెలకొల్పలేదు. అయితే వారి ప్రత్యేకత ఏమిటి? వారిని దార్శనికులని ఎట్లా అనగలం. వారు ఏ సిద్ధాంతాన్నీ ప్రవచించలేదు. దేనినీ ఖండించలేదు. వారు ప్రపంచంలో నలుమూలలా ఎన్నోవేల ప్రసంగాలు చేశారు. ఆయన గంభీరోపన్యాసాలు ఈయలేదు. వారి ప్రతి ప్రసంగం వింటున్న ప్రతి శ్రోతతో వ్యక్తిగతంగా ఎన్నో విషయాలను చర్చిస్తున్నట్లుండేవి. వారి ప్రతి మాట ప్రతివారిలో నిద్రాణంగా వున్న ఆత్మ జ్ఞానాన్ని (Self knowledge) అవధులు ఎరుగని స్వేచ్ఛను, అవగాహనను అనుభవంలోకి తెచ్చేందుకు దోహదకారులుగా ఉండేవి. ప్రతి వ్యక్తిని తనలోనే ఉన్న జ్ఞానవాహినిని తెలుసుకునేందుకు తగిన ప్రయత్నంచేయమన్నాడు. అన్ని అనర్థాలకు మూలం ఎన్నో పరిమితులకు లోనై, తన మౌలికమైన స్వేచ్ఛను కోల్పోయి, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకై పాకులాడేది వ్యక్తి మనస్సు. నేడు

ప్రపంచంలో భౌతిక సంపద అపారంగా ఉంది. అయినా ఎంతో చీకటి, దారిద్రం, హింస, విద్వేషాలు, కల్లోలం విలయతాండవం చేస్తున్నాయి. దీనికి కారణం ఎన్నో సిద్ధాంతాలకు, సంప్రదాయాలకు, గురువులకు, మతపరమైన క్రతువులకు, సంస్థలకు, నమ్మకాలకు బానిసగా మిగిలేదే వ్యక్తి మనస్సు. ప్రతి వ్యక్తి, తన స్వేచ్ఛ, ముక్తి, ఆనందం, శాంతి తనలోనే ఉన్నదని మరిచి ఎన్నో ఆచారాలకు ఆచార్యులకు బానిస అయి తనని తాను కించపరచుకుంటున్నాడు. తనని తాను కించపరచుకోవటమనేది ఎన్నో దుష్పరిణామాలకు దారితీస్తుంది. అయితే కృష్ణమూర్తి ఎవర్నీ నమ్మవద్దంటాడా? ఎవర్నీ అనుసరించవద్దంటాడా? వారు ఎవర్నీ అనుసరించమనీ చెప్పరు. అనుసరించవద్దనీ చెప్పరు. ఇతని ఆలోచనలను, అభిప్రాయాలను, ఆచార్యులను, సంస్థలను, కుంటివాడు నిత్యం ఉపయోగించుకునే చంక కర్రలు లాగా ఉపయోగించవద్దంటారు. వ్యక్తి తన ఆలోచనలను, ఆచరణలను నిర్నిబద్ధమైన మనస్సుతో అవగాహన చేసుకోమంటారు. అలాంటి అవగాహనే వ్యక్తి ఆత్మ జ్ఞానానికి, తదనుగుణమైన ఆచరణకు దోహదం చేస్తుంది.

కృష్ణమూర్తిగారి ప్రతి పలుకు, ప్రతి మాట, ప్రతివారినీ అన్నివేళలా నిశితంగా తనని తాను ఆలోచించుకునేటట్లు చేస్తాయి. ఇది వారి దర్శనం విశిష్ట లక్షణం. ఎలాంటి సిద్ధాంతాలకు, సంప్రదాయాలకు తాకట్టు పెట్టని మనస్సులు మాత్రమే సంపూర్ణ అవగాహనకు అర్హమవుతాయి. ఆచారాలు, వ్యవహారాలు, సిద్ధాంతాలు, రాద్ధాంతాలతో నిండిన మనస్సులు సత్యాన్ని, స్వేచ్ఛను అనుభవించలేవు. కులాలు, మతాలు, జాతులు, సిద్ధాంతాలు కావాలి. కానీ వాటి నీడలోనే, వాటి ఊతంతోనే జీవితాల్ని వెళ్లతీసుకోవాలన్న మానవాళికి నిజమైన స్వేచ్ఛ, శాంతి తెలియదు. ఎవరో రక్షిస్తారు. ఏదో ఆర్థికవ్యవస్థ మన దరిద్ర్యానికి చరమగీతం పాడగలదు. ఎవరో ఒక మహా మతాచార్యుడు మనకు మోక్షమిస్తాడని నమ్మటం మిణుగు పురుగులను చూచి కాంతిపుంజాలని భ్రమపడటమే. అందువల్ల కృష్ణమూర్తి ప్రసంగాలన్నీ మనల్ని ఆలోచింపచేసి మన మార్గాన్ని మనమే శోధించి, అవగాహన చేసుకొనేందుకు దోహదం చేస్తాయి. ఒక ముక్కలో చెప్పాలంటే కృష్ణమూర్తి దర్శనం ఒక బోధ కాదు. అది మనల్ని సూచనల ద్వారా ఆలోచింపచేస్తుంది. ఆనందాన్నీ, స్వేచ్ఛనూ. స్వావలంబననూ, శాంతినీ ప్రసాదిస్తుంది. అందుకే ఆయనను ఒక సమకాలీన ప్రముఖ భారతీయ దార్శనికునిగా పేర్కొంటారు.

# భాగం - II మరికొందరు తత్వవేత్తలు

ఈ భాగంలో మరికొందరు ముఖ్యులైన తాత్త్వికుల గురించి స్థాలీపులాకన్యాయంగా తెలుసుకొందాం. వీరి గురించి ఎక్కువగా రాయనంత మాత్రాన వీరిని తక్కువ అంచనా వేయగూడదు. వీరందరూ విశాలదృక్పథం కలవారు గనుకనే, ప్రాంతీయ తత్త్వం వారిని ఆకర్షించలేకపోయాయి. అందుకే వారి రచనా రంగాన్ని ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే పరిమితం చేయకుండా యావద్భారతదేశానికి, యావత్ మానవాళికి ఉపయోగంగా వుండే సందేశాలను తాత్త్విక ధోరణిలో రాశారు.

కొందరు తత్త్వవేత్తల ఆలోచనా సరళిని దృష్టిలో పెట్టుకొని కాలక్రమ పద్ధతిని పాటించలేకపోయాను.

## ఆచార్య ఆర్యదేవుడు (క్రీ.శ.2-3 వ శతాబ్దం)

ఆచార్య నాగార్జునుని శిష్యులలో ఆచార్య ఆర్యదేవుడు ప్రముఖుడు. ఇతని జీవితాన్ని గురించి అనేకమైన కథలున్నాయి. కుమార జీవుని రచనల ద్వారా చైనాలో భద్రపరచబడిన గ్రంథాలద్వారా ఇతని జీవితాన్ని గురించిన విషయాలు మనకు తెలుస్తున్నాయి. దక్షిణ భారతదేశంలో ఒక బ్రాహ్మణ కుటుంబానికి చెందిన వాడని కుమారజీవుడు తెలిపి ఉన్నాడు. కాని చైనా యాత్రికుడయిన హ్యూ యన్ సాంగ్ మరొక రకంగా చెప్పాడు. ఆర్యదేవుడు సింహళదేశపు యువరాజని హ్యూ యన్ సాంగ్ భావించాడు. ఇతని జీవితంలో ఆఖరి గడియలు గుంటూరు ప్రాంతంలో గడిపినందున, అక్కడ ఆయన

అస్థికలు లభించి నందువల్ల ఆయన ఆంధ్రుడని కొందరు అభిప్రాయపడ్డారు. అన్ని సంప్రదాయాలు ఇతన్ని ఆచార్య నాగార్జునుని శిష్యుడుగా అంగీకరిస్తాయి. దీనికి విరుద్ధంగా మరే సాక్ష్యాధారాలు లభించలేదు. కనక ఆర్యదేవునికాలం క్రీ.శ. 2-3 శతాబ్దాలుగా మనం నిర్ణయించవచ్చు. ఆంధ్రదేశంలో పుట్టి సింహళం వెళ్ళాడని కొందరు, సింహళంలో పుట్టి ఆంధ్రదేశంలో నివసించాడని కొందరు భావించారు.

ఒకానొక బౌద్ధ ఆరామంలో అశోకవృక్షం కింద ఆచార్య నాగార్జునుడు శిష్యులకు దర్శనశాస్త్ర విషయాలను బోధిస్తున్నప్పుడు ఆయన్ను చూడటానికి ఆర్యదేవుడు రావటం తటస్థించింది. అప్పుడు ఒక శిష్యుడు నాగార్జునుని వద్దకు వచ్చి ఆయన్ను చూడటానికి ఎవరోవచ్చారని చెబుతాడు. అప్పుడు నాగార్జునుడు ఒక గ్లాసునిండా నీరునింపి ఆర్యదేవునికి చూపమనిచెప్పి ఆ శిష్యుని పంపుతాడు. ఆ శిష్యుడు అట్లాగే చేస్తాడు. అప్పుడు ఆర్యదేవుడు అతి సున్నితంగా ఒక సూదిని ఆ నీళ్ళగ్లాసులోవేసి దాన్ని ఆచార్య నాగార్జునునికి ఇవ్వమంటాడు. ఆ గ్లాసు నీళ్ళను చూసినవెంటనే నాగార్జునుడు సంతోషించి ఆర్యదేవుని తన శిష్యునిగా అంగీకరిస్తాడు. ఈ కథలోని ముఖ్యాంశం నాగార్జునుడు పంపిన నీళ్ళ గ్లాసును జ్ఞానంతో పోల్చినట్లయితే ఆ జ్ఞానపు లోతులకు తొణకకుండా చొచ్చుకొని పోగల మేధాశక్తి తనకున్నదని ఆర్యదేవుడు నిరూపిస్తాడు. నాగార్జునుడు వృద్ధాప్యంలో ఉన్నందువల్ల అతను స్థాపించిన మాధ్యమిక బౌద్ధదర్మాన్ని వ్యాప్తి చేయవలసిందిగా ఆర్యదేవుని కోరుతాడు.

ఆర్యదేవుడు ఒక గొప్ప విజ్ఞానవేత్త, తార్కికుడు, ఆధ్యాత్మిక చింతనా సంపన్నుడు. ఇతను 'చతుశ్శతకము' అనే గ్రంథాన్ని రాసాడు. ఈ గ్రంథంలో వైదిక కర్మకాండ నిరసన ముఖ్యంగా కనిపిస్తుంది. ఇదికాక "చిత్తవిశుద్ధి ప్రకరణం", "ద్వాదశనికాయ శాస్త్రం" "హస్తతాక ప్రకరణం" అనే గ్రంథాలనుకూడా రాశాడు.

ఆర్యదేవుడు బోధించిన తత్త్వస్వరూపం, బుద్ధత్వాన్ని పొందినవారు తమ సర్వజ్ఞత్వం చేత సమస్తజీవుల స్వభావాన్ని గుర్తించి వారివారి

ధర్మకీర్తి ఈవిధంగా చెప్పాడు. "ఏవస్తువైనను ఒకే కారణం వల్ల ఉత్పత్తి కాదు. అనేక కారణాల సముదాయం వల్ల ఏర్పడుతుంది. కార్యాల స్వరూప స్వభావాల్లో ఉన్న వైవిధ్యము అకస్మికంగా రాదు. కారణ సామగ్రి నుండే ఆ వైవిధ్యం ఏర్పడుతుంది.

## మనస్సు-శరీరం: వాటి మధ్య సంబంధం

మనస్సు-శరీరం ఈ రెండూ పరస్పరాశ్రితాలా? లేదా వేరు వేరు తత్వాలా? లేదా ఒకటేనా? అనే ప్రశ్నలు చాలా ముఖ్యమైనవి. బౌద్ధులు ఆత్మను అంగీకరించరు. దాని స్థానంలో మనస్సును, చిత్తాన్ని, విజ్ఞానాన్ని ప్రతిపాదించి వాటి ఉనికిని అంగీకరిస్తారు. ఈ మూడు పర్యాయ పదాలు. మనస్సు, శరీరం కాదు. అది శరీరాన్ని ఆశ్రయించుకొని ఉంటుంది. ఇంద్రియాలు మనస్సు కాదు. అవి కూడా శరీరాన్ని ఆశ్రయించుకొని ఉంటాయి. ఇంద్రియాలు లేనిది మనస్సుకు పని లేదు. ఈ ప్రకారంగా చూస్తే బుద్ధి, ఇంద్రియాలు అన్యోన్య హేతుకాలు. అట్లాగే మనస్సు-శరీరం కూడా అన్యోన్య హేతుకాలని తేలుతున్నది. అందువల్ల మనస్సు-శరీరం పరస్పరాశ్రితాలై అవినాభావ సంబంధాన్ని కలిగి ఉంటాయి. మనస్సు ఎప్పుడూ శరీరం కంటే భిన్నం కాదు. అది శరీరం అంశమో (భాగమో) లేదా మనస్సు-శరీరం రెండూ భౌతిక తత్వాల వికాసాలననవచ్చు. అందువల్ల ఆరెండిటి తత్వంలో మౌలిక మైన భేదమేదీ లేదనీ (శరీరంలో నుంచి మనస్సు) అంటే పంచ భూతాల నుంచి చైతన్యం, చైతన్యమే భూతమనే పర్యవసానాన్ని ధర్మకీర్తి అంగీకరించాడు.

ప్రాణం, అపానం,ఇంద్రియాలు, బుద్ధి ఎట్లా ఉత్పన్నమవుతాయి? ఈ ప్రశ్నకు ధర్మకీర్తి ఈవిధంగా సమాధానం చెప్పాడు. తమతో సజాతీయమైన పూర్వకారణమున్నప్పుడే ఇవి ఉత్పన్నమవుతాయి. కేవలం శరీరమున్నప్పుడే ఇవి ఉత్పన్నం కావు. ప్రాణం, అపానం, బుద్ధి, ఇంద్రియాలు ఉన్న శరీరం నుంచే ప్రాణాపాన బుద్ధీంద్రియాలున్న శరీరం ఉత్పన్నమవుతుంది. కాని, ఇవి లేని శరీరం నుంచి, శరీరం ఉన్నప్పటికినీ, మరొక శరీరం ఉత్పన్నం

కాదు. ఈ నియమాన్ని అంగీకరించకపోతే అనేకమైన చిక్కులు వస్తాయి. చనిపోయిన శరీరం కూడా ఉత్పాదనశక్తినీ కలిగి ఉండాలి. కాని అట్లా లేదు. కనక ఏ భూతంలో నుంచైనా మరొక భూతం ఉత్పన్నం కాదు.

**ఆత్మవాద ఖండన : భగవన్నిరాకరణ**

చార్వాక, బౌద్ధ దర్శనాలు తప్ప మిగతా దర్శనాలన్నీ ఆత్మను అంగీకరించాయి. అది ఒక నిత్యసత్యమైన పదార్థమని అందరూ అంగీకరిస్తారు. అటువంటి నిత్యసత్యమైన ఆత్మను బౌద్ధులు అంగీకరించక పోయినప్పటికినీ క్షణక్షణం కాలప్రవాహంలో మార్పుచెందుతూ ఉండే చైతన్యాన్ని బౌద్ధులు అంగీకరిస్తారు. దీన్నే 'సంతానాంతరసిద్ధి', 'స్కంధ సంతానమని' ప్రవాహశీల చైతన్యం అని బౌద్ధులు వ్యవహరించారు. ఈ విజ్ఞాన సంతతి ఒక శరీరం నుంచి మరొక శరీరానికి పోతూ ఉంటుంది. ఈ విధంగా అది నిత్యం, క్షణికంకూడా. విద్యుత్ కన్నా, కాంతికిరణం కన్నా ఎక్కువ వేగంగా ప్రవహించి మార్పుచెందే చిత్త ప్రవాహాన్ని బౌద్ధులు అంగీకరించారు.

అదేవిధంగా భగవంతుడున్నాడని, ఆయన నిత్యుడని, శాశ్వతుడని చెప్పే వాదాన్ని బౌద్ధులు అంగీకరించరు. ఆత్మవాద ఖండన, ఈశ్వర నిరాకరణ బౌద్ధుల దర్శన లక్షణం. వారి ధ్యేయం కూడా అదే. కార్యకారణ సంబంధ వాదాన్ని ఆధారం చేసుకొని ఆత్మనిరాకరణ, ఈశ్వరవాద ఖండన చేశాడు ధర్మకీర్తి.

## శాయనాచార్యుడు (క్రీ.శ.1282-1386)

ఈయన నెల్లూరును పరిపాలించిన కంపన్నవద్ద మంత్రిగా ఉండేవాడు. విజయనగర రాజులకు ముఖ్యమంత్రిగా పనిచేసిన శ్రీ మాధవ విద్యారణ్యస్వామికి ఈయన సోదరుడు. అన్నదమ్ములిరువురూ హైందవానికి పశ్చిమాసియానుంచి వచ్చి బలప్రయోగానికి ప్రాధాన్యమిచ్చే (పిడివాద) ఇస్లాం నుంచి రక్షణ కల్పించాలని నిశ్చయించారు. ఇది ఒక సముచితమైన న్యాయమైన, హేతుబద్ధమైన దేశభక్తి పూరితమైన నిర్ణయం. వీరిరువురూ స్మార్తంలోనూ, వేదాంతంలోనూ, ధర్మశాస్త్రంలోనూ, మీమాంసా దర్శనంలోనూ, జ్యోతిష, వ్యాకరణాలలోనూ అనేక గ్రంథాలు రచించారు.

శాయనాచార్యుని 'ఋగ్వేద భాష్యం' ఒక అమూల్యమైన గ్రంథం. వేదమంత్రాల అర్థాలను వివరించడంలోనూ వేదసూక్తులను వివరించి చెప్పే పద్ధతిలోనూ ఈ గ్రంథానికి సాటియైనది వేరొకటి లేదని పలువురి నమ్మకం. శాయనాచార్యుల తరవాత భాష్యకారులు, తాత్త్విక రచయితలు ఈయన చెప్పిన అర్థాలను, భాష్యాలను ప్రమాణికంగా తీసికొన్నారు. ఏ పదాన్ని ఎక్కడ ఏ విధంగా ప్రయోగించాలి, ఏ పదం, ఏ సందర్భంలో బహుజనసమ్మతమైన, పండితామోదయోగ్యమైన అర్థాన్ని కలిగి ఉన్నదీ తెలుసుకోటానికి చాలామంది భాష్యాన్నే ప్రామాణికంగా తీసికొన్నారు.

కొందరు పాశ్చాత్యులు ఋగ్వేదంపై భాష్యం రాయటానికి శాయనాచార్యులకు అర్హత ఉన్నదా అని ప్రశ్నించారు. ఇది ముఖ్యంగా కాల వ్యవధికి సంబంధించినది. వేదాలు ఎప్పుడో పురాతన కాలంలో రాయబద్ధవికదా. శాయనుడు క్రీ.శ.13వ శతాబ్దివారు కదా. ఈ వ్యవధిలో పదాలు, భావాలు మరుగునపడటమే కాకుండ, ప్రయోగంలో కూడ మార్పులు వస్తాయి కదా అని వీరి ప్రశ్నలు.

ఐతే శాయనుల కాలంలో గురు, శిష్యపరంపర గురించిన పరిజ్ఞానం, ఆయనకు లభ్యమైన భాష్యాలు ఇతరులకు ముఖ్యంగా ఆయన తరవాతి వారికి, పాశ్యాత్యులకు లభ్యమయ్యే అవకాశంలేదు. అందువల్ల ఆయన భాష్యమే ప్రామాణిక మైనదనీ విల్సన్ పండితులు భావించాడు. జె.మ్యూర్ అనే ఆయన శాయన భాష్యం క్లిష్టమైనవనీ కొన్ని విషయాలను ఆయన దాటవేశారనీ భావించాడు. ప్రొఫెసర్ రాత్ వేదవాఙ్మయాన్ని అర్థం చేసికోవాలంటే భాష్యకారులను ఆశ్రయించారు. శాయనుల వ్యాఖ్యాన పద్ధతులనే అనుసరిస్తే పాశ్చాత్యులు ఇంకా కొన్ని కొత్త అర్థాలను, భావాలను ఆవిష్కరించవచ్చునేమో అని రాశాడు. ప్రొఫెసర్ మాక్స్‌ముల్లర్ శాయన భాష్యం హేతుబద్ధమైనదేకాక, ప్రాచీన, ఆర్వాచీన భాష్య పద్ధతుల మధ్య వారధిగా ఉందని ప్రశంసించాడు. ప్రొఫెసర్ గోల్డ్‌స్టికర్, ఇ.బి.కొవెల్ అనేవారు కూడ వేదార్థాలు గ్రహించాలంటే శాయన భాష్యం కంటె వేరు

మార్గంలేదన్నారు. ప్రొఫెసర్ గ్రిఫిల్స్ తన ఋగ్వేదానువాద గ్రంథంలో శాయనాచార్యుని కృషిని ఎంతో ప్రశంసించారు. ఈ విధంగా శాయనాచార్యులవల్ల తెలుగువారి కీర్తి ఇనుమడించింది.

## అన్నంభట్టు (15వ శతాబ్దం)

ఈయన ప్రస్తుతం మహబూబ్‌నగర్ జిల్లా ప్రాంతం నుంచి వచ్చిన తెలుగువాడు. ఈయన ఒక గొప్ప సాహితీవేత్త. ఈయన రాసిన 'తర్కసంగ్రహం' అనే పుస్తకం భారతీయ తర్కశాస్త్రాన్ని వివరించే అమోఘమైన రచన. ఇంతేకాక ఈయన మీమాంస, వేదాంత, వ్యాకరణ గ్రంథాలు కూడ రాశాడు. 'తర్క సంగ్రహం' చాలా ముఖ్యమైన రచన. ఎందుకంటే హేతువాదం ద్వారానే న్యాయ, వైశేషిక దర్శనాలలో పొందుపరచిన విషయాలను అర్థం చేసికోగలం. అన్నంభట్టు సేవలు ఈ కారణంగా మరువరానివి.

## శ్రీరామడుగు శివరామదీక్షితులు (క్రీ.శ. 1680-1791)

శ్రీరామడుగు శిరామదీక్షితులు 'అచల యోగము'ను ఆంధ్రదేశంలో గురుశిష్య సంప్రదాయ రూపంగా వ్యాప్తి చేసిన మహానుభావులలో ఒకరు. ఈతడు వేమనయోగి గురుశిష్య సాంప్రదాయానికి చెందినవాడని ప్రతీతి, వేమనయోగి 'అచలతత్వము'ను తన పద్యాలలో అక్కడక్కడా తెలపగా, దానిని శ్రీదీక్షితులవారు సిద్ధాంతరూపంగా ఉద్ధరించారు. శ్రీ శివరామ దీక్షితులవారు ఆంధ్రప్రదేశ్‌లోని నల్లగొండ జిల్లాలోని నారాయణ పుర సంస్థానంలో రామడుగువారనే వైదిక బ్రాహ్మణ కుటుంబంటో క్రీ.శ. 1690లో జన్మించారు. వీరు మొదట 'అద్వైత సిద్ధాంతాచార్య' గా కీర్తిప్రతిష్ఠలు పొందారు. వీరు శతాధిక జ్ఞాన యజ్ఞాలను కాశీ మొదలుకొని అనేక ప్రాంతాలలో నిర్వహించారు. వీరు అద్వైత సభలను మహారాష్ట్రలోని పండరీపురంలో కూడా నిర్వహించేవారు. ఆ సమయంలో అక్కడ ఉన్న అచల సిద్ధాంతియైన శ్రీధరస్వామి వీరిని రప్పించుకొని, వీరితో వాదించం జరిగింది. ఆ వాదనలో శ్రీశివరామదీక్షితుల వారు ఓడిపోయి, శ్రీధరస్వామికి శిష్యుడై, అద్వైతంకంటె

అచలయోగం శ్రేష్ఠమని గ్రహించారు. ఆ తరవాత అచలయోగం ప్రచారం చేయడానికి దీక్షితులవారు 6 సిద్ధాంత గ్రంథాలను క్రీ.శ.1712 నాటికే రాశారు. వారి గ్రంథాలు 1) బృహద్వాశిష్ఠం అనే శ్రీశివరామదీక్షితీయం (చలాచలవాక్యాలు, సాందీప వాక్యాలు, శంకరాచార్య వాక్యాలు, అఖండానుభవ రహిత ప్రకరణం అనేవాటితో) ప్రథమ భాగంగానూ:2) బృహద్వాశిష్ఠము అనే శ్రీ శివరామదీక్షితీయం (శరీర రహిత ప్రకరణం) ద్వితీయ భాగంగానూ, దీనినే ద్వాదశి భావం అంటారు: 3)బృహద్వాశిష్ఠం అనే శ్రీ శివరామదీక్షితీయం, షోడశి భావం (స్వప్న దృష్టాంతాలు భ్రాంతిరహిత ప్రకరణం). తృతీయ భాగంగానూ: 4) బృహద్వాశిష్ఠం అనే శ్రీ శివరామదీక్షితీయం, అచల, బోధ దృష్టాంతాలు చతుర్థభాగంగానూ 'బృహద్వాశిష్ఠము' అనే గ్రంథాన్ని రాశారు. 5) 'భావార్థ సూత్రాలు'. 6) 'భావార్థ దీపిక సూత్రాలు' రాశారు. ఇవి వీరి రచనలు. వీరు ప్రబోధించిన అచలయోగానికే అచల బోధ అనీ అచల సిద్ధాంతమనీ, అచల పరిపూర్ణ రాజయోగమనీ అచల తత్వమనీ పేర్లున్నాయి. ఈ సిద్ధాంత సారమేమంటే 'పరిపూర్ణమును, ఎరుకను ఎరిగి, ఎరుకను మానుము'. కాబట్టి ఇక్కడ ముఖ్యమైనవి మూడే వాక్యాలు. 1) పరిపూర్ణం. 2) ఎరుక. 3) ఎరుకను విడిచే విధానం. శ్రీ శివరామ దీక్షితుల సిద్ధాంతం ప్రకారం ఈ మూడింటి వివరణ కింద ఇవ్వడం జరిగింది.

**1) పరిపూర్ణం:** దీనినే అచలం, అచల పరిపూర్ణ బ్రహ్మం, బయలు, బట్టబయలు, గురుగుహ్యం, ఉత్తబయలు అని కూడా అంటారు. 'అచల పరిపూర్ణ బ్రహ్మం లేదంటే అంతటా ఉన్నది. ఉన్నదంటే కానరానిది, ఆకాశం వంటిది' అని అచల బోధకుడైన శ్రీశివరామదీక్షితులు తమ గ్రంథంలో చెప్పి ఉన్నారు.

'అచల పరిపూర్ణ బ్రహ్మం పుట్టనిదీ చావనిదీ. మొదలు కొన లేనిది. పట్టువిడుపులు లేనిది. స్వజాతీయ విజాతీయ స్వగత భేదాలు లేనిది. సదసత్తులుగానిది. జ్ఞానకర్మాలు లేనిది. పంచభూతాహంకారమయమైన

జడాజడాత్మక ప్రపంచాన్ని ఎరుగనిది. జడచేతనాల కలయికతో నరుకబడనిది. క్రియాశూన్యమైనది. భోంచెయ్యనిది. ఒక్కటైనా వికారంలేనిది. వస్తు రూపం కానిది. ఆత్మబ్రహ్మాలు కానిది. తాను పుట్టనిది. ఒక దానిని పుట్టించనిది. క్షరాక్షర విలక్షణమైనది. జీవన్ముక్తి, విదేహముక్తి, నిత్యముక్తులు లేనిది. లోపల బయట అనే అరమరికలేక సమస్తమైన వస్తువులయందు చలించక దీనిని స్పృశించక ఉన్నది. వస్తువులయందున్న జడచేతనాలు పోతే ఇది పోయేదికాదు. ఆ జడచేతనాలతో దీనికి ఏ సంబంధం లేదు. ఇది అచ్ఛేద్యమైనది. క్షరాక్షరోపాధి ద్వయదోష రహితమైనది. ప్రకృతి పురుష ద్వయదోషరహితమైనది. విషయీవిషయ ద్వయదోషరహితమైనది. సాక్ష్యసాక్షిద్వయదోష రహితమైనది. షట్కోశరహితమైనది. ఇది శూన్యం కానిది. దేహీదేహములు కానిది. సగుణ నిర్గుణాలు కానిది. పిండ బ్రహ్మాండాలు కానిది. సంకల్పవికల్పాలు లేనిది. సర్వ ద్వంద్వాతీతం. సర్వ త్రిపుటీరహితం' అని శ్రీశివరామ దీక్షితులవారు పరిపూర్ణాన్ని గురించి సూచన చేశారు.

**2. ఎరుక (బ్రహ్మం) :** 'ఎరుక మెరుపువలె ఉన్నాననిపించి వెంటనే ఏమీలేక పొయ్యేది. కల వంటిది' అని ఎరుక గురించి శ్రీశివరామదీక్షితుల వారు తమ 'బృహద్వాశిష్టం' అన్నే గ్రంథంలో తెలిపినారు.

'ఎరుకే పిండబ్రహ్మాండాలు. ఇదే జీవబ్రహ్మాలు. ఇదే దేహీదేహాలు. ఇదే ఖండం, అఖండం. ఇదే ఆత్మానాత్మలు. ఇదే సదసత్తులు. ఇదే శివశక్తులు. ఇదే పంచభూతా హంకారమయమైన జడాజడాత్మక ప్రపంచం. ఇదే నాదబిందు కళలు. ఇదే దేహేంద్రియాలు. ఇదే జ్ఞానాజ్ఞానాలు. ఇదే ప్రకృతీ పురుషులు. దీనికీ, అచల పరిపూర్ణ బ్రహ్మానికి ఏ మాత్రం సంబంధం లేదు. సర్వ సృష్టికి మూలం ఇదే. ఇదే సచ్చిదానందం. ఇదే మూలమాయ. ఇదే సర్వద్విపుటులు. ఇదే సర్వత్రిపుటులు. ఇదే సాక్షి, కర్త, భోక్త, భోగ్యం. ఇదే విక్షేపావరనాలు. ఇదే బీజవృక్షాలు. ఇది తప్ప అంతా పరిపూర్ణ బ్రహ్మమే. ఇదే సచ్చిదానంద బ్రహ్మ. ఇదే సత్యం. జ్ఞానమనంతం బ్రహ్మ. దేహీదేహాలు వేరుగావు. వీటికి అంటక ఉన్నదే అచల పరిపూర్ణ బ్రహ్మం. అచల పరిపూర్ణ

బ్రహ్మం తప్ప మిగిలినదంతా ఎరుకే' ఎరుకే శూన్య స్వరూపమైనది' అని శ్రీదీక్షితులవారి సిద్ధాంతం.

**3. ఎరుకను విడిచే విధానం :** వస్తు నిర్ణయ పద్ధతిగా ఎరుక స్థానస్వరూప స్వభావాలను గురువుతో గుర్తెరిగి, తనలో సర్వమును, సర్వమునందు తనను గాంచి, యోగియై తనకు వేరుగా ఉన్న అచల పరిపూర్ణ బ్రహ్మమునందు తనకు మూలంగానీ, స్థానంగానీ లేదని తెలిసికోవాలి. ఆ తరవాత నేనే బ్రహ్మమునవే భ్రాంతిని వదిలి, ఆ బ్రహ్మంవల్ల కలుగుతున్న జ్ఞానకర్మలను కూడా అంటకుండా సర్వభోగాలతో 'కర్తృత్వ రహిత కర్మాచరణ' చేయడమే ఎరుకను విడిచే విధానం. ఇదే దీక్షితులవారి అభిప్రాయం. ఈ మూడు వాక్యాలను తెలిసికొని ఆచరించినవారికి జననమరణ భ్రాంతిరహితం కలుగుతుందని శ్రీదీక్షితుల వారి సిద్ధాంతం.

## బెల్లంకొండ రామరాయకవి

శ్రీ బెల్లంకొండ రామరాయకవి 1875 సంవత్సరం డిసెంబరు మాసంలో హనుమాయమ్మ, మోహనరాయ దంపతులకు భమిడిపాడు అగ్రహారం, గుంటూరు జిల్లా ఆంధ్రప్రదేశ్‌లో జన్మించాడు. కేవలం 38 సంవత్సరాల అతితక్కువ జీవితకాలంలో 143, ఉత్కృష్ట గ్రంథాలను రచించి, 1914 అక్టోబర్ మాసంలో పరమపదించాడు. ఇతని కృతులలో శాస్త్రగ్రంథాలు, శాస్త్రగ్రంథాలపై విపులమైన వ్యాఖ్యానాలు, కావ్యాలు, కావ్యాలపై వ్యాఖ్యానాలు, వేదాంత ప్రకరణ గ్రంథాలు, స్తోత్రాలు ప్రసిద్ధమైనవి. ఇతని కృతులలో సగంకంటే ఎక్కువ గ్రంథాలు తాళపత్ర రూపంలోనే ఉండిపోయాయి. ఈయన రాసిన కొన్ని ముఖ్యగ్రంథాలను పరిశీలిద్దాం.

**1. శంకర భాష్య విమర్శ :** 3751 పేజీల ఈ గ్రంథంలో విశిష్టాద్వైత మత ప్రవర్తకులైన రామానుజాచార్యుల సిద్ధాంతాల్ని ఖండిస్తూ శంకరుని సూత్రభాష్యమొక్కటే బ్రహ్మ సూత్రాలను తెలుసుకోవడానికి ప్రామాణిక గ్రంథమని నిరూపించాడు.

**2. భగవద్గీతా భాష్యార్క ప్రకాశిక :** ఇది ఈయన అత్యుత్తమ గ్రంథం. భగవద్గీతను అద్వైత పరంగా శంకరాచార్యులు అన్వయించడమే సరైనదనీ మిగతా ఆచార్యుల వ్యాఖ్యానాలు సరికావని వివరించాడు. రెండు సంపుటాలుగల ఈ గ్రంథం 1955లో ప్రచురితమైంది.

**3. శరదాగమము :** వ్యాకరణశాస్త్రంలో ప్రసిద్ధమైన సిద్ధాంత కౌముదిపై వ్యాఖ్యాన గ్రంథమిది. 1985లో కారకాంతం వరకు ఈ గ్రంథం తెలుగు లిపిలో ప్రచురితమైంది.

ఈ శాస్త్రగ్రంథాలేకాక, సముద్రమథనం, రుక్మిణీ పరిణయం, రమాపరిణయం అనే మూడు చంపూ కావ్యాలను, గరుడ సందేశం, కృష్ణలీలాతరింగిణి, సమస్యా రత్నాకరం, సుమనో మనోరంజనం, హయగ్రీవ శతకం, కవి భూషణం అనే కావ్యాలను, కందర్ప దర్పమనే బాణమును, భారత చంపూ, మురారి నాటకం, నైషధ శ్లోకాలపై వ్యాఖ్యానాన్ని రచించాడు. విశ్వరూప గద్యం, హయగ్రీవ దండకం, హనుమద్దండకం అనే గద్య కావ్యాలను జనార్దన, సరస్వతి వీర రాఘవ దేవతలను స్తుతిస్తూ స్తోత్రాలను రచించాడు.

ఈయన రచించిన కింది వేదాంత ప్రకరణ గ్రంథాలను పరిశీలిస్తే విద్యారణ్య, మధుసూదన సరస్వతుల ప్రకరణ గ్రంథాలు గుర్తుకు వస్తాయి. 1. వేదాంత ముక్తావళి (సవ్యాఖ్యానం). 2. శారీరక చతుస్సూత్ర విచారం. 3. వేదాంత కౌస్తుభం. 4. అద్వైత విజయం. 5. దేహదేహీభవ నిర్మూలనం. 6. వేదాంత నిశ్చయం. 7. మోక్ష ప్రసాదం. 8. అద్వైతాన్యమత ఖండనం. 9. సిద్ధాంత సింధు. 10. అద్వైతామృతం. 11. వేదాంత దీపిక. 12. వేదాంత దినకరం. 13. వేదాంత సంగ్రహం అడుగడుగునా అద్వైతాన్ని సమర్థిస్తూ విశిష్టాద్వైత, ద్వైతాల్ని ఖండిస్తూ ఈయన చూపిన ప్రతిభ ప్రశంసనీయం.

# ఉపయుక్త గ్రంథాలు


1. వెంకటరెడ్డి,ఆర్, **సమకాలీన భారతీయ దర్శనం**, తెలుగు అకాడమి, హైదరాబాదు, 1999.
2. వెంకటరెడ్డి,ఆర్, **భారతీయ దర్శనం**, తెలుగు అకాడమి, హైదరాబాదు, 2009.
3. సుందరరామయ్య,జి, **భారతీయ తత్త్వశాస్త్రం-సమగ్ర పరిశీలన**, తెలుగు అకాడమి, హైదరాబాదు,1988.
4. సంపాదకులు, **తెలుగు**, త్రైమాసిక వైజ్ఞానిక పత్రిక, తెలుగు అకాడమి, హైదరాబాదు, అక్టోబర్-
డిసెంబర్, 2000. సంపుటి:29, సంచిక:4
5. Chatterjee, S.C, & Datta, D.M, **An Introduction to Indian Philosophy**, Rupa Publications, India
Pvt, Ltd. Seventh Impression. 2012. New Delhi. 110 002.

Blank Page

ఆ॥ ఉత్తమోత్తముండు తత్వజ్ఞుడిల మీద
మహిమ జూపు వాడు మధ్యముండు
వేషధారి యుదర పోషకుడధముండు
విశ్వదాభి రామ వినురవేమ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రాష్ట్ర సాంస్కృతికశాఖ, సాంస్కృతిక మండలి

ప్రచురణ, ముద్రణ & పంపిణీ
తెలుగు అకాడమి
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు భాషా సంస్థ
హిమాయత్‌నగర్, హైదరాబాదు
email : info@teluguacademy.net
web : www.teluguacademy.net